సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 202

శుక్రవారం 7-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



శార్దూల్ ధనాధన్..

బెంగళూరుపై 81 పరుగుల తేడాతో గెలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ - 13లో



ఎక్కడి రేటు అక్కడే!

ఆర్‌బీఐ అనూహ్య నిర్ణయం.. కీలక రెపోరేటు 6.5% కొనసాగింపు - 13లో



ట్రంప్ భవిష్యత్తు ఏమిటో?

మళ్లీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో నిలబడాలని ట్రంప్ భావిస్తుండగా.. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యమేనా? అని చర్చ జరుగుతోంది.

వివరాలు 6లో ▶



అక్రమార్జనపై పోరు

అవినీతి, బంధుప్రీతి, శాంతిభద్రతల సవాళ్లను రూపుమాపేందుకు బీజేపీ అవిశ్రాంతంగా కృషిచేస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▶



కెనడాలో విద్వేష రాతలు

కెనడాలోని స్వామినారాయణ ఆలయ గోడపై 'హిందుస్తాన్ ముర్దాబాద్, మోదీని ఉగ్రవాదిగా ప్రకటించాలి' అని నల్లరంగుతో రాశారు.

వివరాలు 6లో ▶



బడ్జెట్ సమావేశాలకు తెర

రెండో దఫా బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. రాజ్యసభలో 31 గంటలు, లోక్‌సభలో 45 గంటలే సభా కార్యకలాపాలు కొనసాగాయి.

వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్


ప్రజలకు ఏం మేలు చేశారని టీడీపీకి ఓటేయాలి?



రానున్న సార్వత్రిక ఎన్నికలతో టీడీపీ పనైపోతుందని.. ఓటుతో ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గత పాలనలో టీడీపీ ఏం ఉద్ధరించిందని ప్రజలు వారికి ఓటు వేయాలని ప్రశ్నించారు.

వివరాలు 10 ▸

వైభవంగా కోదండ రాముడి రథోత్సవం



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చెక్క భజనలు, కోలాట ప్రదర్శనల నడుమ భక్తులు శ్రీరామ నామం జపిస్తూ రథాన్ని ముందుకు లాగారు.

వివరాలు 5 ▸

గ్రేడ్-2 వీఆర్వోల ప్రమోషన్‌కు మార్గం సుగమం



గ్రేడ్-2 వీఆర్వోలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్ చానల్ కల్పించింది. ఈ మేరకు ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ సర్వీస్ రూల్స్‌ను సవరిస్తూ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు 3 ▸



పల్నాడు జిల్లా లింగంగుంట్లలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమిది

'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభోత్సవంలో సీఎం జగన్

వైద్య ఆరోగ్య చరిత్రలో గొప్ప మార్పునకు శ్రీకారం

- ఇక గ్రామంలో ఇంటి ముంగిటికే అన్ని వైద్య సేవలు
- మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దే వైద్యం
- అందుకే ఖర్చుకు వెనుకాడకుండా విప్లవాత్మక కార్యక్రమాలు
- ప్రభుత్వాస్పత్రుల్లో 49 వేల ఉద్యోగాల భర్తీ
- రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం
- చంద్రబాబుకు తెలిసింది దోచుకో.. పంచుకో.. తినుకో..
- లంచావతారాలు, గజ దొంగలు, మంచావతారాలు, పరాన్న జీవులు
- ఫలానా మంచి పని చేశామని చెప్పుకోలేని దుస్థితి
- వారికి జిత్తులు, ఎత్తులు, పొత్తులు, కుయుక్తులు మాత్రమే తెలుసు

2 లో

" సామాన్యుడికి వైద్యం అందించే విషయంలో దేశ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని ఒక గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టాం. ఇంటింటా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, ఏ పేదవాడు కూడా వైద్యం కోసం ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని.. ఆరోగ్య భరోసా ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాం. ఈ రోజు పెన్షన్లు ఏ మాదిరిగా మీ ఇంటికి నడిచి వస్తున్నాయో.. అదే మాదిరి వైద్య సేవలు కూడా మీ గ్రామానికి, మీ సమీపానికి.. అవసరమైన సందర్భాల్లో మీ ఇంటికి కూడా కదిలి వచ్చే కార్యక్రమమే ఫ్యామిలీ డాక్టర్.

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అవును మళ్లించాం

సీఐడీ విచారణలో మార్గదర్శి ఎండీ శైలజ



విచారణ అనంతరం శైలజా కిరణ్ నివాసం నుంచి బయటకు వస్తున్న సీఐడీ అధికారులు

- చిట్‌ఫండ్ చట్టమే తెలీదు.. అసలది మాకు వర్తించదు
- మా చట్టాలు మాకున్నాయ్
- తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తామంటూ బుకాయింపు
- లేని చెక్కులు బ్యాలన్స్‌షీట్‌లో ఎలా చూపామో నాకు తెలీదు
- అవన్నీ మీకు చెప్పం... ప్రధాన కార్యాలయం రికార్డులూ చూపించం
- ఆధారాలతో సీఐడీ ప్రశ్నించడంతో నీళ్లు నమిలిన శైలజ
- దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి ఆడిటర్లతో మంతనాలు
- నాకు తెలియదు.. గుర్తు లేదంటూ దాటవేత
- సోదాల్లో లభ్యమైన పత్రాలను ల్యాప్‌టాప్‌లో చూపించిన అధికారులు

3 లో

57 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఎనిమిది జిల్లాల కలెక్టర్లకు స్థానభ్రంశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 57 మంది ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఎనిమిది జిల్లాల కలెక్టర్లకు స్థానభ్రంశం కల్పించింది. పలు జిల్లాల జాయింట్ కలెక్టర్లను బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

2 లో



డాక్టర్ రోబోతో విశాఖ ఎస్సీ గురుకుల విద్యార్థులు జెస్సికా, కె.వర్షిణి, కె.రేష్మా

డాక్టర్ రోబో

- విశాఖ ఎస్సీ గురుకుల విద్యార్థినుల వినూత్న ఆవిష్కరణ
- రోగ లక్షణం చెబితే మందులు ఇస్తుంది
- ఏ రోగానికి ఏ డాక్టర్‌కి చూపించాలి.. డాక్టర్ ఖాళీగా ఉన్నారా లేదా చెబుతుంది
- అటల్ టింకరింగ్ ల్యాబ్ మరథాన్ 2021-22లో మనోళ్ల సత్తా
- జాతీయ స్థాయిలో 7వేల ప్రాజెక్టులు పోటీపడగా.. టాప్ టెన్‌లో మన విద్యార్థుల ప్రాజెక్టు
- మేథస్సులో ఎస్సీ గురుకుల విద్యార్థుల హ్యాట్రిక్
- బెంగళూరులో ఈ నెల 9-13 వరకు ప్రపంచ ప్రతినిధులకు ఈ ప్రాజెక్టుల ప్రదర్శన

14 లో

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

- 175 నియోజక వర్గాల్లో 14 రోజులపాటు నిర్వహణ: సజ్జల
- 1.60 కోట్ల కుటుంబాలను కలుసుకోనున్న గృహ సారథులు, కన్వీనర్లు
- నాడు – నేడు పాలనలో వ్యత్యాసాన్ని వివరిస్తూ ఇంటింటికీ
- ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు
- దేశంలో అధికార పార్టీ ఈ స్థాయిలో ప్రజలతో మమేకమై సర్వే చేయడం ఇదే తొలిసారి

3 లో



- కార్యక్రమం పూర్తయ్యాక ప్రజా సర్వే ఫలితాలను వెల్లడిస్తాం
- ప్రభుత్వ సేవలను అందిస్తున్న వలంటీర్లు పాల్గొంటే తప్పేమిటి?

దరిద్రం పట్టుకుంది చంద్రబాబుకే



- అధికార దాహం తోనే రంకెలు
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- డిజైన్ ప్రకారమే 45.72 మీటర్ల ఎత్తుతోనే పోలవరం నిర్మాణం
- 41.15 మీటర్లకు తగ్గించినట్లు నాదెండ్ల నిరూపించగలరా?
- టీడీపీ తానా అంటే.. వారాహి బ్యాచ్ తందానా

10 లో

బండి సంజయ్‌కు బెయిల్



- షరతులతో మంజూరు చేసిన హనుమకొండ కోర్టు
- నేడు ఉదయం కరీంనగర్ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం

10 లో

వేసవిలో అరుదైన వాతావరణం



వేసవి ఆరంభంలో అరుదైన వాతావరణం నెలకొంది. మూడు వారాల నుంచి ద్రోణి, ఆవర్తనాలు కొనసాగుతుండగా.. 20 రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అక్కడక్కడా భారీ వర్షాలు పడుతుండగా.. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులు కూడా సంభవిస్తున్నాయి. సముద్రం నుంచి వచ్చే తేమగాలులే ఇందుకు కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మే నెల ఆరంభం నుంచి వేసవి తీవ్రత గణనీయంగా పెరుగుతుందని పేర్కొంటున్నారు.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



తొందర పడకండి.. ఈ వయస్సులో పార్టీ మారినా.. చేసేదేమీ లేక అక్కడా ఇలానే కూర్చోవాల్సిందే!!



- దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిమెన్షియా బాధితులు
- దేశంలో సగటున 7.4 శాతం మంది బాధితులు
- అత్యధికంగా జమ్మూ కశ్మీర్‌లో 11 శాతం
- 65 ఏళ్ల తరువాత వచ్చే చిత్తవైకల్యం 50 దాటాక వచ్చేస్తోంది
- మహిళల్లోనూ బాధితులు అధికమే
- దురలవాట్లతో పాటు వారసత్వంగానూ రావచ్చంటున్న వైద్యులు

గుర్తుండట్లేదు గురూ!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చిత్తవైకల్యం (డిమెన్షియా) అనేది జ్ఞాపకశక్తి, ఆలోచన, సామాజిక సామర్థ్యాలను ప్రభావితం చేసే లక్షణాల సమూహాన్ని వివరించేందుకు ఉపయోగించే పదం. ఇది ఒక నిర్దిష్ట వ్యాధి కాదు. జ్ఞాపకశక్తి కోల్పోవడమే దీని లక్షణం అయినప్పటికీ.. దీనికి అనేక కారణాలు ఉంటాయి. చిత్తవైకల్యానికి అల్జీమర్స్ వ్యాధి, వాస్కు డిమెన్షియా, ఫ్రంటోటెంపోరల్ డిమెన్షియా, లెవీ బాడీ డిమెన్షియా అనే సమస్యలు ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా మతిమరుపు జబ్బు బాధితులు పెరిగిపోతున్నారు. దేశవ్యాప్తంగా 60 ఏళ్లు దాటిన వారిలో సగటున 7.4% మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్టు తేలింది. జమ్మూ కశ్మీర్‌లో మతిమరుపు బాధితులు దేశంలోనే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంతో పాటు ఎయిమ్స్ వైద్యులు నిర్వహించిన తాజా పరిశోధనలో ఈ విషయాలు తేటతెల్లమయ్యాయి.

50 ఏళ్లు దాటినోళ్లకూ వచ్చేస్తోంది

గతంలో 65 ఏళ్లు దాటిన వృద్ధులే చిత్తవైకల్యం బారినపడేవారు. వీరిలో అత్యధికులు అల్జీమర్స్‌తో బాధపడేవారు. ఇప్పుడా వయసు 60కి తగ్గిపోగా.. 50-55 ఏళ్ల వారిలోనూ ఈ సమస్య కనబడుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇందుకు అల్జీమర్స్‌తోపాటు ఇతర డిమెన్షియా కారణాలు కూడా ఉన్నట్టు గుర్తించారు. దీనివల్ల దేశంలో లక్షలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయని పరిశోధనలో వెల్లడైంది. ఈ జబ్బు బారిన పడుతున్న వారిలో మహిళలు కూడా ఎక్కువగానే ఉన్నట్టు తేలింది. రకరకాల ఒత్తిళ్లు, ఆహారపు అలవాట్లు, దీర్ఘకాలికంగా వాడుతున్న మందులు తదితర కారణాలతో చిత్త వైకల్యం బాధితుల సంఖ్య ఏటా పెరుగుతోంది. వీరి సంరక్షణ ఆయా కుటుంబాలకు భారంగా మారింది.

ప్రధాన కారణాలివీ

- వారసత్వంగా సంక్రమించే అవకాశాలు ఎక్కువ.
- 60 ఏళ్లు దాటిన వారిలో మెదడులో అసిటైల్ కోలిన్ అనే రసాయనిక ద్రవం తగ్గడం వల్ల వస్తుంది.
- ప్రోటీన్లు మెదడు కణజాలంలో చేరడం వల్ల కూడా సంక్రమిస్తుంది.. దీర్ఘకాలంగా మద్యం లేదా మత్తు పదార్థాలు సేవిస్తున్న వారిలో వచ్చే అవకాశం ఎక్కువ.
- దీర్ఘకాలంగా నిద్రమాత్రలు వాడుతున్న వారిలోనూ వస్తుంది.
- దీర్ఘకాలికంగా మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పుడు మతిమరుపు బారినపడే అవకాశాలెక్కువ.

తలెత్తే సమస్యలివీ

- చిత్త వైకల్యం బారిన పడినవారు సరైన నిర్ణయాలు తీసుకోలేరు.
- ఏ విషయాన్నీ తొందరగా అర్థం చేసుకోలేరు.
- అసాధారణమైన ఆలోచనలకు గురవుతుంటారు. ఇబ్బందికరంగా ప్రవర్తించడం అంటే రకరకాల అనుమానాలు..
- అడిగిందే మళ్లీ మళ్లీ అడగడం.. తాము ఎక్కడ ఉన్నది మరచిపోవడం
- తీవ్ర ప్రభావం ఉన్నప్పుడు దారితప్పి నడుచుకుంటూ వెళ్లడం.

రాష్ట్రాల వారీగా బాధితులు (శాతాల్లో..)	జమ్మూ కశ్మీర్	హిమాచల్‌ప్రదేశ్	ఉత్తరప్రదేశ్	అస్సాం	ప. బెంగాల్	ఒడిశా	మహారాష్ట్ర	ఆంధ్రప్రదేశ్	కర్ణాటక	కేరళ	తెలంగాణ
	11	8.4	7.9	8.5	9.2	9.9	7.6	7.7	7.6	8.3	8.3

57 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

ఎనిమిది జిల్లాల కలెక్టర్లకు స్థానభ్రంశం

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
1. జి.అనంతరాము	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మైనార్టీ సంక్షేమ శాఖ
2. ఆర్‌పీ సిసోడియా	--	ఏపీ మానవవనరుల అభివృద్ధి సంస్థ, డీజీ
3. బి.శ్రీధర్	ఎండీ, జెన్‌కో	సభ్య కార్యదర్శి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి
4. సౌరబ్ గౌర్	కార్యదర్శి, ఐటీఈసీ	రెసిడెంట్ కమిషనర్, ఏపీ భవన్, ఢిల్లీ
5. కోన శశిధర్	కమిషనర్, పంచాయతీ రాజ్	కార్యదర్శి, ఐటీఈసీ
6. కె.హర్షవర్ధన్	డైరెక్టర్, సాంఘిక్ష సంక్షేమ శాఖ	కార్యదర్శి, ఏపీ ఎస్సీ కమిషన్
7. ఎంవీ శేషగిరిబాబు	కమిషనర్, ఇంటర్మీడియట్ విద్య	కమిషనర్, కార్మిక శాఖ
8. హరిజవహర్‌లాల్	కమిషనర్, దేవదాయ శాఖ	కార్యదర్శి, కార్మిక శాఖ
9. ప్రవీణ్‌కుమార్	కమిషనర్, పురపాలక శాఖ	ఎండీ, ఏపీఐఐసీ
10. ఎస్.సత్యనారాయణ	ఎండీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	కమిషనర్, దేవదాయశాఖ
11. పి.బసంతకుమార్	కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా	ఎండీ, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్
12. ఎ.సూర్యకుమారి	కలెక్టర్, విజయనగరం జిల్లా	కమిషనర్, పంచాయతీరాజ్
13. పి.కోటేశ్వరరావు	కలెక్టర్, కర్నూలు జిల్లా	కమిషనర్, పురపాలక శాఖ
14. కేవీఎన్ చక్రధర్‌బాబు	కలెక్టర్, నెల్లూరు జిల్లా	ఎండీ, ఏపీ జెన్‌కో
15. ఎం.హరినారాయణ్	కలెక్టర్, చిత్తూరు జిల్లా	కలెక్టర్, నెల్లూరు జిల్లా
16. ఎస్.నాగలక్ష్మి	కలెక్టర్, అనంతపురం జిల్లా	కలెక్టర్, విజయనగరం జిల్లా
17. ఎన్.ప్రభాకర్‌రెడ్డి	–	సంయుక్త కార్యదర్శి, సీసీఎల్‌ఏ
18. ఎస్.షన్‌మోహన్	డైరెక్టర్, గ్రామ వార్డు సచివాలయాలు	కలెక్టర్, చిత్తూరు జిల్లా
19. ఎస్.సృజన	డైరెక్టర్, పరిశ్రమల శాఖ	కలెక్టర్, కర్నూలు జిల్లా
20. విజయకృష్ణన్	కలెక్టర్, బాపట్ల	డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ
21. రంజిత్‌బాషా	కలెక్టర్, కృష్ణా	కలెక్టర్, బాపట్ల
22. పి.రాజాబాబు	కమిషనర్, జీవీఎంసీ	కలెక్టర్, కృష్ణా జిల్లా
23. జి.క్రిస్టి కిషోర్‌కుమార్	డైరెక్టర్, మైనార్టీ సంక్షేమ శాఖ	జీఏడీలో రిపోర్టు చేయాలి
24. పి.అరుణ్‌బాబు	జేసీ, ఏలూరు జిల్లా	కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా
25. ఎం.గౌతమి	సీఈవో, ఈఎంసీ, తిరుపతి	కలెక్టర్, అనంతపురం జిల్లా
26. డి.లావణ్యవేణి	డైరెక్టర్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్	జేసీ, ఏలూరు జిల్లా
27. ఎం.విజయసునీత	డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ	డైరెక్టర్, మహిళా శిశు సంక్షేమ శాఖ
28. ఎ.సిరి	డైరెక్టర్, మహిళా శిశుసంక్షేమ శాఖ	జేసీ, పార్వతీపురం మన్యం జిల్లా
29. జె.వెంకట మురళి	జేసీ, ప.గోదావరి జిల్లా	డైరెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ
30. ఎస్.రామసుందర్‌రెడ్డి	జేసీ, కర్నూలు జిల్లా	జేసీ, ప.గోదావరి జిల్లా
31. సీఎం సాయికాంత్ వర్మ	జేసీ, వైఎస్సార్ జిల్లా	కమిషనర్, జీవీఎంసీ
32. తమీమ్ హన్సారియా	జేసీ, అన్నమయ్య జిల్లా	జీఏడీలో రిపోర్టు చేయాలి
33. చామకూరి శ్రీధర్	సంయుక్త కార్యదర్శి, సీసీఎల్‌ఏ	జేసీ, ప్రకాశం జిల్లా
34. ఎస్.వెంకటేశ్వర్	జేసీ, చిత్తూరు	కమిషనర్, ఏపీ వైద్య విధాన పరిషత్
35. వి.వినోద్‌కుమార్	కమిషనర్, ఏపీ వైద్య విధాన పరిషత్	ఎండీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
36. బి.నవ్య	పీవో, ఐటీడీఏ, సీతంపేట	డైరెక్టర్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనీ
37. పి.సంపత్‌కుమార్	ఎండీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్	జేసీ, ఎన్టీఆర్ జిల్లా
38. జి.గణేష్‌కుమార్	సంయుక్త కార్యదర్శి, సీసీఎల్‌ఏ	జేసీ, వైఎస్సార్ జిల్లా
39. ఒ.ఆనంద్	జేసీ, పార్వతీపురం మన్యం జిల్లా	జాయింట్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ, విశాఖపట్నం.
40. మహేష్‌కుమార్ రావిరాల	అదనపు కమిషనర్, పంచాయతీ రాజ్	కమిషనర్, కాకినాడ కార్పొరేషన్
41. గోపాలకృష్ణ రోణంకి	పీవో, ఐటీడీఏ, పాడేరు	అడిషనల్ డైరెక్టర్, సర్వే సెటిల్‌మెంట్స్
42. అనుపమ అంజలి	కమిషనర్, తిరుపతి కార్పొరేషన్	జీఏడీలో రిపోర్టు చేయాలి
43. నారాపరెడ్డి మౌర్య	--	కమిషనర్, తిరుపతి కార్పొరేషన్
44. కల్పనాకుమారి	--	పీవో, ఐటీడీఏ, సీతంపేట
45. బి.శ్రీనివాసరావు	అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎస్ఎస్‌ఏ	స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎస్ఎస్‌ఏ
46. కె.వెట్రి సెల్వి	స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎస్ఎస్‌ఏ	జీఏడీలో రిపోర్టు చేయాలి
47. అమిలినేని భార్గవ్ తేజ	కమిషనర్, కర్నూలు కార్పొరేషన్,	అదనపు డైరెక్టర్, పంచాయతీ రాజ్ శాఖ
48. హిమాంశు కౌశిక్	అదనపు కమిషనర్, ఏపీ భవన్	జేసీ, అన్నమయ్య జిల్లా
49. పృథ్వీతేజ్ ఇమ్మడి	ఉప కార్యదర్శి, ఇంధన శాఖ	సీఎండీ, ఏపీఈపీడీసీఎల్
50. ఎం.జాహ్నవి	డైరెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ	జేసీ, అనకాపల్లి
51. శ్రీవాస్ నుపుర్ అజేయ్‌కుమార్	జేసీ, ఎన్టీఆర్ జిల్లా	సంయుక్త కార్యదర్శి, సీసీఎల్‌ఏ
52. వి.అభిషేక్	సబ్ కలెక్టర్, పాడేరు	పీవో, ఐటీడీఏ, పాడేరు
53. వికాశ్ మర్మత్	అదనపు డైరెక్టర్,గ్రామ, వార్డు సచివాలయాలు	జేసీ, కర్నూలు జిల్లా
54. పి.శ్రీనివాసులు	అదనపు డైరెక్టర్, సర్వే సెటిల్‌మెంట్స్	జేసీ, చిత్తూరు జిల్లా
55. ఎం.అభిషిక్త్ కిశోర్	జేసీ, ప్రకాశం జిల్లా	ఉప కార్యదర్శి, ఆర్థిక శాఖ
56. ఎస్.సురేష్‌కుమార్	కమిషనర్, పాఠశాల విద్య	కమిషనర్, పాఠశాల విద్య, కమిషనర్ ఇంటర్మీడియట్ విద్య (అదనపు బాధ్యతలు)
57. జి.వీరపాండ్యన్	ఎండీ, పౌర సరఫరాల సంస్థ	ఎండీ, పౌరసరఫరాల సంస్థ, డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ (అదనపు బాధ్యతలు)



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు



పలు రకాల ఔషధాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి . చిత్రంలో మంత్రి విడదల రజిని తదితరులు

ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమిది



'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభోత్సవంలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే రోల్ మోడల్‌గా, వైద్య ఆరోగ్య రంగంలో నూతన అధ్యాయంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ విధానం రాబోయే రోజుల్లో దేశం మొత్తం మన వద్ద కాపీ చేసుకుని, అమలు చేసే రోజు వస్తుందని ఆకాంక్షించారు. మనిషి ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వంగా ఈ కార్యక్రమం మొదలు పెడుతున్నామని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగం గుంట్ల గ్రామంలో గురువారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. అక్కడి విలేజ్ క్లినిక్‌ను సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలు, చేస్తున్న పరీక్షలు, అందుబాటులో ఉన్న మందుల గురించి వైద్య సిబ్బందితో ఆరా తీశారు. గ్రామంలో ఎంత మందిని స్క్రీనింగ్ చేశారు.. ఎంత మందికి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయి.. వాటిని యాప్‌లో ఎలా నమోదు చేస్తున్నారన్న విషయాన్ని అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. 'ఇక డాక్టర్ కోసం మీ గ్రామం నుంచి ఎక్కడెక్కడికో పట్టణాలకు పోవాల్సిన అవసరం లేదు. డాక్టరే మీ గ్రామానికి వస్తాడు. మీ ఇంటి చేరువకే వస్తాడు. మీ కుటుంబం కోసం, మన పేదల కోసం అక్కడికే వైద్యుడితో పాటు వైద్య సేవలు కూడా వస్తాయి. అక్కడే మీ జబ్బుల గురించి తెలుసుకుని, అక్కడే మందులు ఇచ్చే గొప్ప కార్యక్రమమే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్' అని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే..

తొలి దశలోనే జబ్బులను గుర్తించవచ్చు

- పేదలు, పేద సామాజిక వర్గాల వారు హాస్పిటల్స్ చుట్టూ, వైద్యుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పరీక్షలు చేయించుకోవడం కోసం పరీక్ష కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ఆధునిక వైద్యాన్ని మీ గ్రామంలోనే ఉచితంగా అందించడానికే ఈ విధానం తీసుకువచ్చాం. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల గడప వద్దే అవసరమైన వైద్యం అందజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని తీసుకువస్తున్నాం.
- 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్' అని ఒక నానుడి. జబ్బులు ముదరకుండా.. రాకుండా కాపాడేందుకు ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకువచ్చాం. దీనివల్ల బీపీ, షుగర్, ఇతరత్రా రోగాలను తొలి దశలోనే కనుక్కోగలుగుతాం. వాళ్లకు వెంటనే వైద్యం అందించి, ముదరకుండా కాపాడగలుగుతాం. ఇది ఒక్క బీపీ, షుగర్‌లకు మాత్రమే కాకుండా క్యాన్సర్, గుండె జబ్బులు, టీబీ వరకూ ప్రతి పేదవాడికి ఒక రక్షణ చక్రంగా నిలుస్తుంది.

మన గ్రామానికి నడిచి వచ్చిన గొప్ప వ్యవస్థ

- ఇదే లింగంగుంట్ల వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఏకంగా 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు చేయడం కోసం డయాగ్నస్టిక్ కిట్స్ అందుబాటులో ఉన్నాయి. వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది. ఎవరికి బాగా లేకపోయినా విలేజ్ క్లినిక్‌కు వెళితే స్పెషలిస్టు డాక్టర్లు సైతం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యం అందించే గొప్ప వ్యవస్థ ఈ రోజు మన గ్రామానికే నడిచి వచ్చింది.
- ప్రతి 2,000–2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశాం. ఇందులో బీఎస్సీ నర్సింగ్ చేసిన వ్యక్తి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)గా ఉంటారు. మరో ఏఎన్‌ఎం కూడా అందుబాటులో ఉంటుంది. వీళ్లిద్దరే కాకుండా ఆశా వర్కర్లు విలేజ్ క్లినిక్‌లో రిపోర్టు చేసే వ్యవస్థ ఆవిర్భవించింది. తద్వారా ప్రతి పేదవాడికి 24 గంటలపాటు వైద్యం అందించవచ్చు.
- విలేజ్ క్లినిక్‌లను మండలానికి రెండు పీహెచ్‌సీలకు అనుసంధానం చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. ఇందులో ఒక డాక్టర్ ఓపీ చూస్తుంటే.. రెండో డాక్టర్ కదిలే వైద్యశాల అయిన 104 వాహనం ఎక్కి, ప్రతిరోజూ తనకు కేటాయించిన గ్రామాల్లోకి వెళ్తాడు. అక్కడి విలేజ్ క్లినిక్స్‌తో అనుసంధానమై సేవలు అందిస్తాడు.



జగనన్నే మా భవిష్యత్తు అని నినదిస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న యువతులు

మండలానికి నలుగురు డాక్టర్లు

- మండలానికి రెండు పీహెచ్‌సీలు.. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు.. అంటే ప్రతి మండలానికి నలుగురు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. వీరు డ్యూటీలు మార్చుకుంటూ ప్రజలకు సేవ చేస్తారు. ప్రతి డాక్టరు కూడా తనకు కేటాయించిన గ్రామానికే తాను వెళ్తాడు కాబట్టి.. ఆ డాక్టర్ పేరు, మొబైల్ నంబరు ప్రతి విలేజ్ క్లినిక్‌లో, ప్రతి గ్రామ సచివాలయంలో పెద్ద అక్షరాలతో డిస్‌ప్లే చేస్తారు. ఆ గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా డాక్టర్ మీకు అందుబాటులో ఉంటాడు అనే భరోసా ఉంటుంది.
- నెలకు రెండు నుంచి నాలుగుసార్లు అదే గ్రామానికి వచ్చి వైద్యం అందిస్తాడు. తద్వారా ఆ డాక్టరుకు ఆ గ్రామంలో ఉన్న ప్రతి వ్యక్తిని పేరు, పేరున పిలిచే పరిచయం ఏర్పడుతుంది. అదే ఫ్యామిలీ డాక్టర్ విధానం. ఈ కాన్సెప్ట్‌ను అమలు చేయాలని ఆలోచన వచ్చినప్పుడు, ఒక పద్ధతి ప్రకారం ముందు చూపుతో 104 వాహనాలు కొనుగోలు చేయడం, విలేజ్ క్లినిక్‌లు స్థాపించడం, ముందుగానే వైద్యులు, సిబ్బంది నియామకం, ఆరోగ్యశ్రీకి సంబంధించిన యాప్స్ తయారు చేయడం, అవి డౌన్లోడ్ చేసి వినియోగించే విధానం వీళ్లందరికీ నేర్పించాం.

చిలకలూరిపేటకు వరాలు

చిలకలూరిపేటలో రూ.150 కోట్లతో తాగునీటి కోసం పనులు జరుగుతున్నాయి. దీనికి మున్సిపల్ వాటాగా ఖర్చు పెట్టాల్సిన రూ.63 కోట్లు కావాలని మంత్రి విడదల రజిని అడిగింది. దీన్ని మంజూరు చేస్తున్నా. అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, బీసీ భవన్, కాపు భవనాలను మంజూరు చేస్తున్నా. ముస్లిం శ్మశానం, దర్గా నిర్మాణం కోసం 3 ఎకరాల భూమిని మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నా. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతులకు ప్రతిపాదనలు రాగానే వాటిని కూడా పూర్తి చేస్తాం.

రెండు పథకాల మీదే రూ.10 వేల కోట్లు

- ఆరోగ్యశ్రీ అనగానే దివంగత నేత రాజశేఖరరెడ్డి పేరు అందరికీ గుర్తుకు వస్తుంది. ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పేదవాడికి చేరువగా, ఉచితంగా తీసుకువచ్చారు. వైఎస్సార్ తదనంతరం ఈ పథకాన్ని నీరుగార్చుతూ వచ్చారు. చంద్రబాబు హయాంలో ఈ పథకంలోని ప్రొసీజర్స్‌ను 1000కి కట్టడి చేశారు. రూ. 800 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు.
- మనందరి ప్రభుత్వం రాగానే ఆ బకాయిలను చెల్లించడమే కాకుండా, ప్రొసీజర్స్‌ను ఏకంగా 3,255కు విస్తరించాం. ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్న ఆస్పత్రులు గతంలో కేవలం 919 మాత్రమే ఉంటే, ఇవాళ వాటి సంఖ్య 2,261. మన ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలో 35,71,596 మంది సేవలు అందుకున్నారు.
- నిరుపేద ప్రాణం, నిస్సహాయుల ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వంగా ఒక్క ఆరోగ్యశ్రీ మీద చేసిన ఖర్చు రూ. 9 వేల కోట్లు. ఇది కాకుండా ఆరోగ్య ఆసరా కింద మరో రూ.990 కోట్లు ఖర్చు చేశాం. ఈ రెండు పథకాల మీదే రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం.

బాబుకు స్కామ్‌లే తప్ప.. స్కీమ్‌లు తెలియవు

స్కామ్‌లు చేయడమే తప్ప స్కీంలు తెలియని బాబులు ఉన్నారు. వారికి అధికారంలో ఉండగా దోచుకో.. పంచుకో.. తినుకో.. మాత్రమే తెలుసు. లంచావతారాలు, గజ దొంగలు, వయసు పెరిగినా బుద్ధి పెరగని క్రిమినల్ మంచావతారాలు, సామాజిక అన్యాయం తప్ప న్యాయం తెలియని పరాన్న జీవులు.. ఇలా ఒకరు చంద్రబాబు రూపంలో, ఒకరు ఈనాడు రూపంలో, ఒకరు ఆంధ్రజ్యోతి, మరొకరు టీవీ5 రూపంలో.. వీరికి తోడుగా ఒక దత్తపుత్రుడు రూపంలో కనిపిస్తారు. ఫలానా మంచి పని చేశామని చెప్పుకోలేని వీరికి మిగిలింది జిత్తులు, ఎత్తులు, పొత్తులు, కుయుక్తులు మాత్రమే. వీటితో మాత్రమే వీరు రాజకీయాలు చేస్తున్నారు. మీ బిడ్డ నవరత్నాలతో సంక్షేమ పాలన అందిస్తుంటే, దీనికి అక్క చెల్లెమ్మల నుంచి వస్తున్న మద్దతు చూసి తట్టుకోలేక తోడేళ్లన్నీ ఒక్కటవుతున్నాయి. నాకు అంగబలం, అర్థబలం, మీడియా బలం లేకపోయినా.. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు ఉన్నాయి. నేను పొత్తులపై ఆధార పడను. నాకు ఎవరితోనైనా పొత్తు ఉందంటే అది ప్రజలతో మాత్రమే. నాకు కుయుక్తులు చేతకాదు. అబద్ధాలు చెప్పలేను. మోసం చేయలేను. పన్నాగాలు, జిత్తులు చేత కాదు. నేను ఏది చెప్తానో అదే చేస్తాను. మీ ఇంట్లో మంచి జరిగిందా లేదా.. అన్నది కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా సైనికుల్లా నిలబడండి.

తేడా మీరే గమనించండి..

- గత ప్రభుత్వంలో ఇదే ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ.1000 కోట్లు కూడా ఖర్చు చేయని పరిస్థితి. ఇవాళ మన ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కింద ఏటా రూ.3,300 కోట్లు వెచ్చిస్తున్నాం. వైద్య ఆరోగ్య శాఖలో 46 నెలల కాలంలో ఏకంగా 48,639 ఉద్యోగాలు ఇచ్చాం.
- దేశ వ్యాప్తంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 33 శాతం, స్టాఫ్ నర్సులు 27%, జనరల్ ఫిజీషియన్ 50% ఖాళీలు ఉంటే మనం వంద శాతం భర్తీ చేశాం. స్పెషలిస్టు డాక్టర్లకు సంబంధించి దేశ వ్యాప్తంగా 61 శాతం ఉంటే మన రాష్ట్రంలో 96.04 శాతం పూర్తి చేశాం.
- దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ స్థాపించాం. అక్కడ 10,032 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, అంతేమంది ఏఎన్‌ఎంలను నియమించాం. ఆశా వర్కర్లకు గతంలో రూ.3 వేల జీతం ఉంటే ఇప్పుడు రూ.పది వేలు ఇస్తున్నాం. పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వమే కొత్తగా 560 అర్బన్ పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాం. ప్రతి 2,500 జనాభాకు ఒక ఆరోగ్య కేంద్రం ఉన్న ఏకైక రాష్ట్రం మనదే. చంద్రబాబునాయుడు వైద్య రంగంపై ఏటా రూ.ఎనిమిది వేల కోట్లు ఖర్చు చేస్తే మనం రూ.18 వేల కోట్లు ఖర్చు చేశాం.
- రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కేవలం 11 మాత్రమే ఉంటే, కొత్తగా 17 మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నాం. పాత కళాశాలలను నాడు–నేడు కింద తీర్చిదిద్దుతున్నాం. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నాం. 104, 108 వాహనాలు కొత్తగా 1,514 కొనుగోలు చేశాం.
- గతంలో ప్రభుత్వాస్పత్రుల్లో 229 రకాల మందులు, అవి కూడా నాసిరకం అందుబాటులో ఉండేవి. మన ప్రభుత్వం వచ్చాక 562 రకాల డబ్ల్యూహెచ్‌ఓ, జీఎంపీ ప్రమాణాలతో అందుబాటులోకి తీసుకొచ్చాం. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్న వాళ్లు, తలసేమియాతో బాధ పడుతూ మంచానికే పరిమితమైన వాళ్లకు రూ.10 వేలు పెన్షన్ ఇస్తూ తోడుగా నిలబడుతున్నాం.
- ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించడమే కాకుండా, ఆ మనిషి ఇంటికి వెళ్లి తిరిగి పనులు చేసుకునే వరకు అండగా నిలుస్తూ ఆరోగ్య ఆసరా కింద నెలకు రూ.5 వేలు చొప్పున వైద్యుల సలహా మేరకు విశ్రాంతి సమయంలో సాయం చేస్తున్నాం. దేశ చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా 46 నెలల కాలంలోనే మీ బిడ్డ బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి రూ.2,05,108 కోట్లు జమ చేశాడు. వివక్ష, లంచాలు లేని పాలన సాగుతోంది. ఇదీ.. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా. మీరే గమనించండి.

జగనన్నా.. ఇది మీరు పెట్టిన భిక్ష

బీసీ మహిళనైన నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిని చేసిన జగనన్నకు రుణపడి ఉంటాను. అన్నా.. నా రాజకీయ జీవితం నీవు పెట్టిన భిక్ష. చిలకలూరిపేట లాంటి నియోజకవర్గంలో ఒక బీసీ మహిళ మంత్రిగా ఉండటమే మీ చిత్తశుద్ధికి నిదర్శనం. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. ఆరోగ్య రంగానికి ఏం మేలు చేశారో చెప్పాలి. ఆయన ఆరోగ్య రంగాన్ని అమ్మకానికి పెట్టారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారు. దోమలపై దండయాత్ర, ఈగలపై కత్తి యుద్ధం అంటూ కాలక్షేపం చేశారు. చంద్రబాబు నలుగురు ఎమ్మెల్యేలను కొనొచ్చు.. నాలుగు టీవీలు, నాలుగు పత్రికలు, నాలుగు పార్టీలతో పొత్తులు కలిగి ఉండొచ్చు. కానీ నాలుగు కోట్ల మంది ప్రజల గుండెల్లో ఎప్పటికీ ఉండరు. ఆ స్థానం మా జగనన్నదే. రాబోయే ఎన్నికల్లో మీరు కలిసి వచ్చినా, విడివిడిగా వచ్చినా, మీ దుష్టచతుష్టయం ఎన్ని అరాచకాలు చేసినా మిమ్మల్ని ఓడించడం ఖాయం.

– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

మీ వల్లే బతికున్నా..



నేను కూలి పనులు చేసుకునే వాడిని. నా కిడ్నీలు పాడయ్యాయని, వెంటనే డయాలసిస్ చేయాలన్నారు. చాలా డబ్బు ఖర్చవుతుందని నేను భయపడ్డాను. ఆరోగ్యశ్రీ కార్డు ఉందా అని డాక్టర్ అడిగారు. ఉందని చెప్పాను. ఆ కార్డు ఆధారంగా నా వద్ద నుంచి ఒక్క రూపాయి డబ్బు తీసుకోకుండా నన్ను బతికిస్తున్నారు. వలంటీర్ వచ్చి నీకు రూ.10 వేలు ఫించన్ జగనన్న పంపారని ప్రతి నెలా ఇస్తున్నారు. ఆ డబ్బుతో, ఇతరత్రా మీ పథకాలతో నా కుటుంబం ముందుకెళ్తోంది. మా నాన్నకు గుండె సమస్య వస్తే ఎలాంటి ఖర్చు లేకుండా స్టంట్ వేశారు. ఇప్పుడు తీసుకొస్తున్న ఫ్యామిలీ డాక్టర్ పథకం మాలాంటి పేదలకు వరం. మీకు ఎప్పటికీ రుణ పడి ఉంటాం.

– ఎం.రమేష్, ఆరోగ్యశ్రీ లబ్ధిదారు, లింగంగుంట్ల

మనసున్న మారాజు

- సీఎం జగన్‌కు కష్టాలు చెప్పుకున్న ఐదుగురు అనారోగ్య బాధితులు
- మెరుగైన వైద్యం, రూ.లక్ష తక్షణ సాయం అందించాలని ఆదేశం
- గంటల వ్యవధిలో అందజేసిన కలెక్టర్



తన్నీరు ఓర్సు ఉమాదేవి, కుంభగిరి పేరెడ్డి, అంకమ్మ యోక్షిత సాయి, మహబూబ్ సుభాని, షేక్ సుభానిల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, నరసరావుపేట: సీఎం జగన్ మరోసారి మనసున్న మారాజు అనిపించుకున్నారు. గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వచ్చిన సీఎంను హెలిప్యాడ్ వద్ద వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఐదుగురు కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. వైద్యం కోసం ఇప్పటికే శక్తికి మించి ఖర్చు చేశామని విన్నవించారు. వారందరి సమస్యలను ఓపికగా విన్న సీఎం.. తక్షణమే వారందరికీ మెరుగైన వైద్యం అందేలా చూడాలని, తక్షణ ఆర్థిక సాయంగా రూ.లక్ష అందించాలని పల్నాడు కలెక్టర్ శివ శంకర్‌ను ఆదేశించారు. గంటల వ్యవధిలోనే ఆ ఐదుగురికి రూ.లక్ష చొప్పున కలెక్టర్ వారికి ఆర్థిక సాయం అందించారు. వారికి తగిన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ కష్టాలను తీర్చిన సీఎం జగన్‌ను తాము జీవితాంతం గుర్తుంచుకుంటామని బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సాయం పొందిన వారు

పేరు	ఊరు	అనారోగ్య సమస్య
తన్నీరు ఓర్సు ఉమాదేవి (6)	కనపర్రు, చిలకలూరిపేట నియోజకవర్గం	పుట్టుకతోనే గుండెకు రంధ్రం
పఠాన్ మహబూబ్ సుభాని (18)	ఏలూరు, చిలకలూరిపేట నియోజకవర్గం	చిన్నప్పటి నుంచి సొరియాసిస్
అంకమ్మ యోక్షిత సాయి (16 నెలలు)	18వ వార్డు, చిలకలూరిపేట	కాలేయ సంబంధిత వ్యాధి
షేక్ సుభాని (7)	నరసరావుపేట	మందులు వికటించి అనారోగ్యం
కుంభగిరి పేరెడ్డి (45)	చీకటీగలపాలెం, వినుకొండ మండలం	ప్రమాదంలో గాయాలు

ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలి

గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్

సాక్షి, అమరావతి: మానవాళి పట్ల అవ్యాజమైన ప్రేమతో ఏసుక్రీస్తు చేసిన మహాత్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ పేర్కొన్నారు. ఏసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ కరుణ, ప్రేమ భావనలతో కూడిన ఆయన బోధనలను అనుసరించాలని గవర్నర్ ఆకాంక్షించారని రాజ్‌భవన్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

మానవాళి కోసం జీసస్ మహాత్యాగమే గుడ్ ఫ్రై డే సందేశం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మానవాళి కోసం జీసస్ చేసిన మహాత్యాగమే గుడ్ ఫ్రై డే సందేశం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'కరుణామయుడైన ఏసు ప్రభువు జీవితమే త్యాగానికి చిహ్నం. ఆ ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రై డే రోజు, ఆ తర్వాత ఆయన పునరుత్థానం పొందిన ఈస్టర్ సండే రోజు... ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలు' అని ఆయన అన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం.. ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని సీఎం జగన్ తెలియజేశారు.

గ్రేడ్-2 వీఆర్వోల ప్రమోషన్‌కు మార్గం సుగమం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రభుత్వం ప్రమోషన్ చానల్ కల్పించింది. ఈ మేరకు ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ సర్వీస్ రూల్స్‌ను సవరిస్తూ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిప్రకారం గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రమోషన్లకు అవకాశం ఏర్పడుతుంది. ఈ మేరకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా ప్రమోషన్ చానల్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్-166 ప్రతిని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీంద్రరాజుకు గురువారం అందజేశారు. ప్రభుత్వం జీవో జారీ చేయడంపై రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. సీఎం వైఎస్ జగన్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు దేవరాజు, గోపాలకృష్ణ, ఆరుమళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు కార్పొరేషన్లలో 'ప్రత్యేక' పాలన కొనసాగింపు

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం, మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారుల పాలనను మరో 6 నెలలను ప్రభుత్వం పొడిగించింది. ఈ రెండు కార్పొరేషన్లకు గతేడాది అక్టోబర్‌లో విధించిన 6 నెలల ప్రత్యేక పాలన ముగియడంతో ఆయా కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారుల పాలనను మరో 6 నెలల పాటు కొనసాగిస్తూ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులిచ్చారు.

సందడిగా వైఎస్సార్ వ్యూ పాయింట్



వైఎస్సార్ వ్యూ పాయింట్‌లో ఐ.లవ్ వైజాగ్ బోర్డు వద్ద ఫొటోలు తీసుకొంటున్న సందర్శకులు..

ఆరిలోవ: వైజాగ్ బీచ్ రోడ్డులో సీతకొండ మలుపు వద్ద వైఎస్సార్ వ్యూ పాయింట్ సందడిగా మారుతోంది. ఇటీవల నగరంలో జరిగిన జి-20 సదస్సు సందర్భంగా ఇక్కడ సీవ్యూ పాయింట్‌ను జీవీఎంసీ అధికారులు అభివృద్ధి చేశారు. ఇక్కడ సందర్శకులకు ఆకర్షనీయంగా తయారు చేశారు. దీంతో ఈ పాయింట్ సాయంత్రం వేళలో సందడిగా మారుతోంది. గతంలో దీన్ని సీతకొండ వ్యూ పాయింట్ అని పిలిచేవారు. దీని రూపురేఖలు మార్చి అభివృద్ధి చేసిన అనంతరం దీనికి వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేశారు. ఇక్కడకు వెళ్లిన సందర్శకులు, నగరం నుంచి సాగర్‌నగర్ వైపు, రుషికొండ నుంచి నగరం వైపు వెళ్లే వాహనచోదకులు ఇక్కడ ఆగి అందాలు తిలకిస్తున్నారు. అధికారులు ఇక్కడ ఏర్పాటు చేసిన ఐ.లవ్.వైజాగ్(విడివిడిగా ఉన్న అక్షరాలు) బోర్డు వద్ద ఫొటోలు తీసుకొంటున్నారు. సాయంత్రం అటుగా నడక కోసం వెళ్లేవారు కూడా ఇక్కడ నిర్మించిన రక్షణ గోడపై సందర్శకులతో పాటు కొంతసేపు సేదదీరుతున్నారు. ఓ పక్క ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలు, మరో పక్క కొండవాలులో బండరాళ్లపై వేసిన రంగుల పెయింటింగ్ చూస్తూ ఆనందిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం సాయంత్రం వేళల్లో సందడిగా మారుతుంది.

ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి

బీచ్‌రోడ్డు: ప్రజలు బిజి బిజి లైఫ్‌లో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని దాని వలన అనేక రోగాలకు గురికావటం జరుతుందని డాక్టర్ రితికా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రితికా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవాటు చేసుకోవటం కోసం ప్రతీ ఒక్కరు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అధిక పోషకాలు కలిగిన బాదం, డ్రైఫ్రూట్స్, పండ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. అత్యధిక ఫైబర్, ప్రోటీన్లు కలిగిన ఆహారం తీసుకోవటం వలన ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చు అన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం



రాజానగరంలోని సాయిబాబా ఆలయం వద్ద హనుమాన్ చాలీసా పఠనం చేస్తున్న భక్తులు

రాజానగరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి, షిరిడీ సాయిబాబా ఆలయ సముదాయంలో గురువారం హనుమాన్ చాలీసా పఠనాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయిభక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొంతమంది తల్లిదండ్రులు తమ చిన్నారులకు పటిక బెల్లంతో తులాబారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆలయంలో కొలువువైవున్న చదువుల తల్లి సరస్వతి మాత విగ్రహం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలోను పెక్కుమంది భక్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్

విధులు నిర్వర్తిస్తున్న 1,500 మంది అధ్యాపకులు



ఇంటర్ పరీక్షల మూల్యాంకనం జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యూయేషన్ రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి కట్టుదిట్టమైన భద్రత నడుమ సాగుతోంది. గత నెల 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ఈ నెల నాలుగుతో ముగిశాయి. ఈ పరీక్షల మూల్యాంకనాన్ని ఉమ్మడి జిల్లాలో మూడు స్పెల్స్‌గా వీటిని నిర్వహిస్తున్నారు. మొత్తం 13 సబ్జెక్టులకు సంబంధించి పేపర్లు రాజమహేంద్రవరం కేంద్రానికి చేరాయి. ఈ జవాబు పత్రాలను దిద్దే పనిలో అధ్యాపకులు పూర్తిగా నిమగ్నమయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పక్రియను నిర్వహిస్తున్నారు. మూల్యాంకనం దిద్దే పక్రియకు హాజరైన సమయం నుంచి బయటకు వెళ్లే వరకు అధ్యాపకులకు, అక్కడ పనిచేసే సిబ్బందికి సెల్‌ఫోన్ నిషేధించారు. ఎట్టి పరిస్థితుల్లోను లోపలికి ఎటువంటి ఎల్రక్టానిక్ గాడ్జెట్‌లను తీసుకెళ్లకూడదని ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేసారు. మూల్యాంకనం జరుగుతున్న ప్రభుత్వ కళాశాల ప్రాంతం పూర్తిగా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. రోజుకి ఒకో అధ్యాపకుడు 30 పేపర్ల వరకు మూల్యాంకనం చేస్తున్నారు. సుమారు నెలరోజుల పాటు జరగనున్న ఈ పక్రియను ఇంటర్ బోర్డు స్టేట్ అబ్జర్వర్లు ప్రతీ రోజు మూల్యాంకనం కేంద్రానికి వచ్చి తనిఖీలు చేపడుతున్నారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు ప్రభుత్వ కళాశాల వద్ద పూర్తి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా సాగుతోంది



ఇంటర్ పరీక్షల మూల్యాంకనం ఉమ్మడి జిల్లాల కేంద్రంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ప్రశాంతంగా జరుగుతోంది. ఇప్పటికే రెండు స్పెల్స్ పూర్తయ్యాయి. మూడో స్పెల్ ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. మూల్యాంకనం పూర్తి సీసీ కెమెరా నిఘాలో జరుగుతోంది. నిత్యం మూల్యాంకనా కేంద్రాన్ని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులతో పాటు తాము పరిశీలిస్తున్నాం. ఈనెల 25వ తేదీ లోగా మూల్యాంకన పక్రియ పూర్తవవచ్చు.

– ఐ.శారద, జోన్ 1,2 రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఇంటర్‌బోర్డు

అవును.. మళ్లించాం

'అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను సొంత పెట్టుబడులుగా పెట్టాం. చందాదారుల సొమ్మును మా అనుబంధ కంపెనీలకు మళ్లించాం. అందుకు కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982 అనుమతించదా? అసలు ఆ చిట్‌ఫండ్స్ చట్టం అంటేనే మాకు తెలీదు. మేం ఆ చట్టాన్ని పట్టించుకోం.. మా చట్టాలు మాకున్నాయి..!'

– ఇదీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న సంస్థ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్ వాదన.



విచారణ జరిపి బయటకు వస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా సొంత కంపెనీలకు మళ్లించినట్టు సీఐడీ విచారణలో శైలజా కిరణ్ దాదాపుగా అంగీకరించారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న చెరుకూరి రామోజీరావు ఇప్పటికే నిధులు మళ్లించామని సీఐడీ విచారణలో పరోక్షంగా అంగీకరించారు. తాజాగా చెరుకూరి శైలజ కూడా నిధులు మళ్లించినట్టు సమ్మతించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే దేశంలో చట్టాలకు తాము అతీతం అన్నట్టుగా ఆమె సీఐడీ అధికారుల ఎదుటే అడ్డగోలుగా వాదించడం విస్మయపరుస్తోంది. చిట్‌ఫండ్స్ వ్యాపారం చేస్తూ కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం తమకు వర్తించదని దబాయించడం రామోజీరావు, ఆయన కుటుంబం బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. సీఐడీ అధికారులకు రికార్డులు చూపించబోమని శైలజా కిరణ్ భీష్మించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజను సీఐడీ అధికారులు గురువారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని ఆమె నివాసంలో విచారించారు. సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్, విచారణ అధికారి రవికుమార్‌లతోపాటు 25 మంది అధికారుల బృందం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారించింది. శైలజ తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయవాదులతోపాటు తెలంగాణ హైకోర్టు న్యాయవాది కూడా విచారణ ప్రక్రియ సమయంలో ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన విచారణ ప్రక్రియను సీఐడీ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. దాదాపు 75 ప్రశ్నలకు వివరాలు రాబట్టి వాంగ్మూల పత్రంపై శైలజ సంతకం తీసుకున్నారు. గతంలో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా శైలజ నుంచి పలు కీలక విషయాలను సీఐడీ అధికారులు రాబట్టినట్టు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం విచారణలో ఆమె వెల్లడించిన విషయాలు ఇలా ఉన్నాయి...

చందాదారుల సొమ్మును మళ్లించాం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీల్లో సేకరించిన పలు కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ సీఐడీ అధికారులు శైలజను విచారించారు. ప్రధానంగా చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా సొంత పెట్టుబడులుగా పెట్టడం, మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టడంపై ప్రశ్నించినట్లు సమాచారం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను రామోజీ గ్రూపునకు చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ (కర్ణాటక)- బెంగళూరు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నైలలో అక్రమ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్న విషయాన్ని ఆమెకు చూపించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏకంగా 88.5 శాతం వాటా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిటే ఉంది. ''అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను ఆ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాం..' అని శైలజ అంగీకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేసులో ప్రధాన అభియోగమైన అక్రమంగా నిధుల మళ్లింపునకు సంబంధించి సీఐడీ అధికారులు కీలక పురోగతి సాధించినట్టైంది.

> **రామోజీ, శైలజను అమరావతిలో విచారిస్తాం**
>
> 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-1 చెరుకూరి రామోజీరావు, ఏ-2 శైలజను త్వరలో అమరావతిలో మరోదఫా విచారిస్తాం. ఈ కేసులో ఇప్పటికే వారిద్దరినీ విచారించి వాంగ్మూలాలు నమోదు చేశాం. వాటిని విశ్లేషించిన అనంతరం మరి కొన్నిసార్లు విచారించాల్సి ఉంటుంది. ఈసారి వారిద్దరూ విచారణ కోసం అమరావతికి రావాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు విచారణ కొనసాగుతోంది. శైలజ ఈ నెల 13న విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని ఆమెకు ఇప్పటికే సమాచారమిచ్చాం. ఈదఫా ఆమెను అమరావతిలో విచారిస్తాం'
>
> – అమిత్ బర్దర్, ఎస్పీ, సీఐడీ

కంపెనీల చట్టం అనుసరిస్తామంటూ... అంతలోనే తెలీదంటూ

సీఐడీ అధికారులు అదే విషయంపై గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతో తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామని శైలజ పేర్కొనట్లు సమాచారం. చిట్‌ఫండ్స్ వ్యాపారానికి కంపెనీల చట్టంతో నిమిత్తం లేదని, అనుసరించాల్సింది కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982 కదా? అని అధికారులు ప్రశ్నించగా ఆమె సమాధానం ఇచ్చేందుకు నిరాకరించినట్టు తెలుస్తోంది. పోనీ కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నారని భావించినా... ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5 శాతం వాటాతోపాటు మరో రెండు కంపెనీల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు కదా? అని అధికారులు ప్రశ్నించడంతో అవునని ఆమె సమాధానమిచ్చారు. కంపెనీల చట్టం ప్రకారం 50 శాతానికి మించి వాటా కలిగి ఉంటే అనుబంధ కంపెనీగానే పరిగణిస్తారు కదా? అని తిరిగి ప్రశ్నించగా అందుకు కూడా ఆమె అవుననే సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. అంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు కంపెనీల్లో 88 శాతం పెట్టుబడులు పెట్టి అనుబంధ కంపెనీగా ఉన్నట్టే కదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించగా ఆమె మౌనం వహించినట్టు సమాచారం. అటు చిట్‌ఫండ్స్ చట్టం.. ఇటు కంపెనీల చట్టాన్ని కూడా యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నట్టు ఆమె సమ్మతించినట్టైంది.

ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు..

విచారణ సందర్భంగా సీఐడీ మరో కీలక ఆధారాన్ని సేకరించింది. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తున్న రామోజీరావు, శైలజ రికార్డుల్లో మాత్రం చట్టాన్ని ఏమార్చేందుకు యత్నించారని నిరూపితమైంది. 2022 మార్చి 31న రూ.255 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్టు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ చెక్కులేవీ తరువాత నగదుగా మారినట్టు (ఎన్‌క్యాష్)గా రికార్డుల్లో లేవని సీఐడీ అధికారులు గుర్తించారు. గరిష్ఠంగా పది రోజుల్లో చెక్కులను నగదుగా జమ చేస్తామని శైలజ పేర్కొన్నారు. మరి గతేడాది మార్చి 31న వచ్చినట్టు చూపించిన రూ.255 కోట్ల చెక్కులేవీ నగదుగా మారినట్టు రికార్డుల్లో ఎందుకు లేవని సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజ తెల్లమొహం వేశారని సమాచారం. కొన్ని దశాబ్దాలుగా ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్టు రికార్డుల్లో చూపుతున్నా అవి నగదుగా మాత్రం మారడం లేదు. ఎందుకంటే ఏటా చందాదారులు చెల్లిస్తున్న రూ.వందల కోట్లను మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా సొంత ప్రయోజనాలకు మళ్లిస్తోంది. ఆర్థిక సంవత్సరం చివరిలో ఆ నిధులు ఉన్నట్లుగా చూపించాల్సి రావడంతో చెక్కులు వచ్చినట్టు చూపించి కనికట్టు చేస్తోంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. సీఐడీ అధికారుల దర్యాప్తులో మార్గదర్శి ఆడిటర్ శ్రావణ్ ఇదే విషయాన్ని అంగీకరించారు.

ప్రధాన కార్యాలయంలో ఉన్నాయి కానీ.. చూపించను

లేని చెక్కులు ఉన్నట్టుగా చూపించి మోసానికి పాల్పడినట్టు నిరూపితం కావడంతో శైలజ షాక్‌కు గురయ్యారు. దాంతో సీఐడీ అధికారులను పక్కదారి పట్టించేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. 'ఆ చెక్కుల సమాచారం అంతా ప్రధాన కార్యాలయంలో ఉంటుంది... నాకు తెలీదు' అని పేర్కొన్నారు. అక్కడకు వెళ్లి పరిశీలిద్దామని సీఐడీ అధికారులు సూచించగా ఆమె నిరాకరించారు. పోనీ మార్గదర్శి సిబ్బంది ద్వారానైనా ఆ వివరాలు అందించాలని సూచించగా అందుకు కూడా ఆమె ఒప్పుకోలేదు. వీడియో రికార్డింగ్ ద్వారా పారదర్శకంగా చెక్కుల రికార్డులు పరిశీలిస్తామని చెప్పినా ఆమె ససేమిరా అన్నారు. అంటే చెక్కుల వివరాలు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో కూడా లేవా? అని ప్రశ్నించగా ఆమె మౌనం దాల్చినట్టు సమాచారం.

ఏపీ రికార్డులు ప్రత్యేకంగా లేవు

చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు ఏ రాష్ట్రానికి సంబంధించిన రికార్డులు ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిర్వహించాలి. అక్కడి చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, చిట్టీల వివరాలు, ఆదాయ-వ్యయాలు, బ్యాలన్స్‌షీట్‌ను ప్రత్యేకంగా రూపొందించాలి. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, ఇతర వివరాలను తెలంగాణ, ఇతర రాష్ట్రాల రికార్డులతో పాటు కలిపి నిర్వహిస్తోంది. మార్గదర్శి చందాదారుల్లో సింహభాగం అంటే 60 శాతం వరకు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే ఉన్నారు. ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రామోజీరావు కుటుంబానికి చెందిన ఇతర కంపెనీల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతోంది. ఇదే విషయాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించగా తాము అలాగే రికార్డులు నిర్వహిస్తామని శైలజ చెప్పినట్టు సమాచారం.

> **మాకు ఏ చట్టాలు వర్తించవు..**
> **మా చట్టం మాకుంది**
>
> చందాదారులు చెల్లించిన నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982కు వ్యతిరేకం కదా...! ఆ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం అందుకు రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని తెలుసు కదా..? అని సీఐడీ అధికారులు శైలజను ప్రశ్నించారు. అయితే అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తనకు తెలియదని ఆమె చెప్పడంతో సీఐడీ అధికారులు విస్తుపోయారు. చిట్‌ఫండ్స్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మీకు అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తెలియదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ చట్టం- 1982ను తాము అనుసరించబోమని ఆమె సమాధానం ఇవ్వడంతో నివ్వెరపోవడం సీఐడీ అధికారుల వంతైంది. మరి చిట్‌ఫండ్స్ వ్యాపారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించగా.. మా చట్టాలు మాకున్నాయి... వాటి ప్రకారం చేస్తున్నాం అని ఆమె బదులిచ్చినట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ కంపెనీలు అక్రమాలకు పాల్పడకుండా కేంద్ర ప్రభుత్వం 1982లోనే చేసిన చట్టం గురించి కూడా తెలుసుకోకుండా... అసలు ఆ చట్టాన్ని పట్టించుకోకుండా చిట్‌ఫండ్స్ వ్యాపారం చేస్తున్నామని శైలజ చెప్పడం గమనార్హం.

నీళ్లు నమిలి... నీళ్లు తాగి

సీఐడీ అధికారులు నిబంధనలు పాటిస్తూ శైలజా కిరణ్‌ను విచారించారు. విచారణకు ఆమె ఏమాత్రం సహకరించకపోయినా సరే ఇబ్బంది పెట్టకుండా...ఒత్తిడి చేయకుండా ప్రశ్నలు సంధించారు. గురువారం రోజు మధ్యాహ్నం వరకు సాగిన మొదటి విడతలో చాలా ప్రశ్నలకు నాకు తెలియదు.. గుర్తులేదు...నాకు సంబంధం లేదు అంటూ ఆమె సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు. మధ్యాహ్న భోజన విరామం తరువాత సీఐడీ అధికారులు విచారణ జోరు పెంచారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ఆమె ముందు ఉంచుతూ ఒక్కొక్క అంశంపై ప్రశ్నించారు. దీంతో శైలజకు నోట మాట రాలేదు. కాదు అని చెప్పేందుకు అవకాశం లేదు. ఎదురుగా స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. దాంతో చాలా ప్రశ్నలకు ఆమె నీళ్లు నమిలినట్లు సమాచారం. విచారణ సందర్భంగా ఆమె పలుసార్లు తనకు దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి వచ్చారు. తమ ఆడిటర్లు, ఇతరులతో సంప్రదించి వచ్చి నాకు తెలియదు.. గుర్తు లేదు అని సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు.

చూపు సరిగా లేదు.. కనిపించడం లేదు

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను ల్యాప్‌టాప్‌లో సీఐడీ అధికారులు శైలజకు చూపించారు. నిధులు మళ్లించినట్టు అందులో ఉన్న వివరాలను చూపిస్తూ అవి వాస్తవమేనా? అని అడిగారు. అయితే ఆ పత్రాలు తనకు కనిపించడం లేదని... అక్షరాలు చిన్నవిగా ఉన్నాయని ఆమె పేర్కొనడంతో సీఐడీ అధికారులు ల్యాప్‌టాప్‌లో ఎన్‌లార్జ్ చేసి మరీ చూపించారు. 'నాకు చూపు సరిగా లేదు.... ఆ పత్రాల్లో ఏముందో కనిపించడం లేదు' అని శైలజ పేర్కొనడంతో సీఐడీ అధికారులు విచారణ ప్రక్రియలో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తిని పిలిచి ఆ పత్రాలు చూపించారు. అవి తనకు కనిపిస్తున్నాయని ఆయన చెప్పడంతో పాటు అందులో ఏముందో చదివి వినిపించారు. దీంతో తనకు ఏమీ కనిపించడంలేదని తప్పించుకునేందుకు శైలజ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది.

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

- 175 నియోజక వర్గాల్లో 14 రోజులపాటు నిర్వహణ: సజ్జల
- 1.60 కోట్ల కుటుంబాలను కలుసుకోనున్న గృహ సారథులు, కన్వీనర్లు
- నాడు – నేడు పాలనలో వ్యత్యాసాన్ని వివరిస్తూ ఇంటింటికీ
- ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు
- కార్యక్రమం పూర్తయ్యాక ప్రజా సర్వే ఫలితాలను వెల్లడిస్తాం
- దేశంలో అధికార పార్టీ ఈ స్థాయిలో ప్రజలతో మమేకమై సర్వే చేయడం ఇదే తొలిసారి
- ప్రభుత్వ సేవలను అందిస్తున్న వలంటీర్లు పాల్గొంటే తప్పేమిటి?
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలను నేరుగా కలుసుకునే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శుక్రవారం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుడుతున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అన్నది ప్రజల నుంచి వచ్చిన నినాదమన్నారు. సీఎం జగన్ పలు సభల్లో చెప్పినట్టుగా గత నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరితే మరోమారు ఆశీర్వదించాలని ఆయా కుటుంబాలను ఈ కార్యక్రమం ద్వారా కోరతామన్నారు. అధికారంలో ఉన్న పార్టీ పదాతిదళం ప్రజలతో మమేకమై భారీ ఎత్తున ప్రజా సర్వే నిర్వహించడం దేశంలో ఇదే ప్రథమమని వెల్లడించారు. 175 నియోజక వర్గాలలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ఈనెల 20 వరకూ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం పూర్తయ్యాక ప్రజా సర్వే ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ప్రభుత్వంపై బురద జల్లుతున్న చంద్రబాబు, ఎల్లో మీడియా ఇతర ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పేలా ప్రజా సర్వే ఫలితాలు ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.

14 రోజుల్లో 1.60 కోట్ల ఇళ్ల సందర్శన

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ సైనికులుగా పార్టీ పదాతిదళం ప్రతి ఇంటికీ వెళ్తుంది. దాదాపు 7 లక్షల మంది గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు 1.60 కోట్ల ఇళ్లను 14 రోజుల్లో సందర్శిస్తారు. ఐదుకోట్ల మంది ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుంటారు. 'మమ్మల్ని జగనన్న పంపారు. మీతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాల్ని తెలుసుకునేందుకు వచ్చాం' అని చెబుతారు. పదాతిదళం కలుసుకునే వారిలో అన్ని కులాలు, మతాలకు చెందిన వారితోపాటు రాజకీయంగా భిన్నాభిప్రాయాలు కలిగిన కుటుంబాలు కూడా ఉంటాయి. ఒక ఇంటికి వెళ్లినప్పుడు 'మీకు ప్రభుత్వం ద్వారా ఏవి అందాయి? గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏం గమనించారు?' అని అడిగే సాహసోపేతమైన కార్యక్రమం ఇది. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను జలగల్లా పీడించి లంచాలు వసూలు చేశాయి. ప్రభుత్వ సేవలను ప్రజల ఇళ్ల వద్దే అందించేందుకు సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. వలంటీర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొంటే తప్పేమిటి?

పేదల సంక్షేమమే ధ్యేయంగా

దేశంలో ఎక్కడా లేనివిధంగా నాలుగేళ్లు కూడా గడవక ముందే సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లను సీఎం జగన్ జమ చేశారు. ఆర్థిక ఇబ్బందులున్నా పేదల సంక్షేమం కోసమే తపిస్తున్నారు. ముందుగానే సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేదలకు చేయూత అందించి పైకి తీసుకురావడం, ప్రధానంగా మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేయడంలో నిర్మాణాత్మకంగా వ్యవహరించారు.

సంతృప్తి స్థాయిని తెలుసుంటూ..

గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకుంటారు. ఐదు ప్రశ్నలకు వివరాలు రాబట్టి 'ప్రజా మద్దతు పుస్తకం'లో నమోదు చేస్తారు. సీఎం జగన్ నాయకత్వం ఆవశ్యకతను వివరిస్తారు. ఇతర పార్టీల మాదిరిగా టెలిఫోన్ సర్వేలతో చంకలు గుద్దుకునే ధోరణి మాది కాదు.

> **ఐదు ప్రశ్నలతో ఇంటింటికీ గృహ సారథులు**
>
> - గత 46 నెలల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తారు.
> - గత సర్కార్‌కు, ఈ ప్రభుత్వ పాలనకు వ్యత్యాసాన్ని తెలియచేసేలా కరపత్రాలు అందిస్తారు.
> - ఐదు ప్రశ్నలకు అభిప్రాయాలను సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేసి రసీదు అందచేస్తారు.
> - ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారిని 82960-82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరుతారు. ఆ తర్వాత నిమిషం లోపే సంబంధిత కుటుంబానికి ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా సీఎం వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలియచేస్తారు.
> - ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి తలుపు (డోర్), మొబైల్ ఫోన్‌కు వారి అనుమతితో సీఎం జగన్ ఫోటోను అతికిస్తారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఆధార్ నమోదు

మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ

సాక్షి, అమరావతి: వయోవృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన రోగపీడితులకు తమ ఇంటి వద్దే ఆధార్ నమోదు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను రాష్ట్రాలకు పంపింది. ఈ విధానాన్ని బుధవారం నుంచే అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు, ఇతర అవసరాలకు ఆధార్ తప్పనిసరి కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. వయోవృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన రోగపీడితులు తమ సమాచారాన్ని ఈ-మెయిల్ ద్వారా యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) రీజనల్, రాష్ట్ర కార్యాలయాలకు అందిస్తే ఏడు పనిదినాల్లో వారి ఇంటికే వెళ్లి ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇంటికే వెళ్లి ఆధార్ నమోదు చేసినందుకు అదనపు సర్వీస్ చార్జీలు వసూలు చేస్తారు. ఒక అడ్రెస్ ఉన్న ఇంటిలో మొదటి వ్యక్తికి రూ.700, ఆ తర్వాత ఎంత మంది ఉన్నా ప్రతి ఒక్కరికి రూ.350 చొప్పున జీఎస్‌టీతో కలిపి సేవా రుసుం వసూలు చేస్తారు. యూఐడీఏఐ ప్రాంతీయ, రాష్ట్ర కార్యాలయాలను https://www.uidai.gov.in/en/ contact&-support/regional&offices. html అనే వెబ్‌సైట్ ద్వారా సంప్రదించాలని సూచించింది.

'ఎలుగు' దాడి చేస్తోంది!

క్రూర మృగాల దాడుల్లో దక్షిణాసియా వాసులే అధిక బాధితులు

- గడిచిన 70 ఏళ్లలో అడవి జంతువుల దాడులపై విశ్లేషణ
- దాడుల్లో 32 శాతం ప్రాణాంతకం.. 68 శాతం తీవ్ర గాయాలు
- వీటిల్లో ఎక్కువగా ఎలుగుబంట్ల దాడులే అధికం



సాక్షి, అమరావతి: దక్షిణాసియాలో అత్యంత ప్రమాదకరంగా మానవులు క్రూరమృగాల దాడులకు గురవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అడవి జంతువుల దాడుల్లో సగం ఇక్కడే నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. గడిచిన 70 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా మానవులపై ఎలుగు బంట్లు, పులులు, తోడేళ్ల వంటి 12 రకాల అడవి జంతువులు జరిపిన 5,440 దాడుల విశ్లేషణను ఓపెన్ యాక్సెస్ జర్నల్ బయాలజీలో ప్రచురించారు. ఈ నివేదిక ప్రకారం క్రూర మృగాల దాడుల్లో 32 శాతం ప్రాణాంతకంగా, 68 శాతం తీవ్ర గాయాలకు దారితీసినట్లు పేర్కొన్నారు. ఇందులో వివిధ రకాల జాతుల ఎలుగుబంట్ల దాడులే అధికంగా ఉన్నాయి.

అల్పాదాయ దేశాల్లోనే ఎక్కువ

అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అల్పాదాయ దేశాల్లోనే ఇలాంటి దాడుల సంఖ్య ఎక్కువగా ఉంది. దక్షిణాసియాలో ఎలుగుబంట్ల దాడులు ఎక్కువకాగా.. ఆ తర్వాత పులులు, తోడేళ్లు ఎక్కువ దాడులు చేశాయి. భారత్‌లో అటవీ ఉత్పత్తుల సేకరణ, వ్యవసాయం, పశువులను మేపడం కోసం వెళ్లిన సమయాల్లోనే క్రూర మృగాలు దాడులకు పాల్పడుతున్నాయి. జనాభా పెరుగుదలతో ఆసియాతో పాటు ఆఫ్రికాలోనూ జంతువుల దాడుల ప్రమాదం పెరుగుతోందని నివేదిక వివరించింది.

ఇక్కడ 90 శాతం ప్రాణాంతకం

జాగ్వార్, ప్యూమా అనే రెండు ప్రమాదకరమైన పులి జాతులకు దక్షిణ అమెరికా నిలయం అయినప్పటికీ అతి తక్కువ సంఖ్యలో దాడులు నమోదయ్యాయి. అయితే, ఆహారం కోసం వెతుకులాటలో భాగంగానే దాడులు జరగ్గా.. ఏకంగా 90 శాతం మరణాలు సంభవించాయి. ఐరోపాలో కూడా గోధుమ రంగు ఎలుగుబంట్లు మనుషులపై ఎక్కువగా దాడిచేశాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలు విశ్రాంతి, వినోదాల సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే జంతువుల దాడులను ఎదుర్కొన్నారు.

> **అందుకే జంతువుల్లో ఈ మార్పు..**
>
> ప్రపంచ జనాభా పెరుగుతోంది. 2050 నాటికి 9.7 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భూ ఉపరితలంలో దాదాపు 50–70 శాతం మేర విస్తరిస్తున్న మానవ ఆవాసాల కారణంగా జీవవైవిధ్యాన్ని కోల్పోవడంతోపాటు, జాతులు విచ్ఛిన్నం అవుతున్నాయి. ఫలితంగా జంతువుల ప్రవర్తనలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆహార అన్వేషణ, ఏకాంతానికి విఘాతం, పిల్లల రక్షణ, ఆవాసాలకు ప్రమాదం అని గ్రహించిన సమయాల్లో ఎక్కువగా జంతువులు దాడులకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, ఒంటరి వ్యక్తులపై దాడులు చేస్తున్నాయి.

ఆయన, తాను కోరిన వారిని తన కారుణ్యంలోకి తీసుకుంటాడు. దుర్మార్గుల కొరకు ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, ఏప్రిల్, 7

పుతిన్‌కు పెరిగిన తలనొప్పి

మూలిగే నక్క మీద తాటిపండు పడడమంటే ఇదే! ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి (నాటో)లో చేరడానికి ఉక్రెయిన్ ఉత్సాహపడుతోందని కోపగించి, కదనానికి కత్తి దూసిన రష్యాకు ఆ తలనొప్పి తగ్గకపోగా, ఇప్పుడు ఫిన్లాండ్ రూపంలో కొత్త తలనొప్పి వచ్చి పడింది. అమెరికా సహా మొత్తం 30 పాశ్చాత్య దేశాల కూటమి 'నాటో'లో 31వ దేశంగా మంగళవారం ఫిన్లాండ్ అధికారికంగా చేరింది. దీంతో, రష్యాకు కంటి మీద కునుకు పట్టనివ్వకుండా ఆ దేశంతో 'నాటో' సభ్య దేశాల సరిహద్దు రెట్టింపయింది. పాశ్చాత్య ప్రపంచంతో దీర్ఘకాలంగా ఘర్షణలో ఉన్న మాస్కో విషయంలో ఇన్నేళ్ళుగా తటస్థంగా ఉన్న ఫిన్లాండ్ ఇప్పుడిలా ప్రత్యర్థితో జట్టు కట్టడం రష్యాకూ, ఆ దేశాధినేత వ్లాదిమిర్ పుతిన్‌కూ పెద్ద ఎదురుదెబ్బ. కానీ, ఉక్రెయిన్‌తో ఏడాది పైగా ఎగతెగని పోరు చేస్తూ, ముందుకు పోలేక వెనక్కి రాలేక సతమతమవుతున్న మాస్కో మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది. ఫిన్లాండ్ చేసినపనికి తగురీతిలో ప్రతిచర్యలు ఉంటాయని హూంకరించింది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భవిష్యత్తులో ఇతర దేశాల నుంచి తమను తాము రక్షించుకొనేందుకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, నార్వే, నెదర్లాండ్స్, కెనడాలు స్థాపించిన సైనిక కూటమి 'నాటో'. 1949లో సంతకం చేసిన ఉత్తర అట్లాంటిక్ ఒప్పందాన్ని ఇది అమలు చేస్తుంది. 'నాటో'లోని ఏ సభ్యదేశం పైన అయినా బయట దేశాలు దాడికి దిగితే, మిగతా సభ్యదేశాలన్నీ సాయం చేయాలి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో సోవియట్ రష్యా విస్తరణ ముప్పును అడ్డుకోవడమూ 'నాటో' లక్ష్యం. తన ప్రయోజనాలకు విరుద్ధంగా పాశ్చాత్య ప్రపంచం కూడగట్టిన ఈ కూటమి అంటే రష్యాకు అందుకే ఒళ్ళు మంట. 1990ల ద్వితీయార్ధం నుంచి తన పొరుగు దేశాలను 'నాటో'లో చేర్చుకొని, పక్కలో బల్లెంలా మార్చడాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. 'నాటో' విస్తరణ విషయంలో ఉక్రెయిన్‌కు సంబంధించి ఇచ్చిన మాట తప్పేందుకు పాశ్చాత్య ప్రపంచం సిద్ధపడడాన్ని మాస్కో జీర్ణించుకోలేకపోయింది. అందుకే, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఏడాది క్రితం ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి దిగారు.

సరిహద్దు వెంట 'నాటో' బెడద తగ్గించుకోవాలనీ, యూరప్‌లో మరే దేశమూ 'నాటో'లో చేరకుండా చేయాలనీ ఉక్రెయిన్‌తో పోరాటం ప్రారంభించిన పుతిన్ సఫలం కాలేదు. పైపెచ్చు, అందుకు పూర్తి విరుద్ధంగా ఆ సైనికకూటమి విస్తరణకు కారణమయ్యారు. ఇది విరోధాభాస. మాస్కో చేపట్టిన యుద్ధంతో 'నాటో' పట్ల ఆకర్షణ పెరిగింది. రష్యాతో తిప్పలు తప్పవనే అనుమానంతో, 'నాటో' సైనిక కూటమిలో సభ్యత్వానికి మరిన్ని మధ్యయూరప్ దేశాలు క్యూ కట్టాయి. ఆ క్రమంలో ఫిన్లాండ్, స్వీడన్‌లు 'నాటో' సభ్యత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. నిజానికి, ఫిన్లాండ్ దాదాపు 1,340 కిలోమీటర్ల తూర్పు సరిహద్దును రష్యాతో పంచుకుంటోంది. ఆ దేశం ఎన్నడూ రష్యా వ్యతిరేకి కాదు. పైగా, రెంటికీ మధ్య ఎన్నడూ విభేదాలు లేవు. అలాంటిది– ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణతో 'నాటో'లో చేరేందుకే ఫిన్లాండ్‌లో 80 శాతం మేర ప్రజాభిప్రాయం మొగ్గింది. చివరకు అదే జరిగింది. సభ్యత్వానికి ఫిన్లాండ్ పెట్టుకున్న దరఖాస్తు రికార్డు సమయంలో ఆమోదం పొందింది.

ఫిన్లాండ్ అధికారికంగా 'నాటో'లో చేరినా, స్వీడన్‌కు మాత్రం ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. సభ్యత్వానికి స్వీడన్ అంగలారుస్తున్నా, టర్కీ, హంగరీలు అడ్డంగా నిలిచాయి. టర్కీలో మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రజాస్వామ్య ప్రమాణాల గురించి స్వీడన్ వ్యాఖ్యలు చేయడంతో ఆ దేశం కినుక వహించింది. మే 14న టర్కీలో ఎన్నికల తర్వాత కానీ ఆ దేశం స్వీడన్ దరఖాస్తుకు ఆమోదముద్ర వేయకపోవచ్చని విశ్లేషకుల అంచనా. హంగరీ విషయానికొస్తే, స్వీడన్ అనేక సంవత్సరాలుగా హంగరీ పట్ల వైరభావంతో వ్యవహరిస్తోంది. పైగా, హంగరీలో న్యాయం క్షీణించిందంటూ స్వీడన్ ప్రధాని ఆ మధ్య వ్యాఖ్యానించారు. దాంతో, హంగరీకి పుండు మీద కారం రాసినట్లయింది. టర్కీ లాగా డిమాండ్ల జాబితా లేకున్నా, తన సాధకబాధకాలను తీరిస్తే హంగరీ సైతం 'నాటో'లో స్వీడన్ ప్రవేశానికి ఓకే అంటుంది. మొత్తానికి, అమెరికా సారథ్యంలోని ద్వితీయ ప్రపంచ యుద్ధానంతర కూటమి బలోపేతమవుతోంది. బోలెడన్ని నిధులందిన ఆధునిక రక్షణ దళాలతో కూడిన ఫిన్లాండ్ 'నాటో'కు బలమైన చేర్పు.

రేపు ఉక్రెయిన్ యుద్ధం ఎటు తిరిగి ఎలా ముగిసినా, రష్యా మాత్రం బలహీనపడింది. ఏదైతే జరగరాదని పుతిన్ ఆశించారో, అదే జరిగి సరిహద్దు వెంట 'నాటో' దేశాల సంఖ్య, సత్తా ఇనుమడించాయి. ఈ పాపపుణ్యాలు పూర్తిగా పుతిన్‌వే. దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ, నియమానుసారం సాగే అంతర్జాతీయ క్రమాన్ని ఆయన తోసిపుచ్చారు. పాశ్చాత్య ప్రపంచం ఉలిక్కిపడి, కార్యాచరణకు ఉద్యుక్తమయ్యేలా చేశారు. ఇకపై రష్యా – యూరప్‌ల మధ్య బంధం మునుపటిలా ఉండబోదు. మరోపక్క చైనా సైతం నిత్యం ఎవరో ఒకరితో కయ్యానికి కాలుదువ్వుతోంది. వీటన్నిటి దృష్ట్యా 'నాటో' లాంటి సైనిక కూటములు మరింత విస్తరించడం ఖాయం. ఇప్పటికే ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి తటస్థంగా ఉన్న ఫిన్లాండ్, స్వీడన్‌లు పాశ్చాత్య ప్రపంచ మిత్రపక్షాలుగా మారాయి. రష్యాతో చేతులు కలిపి ఆర్కిటిక్‌లో చైనా తన ప్రాబల్యం పెంచుకుంది. ఈ పరిస్థితుల్లో ధ్రువవృత్తం దాటి, ఆర్కిటిక్ ప్రాంతమంతటా సైనికీకరణ తప్పకపోవచ్చు. భారత్ సైతం ఆర్కిటిక్‌లో తలెత్తే పరిణామాలనూ, ప్రభావాన్నీ జాగ్రత్తగా గమనించక తప్పదు. వెరసి, ఆర్కిటిక్ ప్రాంతం మరింత సమస్యాత్మకం కానుంది. పుతిన్‌తో పాటు ప్రపంచానికీ తలనొప్పి పెరగనుంది!


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.10.11 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** చిత్త ప.1.32 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.7.14 నుండి 8.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.20 నుండి 9.11 వరకు తదుపరి ప.12.25 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.10 నుండి 9.50 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఊగిసలాడే ఓటర్లే కీలకం

విశ్లేషణ



సందీప్ శాస్త్రి

224 మంది సభ్యుల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోరు మొదలైంది. మే 10న ఎన్నికలు జరిగి, 13న ఫలితాలు వెలువడుతాయి. నాలుగు దశాబ్దాల రాష్ట్ర చరిత్రలో అధికారంలో ఉన్న పార్టీ తిరిగి గెలుపొందలేదు. దీన్ని తిరగరాయాలని బీజేపీ అనుకుంటోంది. సంప్రదాయ ధోరణి మీద నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ అదే తనను మెజారిటీ మార్కు దాటిస్తుందని ఆశిస్తోంది. మూడవ స్థానంలో ఉన్న జేడీఎస్, మళ్లీ కింగ్ మేకర్‌గా ఆవిర్భవించే, వీలైతే కింగ్ అయ్యే అవకాశం కోసం ఎదురుచూస్తోంది. చాలామంది ఓటర్లు ఎన్నికల ప్రకటనకు చాలాముందుగానే తాము ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నది నిర్ణయించుకుంటున్నట్లు గత సర్వేలు సూచిస్తున్నాయి. అందువల్ల ఊగిసలాడే ఓటర్లకు ప్రాధాన్యం పెరుగుతుంది.

అధికారికంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రారంభమైంది. సుమారు నెల రోజుల్లో రాష్ట్ర రాజకీయ సంక్లిష్టత విషయంలో ఒక స్పష్టత వస్తుంది. కర్ణాటక ఓటర్లు కొత్త ఎన్నికల ట్రెండును మొదలు పెడతారా, లేక పాత రాజకీయ సంప్రదాయాన్నే పాటిస్తారా అనేది ప్రశ్న.



'రెండో' గెలుపు ఒక్కసారే...

దాదాపు నాలుగు దశాబ్దాలుగా కర్ణాటక ఎన్నడూ అధికారంలో ఉన్న పార్టీకి తిరిగి గట్టి మెజారిటీని కట్టబెట్టలేదు. చివరిసారిగా రామకృష్ణ హెగ్డే నేతృత్వంలోని జనతా పార్టీ 1985లో రెండోసారి కూడా స్పష్టమైన మెజారిటీని సాధించింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్నడూ మెజారిటీతో గెలుపొందలేదు. 2008లో, 2018లో అది మెజారిటీకి సమీపంలోకి వచ్చింది. 2008లో స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో అది మెజారిటీని సాధించగలిగింది. 2018లో కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేల రాజీనామా వల్ల బీజేపీ మెజారిటీ సాధించుకుంది. ఈ రెండు ధోరణులను ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ తిరగరాయాలని ఆశ పడుతోంది.

సంప్రదాయ ధోరణి మీద నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ అదే తనను మెజారిటీ మార్కు దాటిస్తుందని అనుకుంటోంది. మూడవ స్థానంలో దూరంగా ఉన్న జేడీఎస్, ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించని స్థితిలో అసెంబ్లీలో అధికారంపై ఆశలు పెట్టుకుంటోంది. మళ్లీ ఒకసారి కింగ్ మేకర్‌గా ఆవిర్భవించే అవకాశం కోసం, వీలైతే మరోసారి కింగ్ అయ్యే అవకాశం కోసం ఎదురుచూస్తోంది.

మరోవైపున కర్ణాటకలో నాలుగు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ మరోసారి రాష్ట్రాన్ని నిలుపుకొనేందుకు సకల ప్రయత్నాలూ చేస్తోంది. చతుర్ముఖ వ్యూహంతో అది పనిచేస్తోంది.

ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రకటించకుండానే...

మొదటిది: కేంద్రప్రభుత్వం, దాని నాయకత్వానికి స్పష్టంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. గత మూడు నెలలుగా జరుగుతున్నది ఒక సూచిక అనుకుంటే, కేంద్ర నాయకత్వమే నేరుగా ఈ ప్రచారానికి నాయకత్వం వహిస్తుంది. కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రదర్శించుకోవడంపై దృష్టి పెడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం గురించి ఏదైనా ప్రస్తావించడం, కొంత ఆలస్యమైన రెండో ఆలోచనగానే కనబడుతోంది.

రెండు: తమ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి అధికారంలో ఉంటున్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే బీజేపీ అసెంబ్లీ ఎన్నికలకు వెళుతోంది. రాష్ట్ర నాయకులలో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప స్పష్టంగానే పార్టీ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా ఉంటారు. రాష్ట్రంలో పార్టీని నిర్మించి ఘనత ఆయనదే. ఆయన కరిష్మా ఆధారంగానే నిలబడాలని బీజేపీ ఆశలు పెట్టుకుంటోంది. అయితే ఈసారి కాస్త తేడా ఉంది. తాను ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేయనని యడ్యూరప్ప ప్రకటించారు. ఇంతకుముందటి ఎన్నికల్లో పార్టీ తరపున ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందుకొచ్చారు. ఇదేమైనా వ్యత్యాసం తేగలదేమో చూడటం ఆసక్తికరం.

మూడు: ఉత్తర, కోస్తా కర్ణాటకలో తనకున్న సాంప్రదాయిక మద్దతును నిలబెట్టుకోవలసిన అవసరం బీజేపీకి ఉంది. అలాగే పాత మైసూర్ ప్రాంతంలోకి చొచ్చుకు పోవాల్సిన అవసరం కూడా ఉంది. ఈ మైసూరు ప్రాంతంలో ఎక్కువగా కాంగ్రెస్, జేడీఎస్ మధ్యే పోటీ ఉంటోంది. అవసరమైన మెజారిటీని సాధించాలంటే ఉత్తర కర్ణాటకలో తన బలమైన ఉనికిని నిలబెట్టుకుంటూనే, పాత మైసూరులో బీజేపీ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఆ ప్రాంతంలో బీజేపీ జాతీయ నాయకులు పదేపదే పర్యటనలు చేస్తుండటం దీన్నే తేటతెల్లం చేస్తోంది.

చివరగా, కర్ణాటకలో విస్తృతమైన సామాజిక ఏకీభావాన్ని నిర్మించడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోంది. పార్టీకి లింగాయతులు తమ మద్దతును ఎప్పటిలా కొనసాగిస్తారని నమ్ముతూనే వక్కళిగలు, ఓబీసీలు, దళితుల మద్దతును కూడగట్టుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. రిజర్వేషన్ కోటాను తిరగరాయడం ఈ కులాల్లోకి వ్యాప్తి చెందే లక్ష్యంలో భాగమేనని చెప్పాలి.

ఐక్యత లేమి పార్టీకి నష్టం

కర్ణాటకలో కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రధాన పక్షంగానే ఉంటూ వచ్చింది. కానీ ముఠాతత్వం, కీలక సమయాల్లో ఐక్యతా లేమి కారణంగా పార్టీ మట్టికొట్టుకుపోతోంది. అయితే, ఐక్యత లేకుండా ఈ దఫా ఎన్నికల్లో మెజారిటీ వచ్చే అవకాశం కలగానే మిగిలిపోతుందని పార్టీ, ప్రత్యేకించి దాని రాష్ట్ర నాయకత్వం గుర్తిస్తోంది. ఇద్దరు కీలక నేతలు సిద్ధరామయ్య, శివకుమార్ ముఖ్యమంత్రి పదవిపై తమ ఆకాంక్షలను ఇప్పటికే ప్రకటించారు. అయితే తమ లక్ష్మణ రేఖను మాత్రం వారు దాటలేదు. ఎన్నికల అనంతరమే ముఖ్యమంత్రి అభ్యర్థి నిర్ణయం జరుగుతుందని వీరు ప్రకటించారు. పార్టీలో ఐక్యత కొన సాగుతుందో లేదో తేల్చడానికి అభ్యర్థులకు టికెట్ల పంపిణీ సమయమే లిట్మస్ పరీక్ష అవుతుంది (అయితే ఇప్పటికి రెండు జాబితాలను కాంగ్రెస్ వెలువరించింది). ఇంతవరకు పార్టీ స్థానిక సమస్యలపై, బీజేపీ పాలనపై దృష్టి పెట్టింది. అయితే, లోక్‌సభ నుంచి రాహుల్ గాంధీ బహిష్కరణను కూడా తమ ప్రచారంలో అదనపు అంశంగా జోడించింది. సాంప్రదాయకంగా మద్దతు పొందుతున్న పలు వర్గాల పొత్తును కాంగ్రెస్ పట్టుదలతో సాధించిందని గుర్తుంచుకోవాలి.

స్పష్టమైన ఫలితమే...

జేడీఎస్ పార్టీ సుదూరంలోని మూడవ శక్తిగా కొనసాగుతోంది. కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ రాజకీయంగా పెను నష్టాన్ని చవిచూసింది. దాంతో పాత మైసూరు రీజియన్లోని జేడీఎస్ సాంప్రదాయిక పునాదిలోకి బీజేపీ చొచ్చుకు వెళ్లడానికి ఇది అనుమతించింది. అయితే కాంగ్రెస్, బీజేపీ రెండూ తమ పార్టీతో టచ్‌లో ఉంటున్నాయని చెప్పడం ద్వారా జేడీఎస్ నేత కుమారస్వామి రాజకీయంగా సంచలనం సృష్టించారు.

చాలామంది ఓటర్లు ఎన్నికల ప్రకటనకు చాలాముందుగానే తాము ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నది నిర్ణయించుకుంటున్నట్లు గత కొన్నేళ్లలో లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ జరిపిన పోల్ అనంతర సర్వేలు సూచిస్తున్నాయి. క్రితంసారి కర్ణాటక ఎన్నికల విషయంలో ఇదే నిజమైంది. కొంతమేరకు ఇది రాజకీయ పోలరైజేషన్‌ను ప్రతిఫలించింది. ఈ పార్టీలకు ఉన్న నిబద్ధ ఓటర్ల రీత్యా, ఇది అంత ఆశ్చర్యం కలిగించదు. అందువల్ల ఊగిసలాడే ఓటర్లకు ప్రాధాన్యత పెరుగుతుంది. కాబట్టి రాబోయే రోజుల్లో ఈ ఓటర్లను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు తీవ్రమవుతాయి. చాలామంది ఎన్నికల వ్యాఖ్యాతలు ఈసారి హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని ఊహిస్తున్నారు. కానీ ఈ అసెంబ్లీ ఫలితాలు మరింత స్పష్టతతో వెలువడతాయి.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు;
జాతీయ సమన్వయకర్త, లోక్‌నీతి నెట్‌వర్క్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పనికిరానివి



రేపు (7 ఏప్రిల్) నా హేపీ బర్త్ డే. దయ చేసి నాకు విషెస్ చెప్పొద్దు. ఎందుకంటే, శుభాకాంక్షలు అనేవి ఉచితం, నిరుపయోగం. చవక బహుమతులైనా ఫర్లేదు. ఉచితం కంటే చవక మెరుగు.
– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

సత్యం చెబితే...



యూఎస్ బలగాలు ఇరాకీ పౌరుల మీద కాల్పులు జరిపే వీడియోను జూలియన్ అసాంజే పదమూడేళ్ల క్రితం ఈరోజు (6 ఏప్రిల్) విడుదల చేశారు. అందుకు 175 ఏళ్ల కారాగార శిక్షను ఎదుర్కోనున్నారు.
– సారా, లెబనీస్ కామెంటేటర్

స్థానిక సాధికారత



మొత్తం పైనుంచి కిందికి వచ్చే 'కేంద్ర ప్రణాళిక' విధానంలో చైనా పనిచేస్తుందని చాలామంది భావిస్తారు. కానీ దేశ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలు (ప్రావిన్సులు, నగరాలు, గ్రామాలు మొదలైనవి) ఊహించలేనంతగా 85 శాతం ఖర్చు పెడతాయి. ఇంకోలా చెప్పాలంటే, ఇతర దేశాలు సగటున కేంద్రంలో 66 శాతం ఖర్చుపెడితే, చైనా కేంద్ర ప్రభుత్వం కేవలం 15 శాతం మాత్రమే ఖర్చు చేస్తుంది.
– అర్నాడ్ బెర్ట్రాండ్, ఆంట్రప్రెన్యూర్

ఎవరో ఏమో!



కొన్నేళ్ల తర్వాత– పిల్లాడు (తాజ్‌మహల్‌ను చూస్తూ): దీన్ని ఎవరు నిర్మించారు? అమ్మ: ఎవరో ఏమో. పిల్లాడు (ఎర్రకోటను చూస్తూ): దీన్ని ఎవరు నిర్మించారు? అమ్మ: ఎవరో ఏమో. పిల్లాడు తన స్నేహితులతో తాజ్‌మహల్, ఎర్రకోటను చూశానంటూ వాటిని ఎవరో ఏమో నిర్మించారని చెబుతాడు.
– నయీమా, రేడియో జాకీ

ప్రశ్నలకు సిద్ధమా?



సుదీప్! ఒక మేటి కళాకారుడిగా మీరు సమాజంలోని అన్ని వర్గాల ప్రేమతో పెరిగారు. మీరు సామాన్య జనం గొంతుక అవుతారని ఆశించాను. కానీ ఒక రాజకీయ పార్టీ రంగు పూసుకుంటారని ఊహించలేదు. ఇక నుంచి మిమ్మల్నీ, మీ పార్టీనీ ప్రజలు ప్రశ్నిస్తారు. సిద్ధంగా ఉండండి.
– ప్రకాశ్ రాజ్, నటుడు

మర్యాద



సుధామూర్తికి పద్మభూషణ్ ఇచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో పురస్కారాల ప్రదాన వేడుక జరిగినప్పుడు ఒక ఆసక్తికర విషయం చోటు చేసుకుంది. ఆమె కూతురు అక్షతా మూర్తి (యూకే ప్రధాని రిషి సునాక్ భార్య) మొదట కుటుంబంతో కలిసి మధ్య వరుసల్లో కూర్చున్నారు. కానీ ప్రభుత్వ అధికారులు ఆమెను ముందు వరుసకు మార్చారు.
– చంద్ర ఆర్. శ్రీకాంత్, సంపాదకురాలు


జై హనుమాన్



చిన్నప్పుడు మా అమ్మ, హనుమంతుడి అంత బలం కావాలంటే మొత్తం అన్నం తినమని చెప్పేది. తర్వాత, నేను జిమ్‌కు పోవడం మొదలుపెట్టాక, అక్కడ కండలు పెంచడానికి స్ఫూర్తి కలిగించేలా హనుమంతుడి పోస్టర్లు ఉండేవి. చాలా కాలం తర్వాత ఆయన అసలైన 'కండలు' వివేకం, ధైర్యం, శ్రద్ధ, స్వీయ క్రమశిక్షణ అని తెలుసుకో గలిగాను. హనుమాన్ జయంతి (ఏప్రిల్ 6) హార్దిక శుభాకాంక్షలు.
– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

సారీ చెప్పడం తెలియకపోతే...

కామెంట్



కరణ్ థాపర్

విధికి సంబంధించిన చమత్కారాలు, వక్రోక్తులు నాకు ఎంతో ఆసక్తి గొలుపుతుంటాయి. ఘటనలు మీకు విరుద్ధంగా జరుగుతాయని మీరు అసలు ఎంతమాత్రమూ ఊహించనప్పుడు, అవి వాస్తవంగా అలాగే పైకి తేలుతాయి. అవును, అలాగే జరుగుతాయి. వ్యావహారికంగా దీన్ని 'సోడ్ న్యాయం' అని పిలుస్తారు. (ఒకటి తప్పుగా జరిగే అవకాశం ఉంటే, అది చివరకు తప్పుగానే జరుగుతుందని బ్రిటన్లో నవ్వుతూ చెప్పే మాట.) షేక్‌స్పియర్ వంటి నాటకకర్త చేతుల్లో అది మితిమీరిన గర్వంగా పరివర్తన చెందుతుంది. ఆయన గొప్ప విషాదాంత నాటకాలు ఈ వ్యవహారం పైనే ఆధారపడి రూపొందాయి. ఏ రకంగా చూసినా, ఇది 'దేవుడి లీలావిలాసాలు' మనకు వెల్లడయ్యే క్షణం!

రెండు క్షమాపణలు

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విషయంలో జరిగింది అదే. ఆడంబరంగా, అలా కాదనుకుంటే డాంబికంగా అయన పత్రికా సమావేశంలో ఇలా ప్రకటించారు: "నా పేరు గాంధీ; గాంధీలు ఎన్నడూ ఎవరికీ క్షమాపణ చెప్పరు". దురదృష్టవశాత్తూ ఇద్దరు వ్యక్తులకు ఆయన క్షమాపణలు బాకీ పడ్డారని స్పష్టమైన సమయంలోనే, ఆయన ఈ వ్యాఖ్య చేశారు. చాలా స్పష్టంగా అది బహిర్గతమైన విషయం. పైగా అది కచ్చితంగా బహిరంగంగా జరిగిన విషయం.

రాహుల్ తన తొలి క్షమాపణను మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు బాకీ పడ్డారు. 2013లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తెచ్చిన ఒక ఆర్డినెన్స్‌ను "పూర్తిగా అర్థరహితం" అని పేర్కొంటూ రాహుల్ దాన్ని చింపేశారు. విచిత్రమైన విషయం ఏమి టంటే, ఆ ఆర్డినెన్స్ పాస్ అయి ఉంటే, పార్లమెంట్ నుంచి రాహుల్ గాంధీ ప్రస్తుత అనర్హతను అది అడ్డుకుని ఉండేది. ఎందుకంటే, ఆ ఆర్డినెన్సు ఇలా ఒక శాసనాన్ని పొందుపర్చింది. "శిక్ష పడిన నాటి నుంచీ 90 రోజులలోపు, ఆ శిక్షను పునర్విమర్శ చేయమని కోరుతూ ఒక విజ్ఞప్తి లేదా అభ్యర్థనను దరఖాస్తు చేసినట్లయితే" కనీసం రెండేళ్ల శిక్ష పడిన పార్లమెంట్ సభ్యుడి తక్షణ అనర్హత అనేది అనిశ్చిత స్థితిలోకి వెళ్తుంది. (ఇంకో రకంగా చెప్పాలంటే, అప్పటికి నిలుపుదల అవుతుంది.)

2013లో రాహుల్ గాంధీ గుర్తించనిది – బహుశా, ఈ రోజు ఆయన మర్చిపోనిది ఏమిటంటే, ఆయనకు పడిన శిక్షపై ఒకవేళ న్యాయస్థానం చివరకు స్టే విధించినప్పటికీ... ప్రస్తుత పార్లమెంటులో ఆయన చాలా వారాలపాటు అడుగు పెట్టే అవకాశం అప్పటికి కోల్పోయి వుంటారు. ఇది కేవలం వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు. అంతకంటే ముఖ్యంగా, ఆయన నియోజక వర్గమైన వయనాడ్ (కేరళ)కు ఈ కాలంలో ప్రాతినిధ్యం లేకుండా పోతుంది. ఇది భారతీయ ప్రజాస్వామ్యాన్ని క్షీణింపజేస్తుందని కూడా మీరు వాదించవచ్చు. మామూలుగా లోక్‌సభలో వ్యక్తీకరించగలిగిన ఒక అభిప్రాయం వినలేని పరిస్థితి వస్తున్నది కాబట్టి.

2013లో రాహుల్ గాంధీ ఆ ఆర్డినెన్స్‌ను లాలూ ప్రసాద్ యాదవ్‌ను కాపాడటానికి తెస్తున్న ముతక, ఇంకా చెప్పాలంటే అనైతిక ప్రయత్నంగానే చూశారు. కానీ ఆ ఆర్డినెన్స్‌కు అంతకంటే మించిన విలువ ఉందని ఆయన చూడలేకపోయారు. ఇంకా చెప్పాలంటే చూడదల్చలేదు కూడా. బహుశా ఆ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ప్రజాగ్రహం ఉందన్న అంశంపైనే ఆయన దృష్టి మొత్తంగా ఉండేది. అయితే ఆయన ఆ విషయంలో ఎంత తప్పు చేశారన్నది ఇప్పుడు ఆయనకు కలిగిన దురవస్థ వెల్లడిస్తోంది.

ఇంకా ఘోరమైన సంగతి ఏమిటంటే, తన విమర్శను బహిరంగంగా ప్రదర్శించడం ద్వారా మన్మోహన్ సింగ్‌ను ఉద్దేశపూర్వకంగా రాహుల్ అవమానించారు. "దాన్ని చింపి, అవతల పారెయ్యాలి". ఇది జూలియస్ సీజర్‌ను బ్రూటస్ పొడి చేయడం లాంటిదే. ఆ వ్యాఖ్య మన్మోహన్‌కు నష్టం చేయడమే కాదు, ప్రధానిగా ఆయన్ని బలహీన పర్చింది.



అందుకే, డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు పూర్తిగా బహిరంగ క్షమాపణ చెప్పడాన్ని రాహుల్ గాంధీ బకాయి పడ్డారు.

సముచితం కాని స్పందన

రెండో క్షమాపణ – అది చెప్పడం జరిగినట్లయితే– రాహుల్ ఎలాంటి వ్యక్తో వెల్లడవుతుంది. అది ఆయన స్వభావానికి, చివరకు తన నైతిక సమగ్రతకు కూడా పరీక్షే అవుతుంది. అందువల్ల, ఈ రెండు క్షమాపణలు చెప్పడం కష్టమైనవే కానీ అవి మరింతగా అవసర మైనట్టివి.

"ఓబీసీ కమ్యూనిటీని రాహుల్ గాంధీ అవమానించారని బీజేపీ చేసిన ఆరోపణపై మీ అభిప్రాయం ఏమి"టని మార్చి 25న జరిగిన ఒక ప్రెస్ కాన్ఫరెన్సులో అడిగిన ఒక జర్నలిస్టు పట్ల రాహుల్ చాలా గర్వంతోనూ, మొరటుగానూ వ్యవహరించారు. కచ్చితమైన, సముచి తమైన ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి బదులుగా రాహుల్ ఆ విలేఖరిపై మాటల దాడికి దిగారు.

"నువ్వు బీజేపీకి ఇంత నేరుగా ఎందుకు పనిచేస్తున్నావ్... నీకు వారి నుంచి ఆదేశాలు అందాయా... నువ్వు బీజేపీ కోసం పనిచేయాల నుకుంటే, బీజేపీ జెండా... లేదా గుర్తు ... తెచ్చుకుని నీ ఛాతీపై పెట్టుకో... అప్పుడు వారికి నేను ఏ రీతిలో సమాధానం చెబుతానో నీకు కూడా అలాగే జవాబు చెబుతాను. అంతేకానీ పత్రికల మనిషిగా నటించవద్దు."

ఇబ్బంది కలిగించేలా తన స్థిరత్వాన్ని, స్థిమితాన్ని కోల్పోవడం సరిపోలేనట్టుగా– రాహుల్ గాంధీ ఆ జర్నలిస్టును మరింత వెటకారం చేశారు. ఇంకో ప్రశ్న (మరెవరో) అడుగుతుండగా, అందరికీ వినబడే ట్టుగా రాహుల్ గాంధీ "హవా నికల్ గయీ"(గాలి పోయింది) అనేశారు. ఆయన ముఖంలో తెలివితో కూడిన నవ్వు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేసింది.

రాహుల్ గాంధీ చెప్పింది సమర్థించుకోలేనిది. దీంతో ఎవరైనా అంగీకరించారంటే నాకు సందేహమే. అయినా సరే ఆయన క్షమాపణ చెబుతారా? ఇది యథాలాపంగా సంధించిన ప్రశ్న కాదు. ఇది రాహుల్ వ్యక్తిత్వానికి, నైతిక స్వభావానికి కొలమానం. నిజాయితీగా చెప్పాలంటే, రాహుల్ ఎలాంటి వ్యక్తి అని తెలిపే పరీక్ష ఇది.

వివేకం, ఆత్మసాక్షి ఉన్న రాజకీయ నాయకుడు క్షమాపణ చెబుతారు. పైగా క్షమాపణ అనేది రాహుల్ గాంధీ స్థాయిని పెంచు తుంది. ఆయన పట్ల మన గౌరవం పెరిగేట్లు కూడా చేస్తుంది. కానీ ఆయన ఇప్పటికే మూర్ఖంగా ప్రగల్భాలకు పోయారు: "గాంధీలు ఎన్నడూ ఎవరికీ క్షమాపణ చెప్పరు." ఒకవేళ అదే ఆయన వైఖరి అయితే, అంటే క్షమాపణ అవసరమైనప్పుడు, దాన్ని బాకీ పడిన ప్పుడు కూడా అలాగే చేస్తానంటే ఆ బడాయికోరుతనం అనేది దోషం అవుతుంది. ఎలా క్షమాపణ చెప్పాలో తెలీని రాజకీయనాయకుడిగా ఆయన మారిపోతారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

నరుల పాపపరిహారార్థం...

యేసుక్రీస్తు జననం ప్రజలందరికీ కలిగిన శుభ వర్తమానం. ఆయన మరణం ప్రజలందరికీ కలిగిన ముక్తి మార్గం. మన వంటి నరుడు మనలను ప్రేమించిన ఎడల మన వలన ఏదో ఒక లాభం కోరుతారు. కానీ మనలాంటి నరుల పాపపరిహారార్థం యేసుక్రీస్తు ప్రాణం పెట్టాడు. ఆయన లాంటి పుణ్యుడు కేవలం మానవాతీతుడు కాబట్టి ఆ పుణ్యుడు ప్రాణం పెట్టినరోజు అయిన శుక్రవారం 'మంచి శుక్రవారం' (గుడ్ ఫ్రైడే)గా క్రైస్తవులు జరుపుకొంటున్నారు.

యేసుక్రీస్తు తన 30వ యేట నుంచి దైవ కార్యం నిమిత్తం, శారీరక బాధలతో నలిగిపోతున్న అనారోగ్యవంతులను స్వస్థపరిచాడు. చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో చనిపోయిన మనుషులను బ్రతికించాడు. ఆ విధంగా దైవ కుమారునిగా ప్రత్యక్షపరుచుకున్నాడు.

కానీ ఓర్వలేని మత ఛాందసవాద మత పెద్దలు 'దైవ కుమారుడు అంట, యూదుల రాజు అంటున్నాడు' అని, అయన 12 మంది శిష్యులలో ఒక్కడైన యూదా ఇస్కరియోతుకు 30 వెండి నాణాలు ఇచ్చి ఆయన జాడ తెలుసుకుని, రోమా అధికారులకు అప్పగించి, తప్పుడు నేరాలు మోపి నేరస్థులకు విధించు 'సిలువ' అనే శిక్షను విధించేలా చేశారు. యేసుక్రీస్తుకు మోయలేని మ్రాను భుజము మీద పెట్టి, ముళ్ల కిరీటం తలపై పెట్టారు. రక్తం ఓ ప్రక్క కారుతున్న తరుణంలో చిరక అను చేదును దాహమునకు ఇవ్వగా యేసుక్రీస్తు త్రాగలేదు. చివరకు పాప పరిహారార్థం దేవునికి తన ఆత్మను (ప్రాణాన్ని) సిలువపై అప్పగించి ఆరోహణమయ్యాడు. దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యాడని బైబిల్ చెప్తుంది.

యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను క్రీస్తు చనిపోయిన శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు చర్చిలలో విశ్వాసులు (శిష్యులు, క్రైస్తవులు) ధ్యానిస్తారు. 'ప్రభువా! మమ్మును కనికరించి నీ రాజ్యములో చేర్చుకో' అంటూ 40 దినముల ఉపవాసంతో (శ్రమ దినాలు) ప్రార్థనలు చేస్తారు.

– బి.బి. చంద్రపాల్ కోట
(నేడు గుడ్ ఫ్రైడే)

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధ రాత్రి వరకు 73,208 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.12 కోట్లు సమర్పించారు. టికెట్లు లేని వారికి స్వామివారి దర్శనం 24 గంటల సమయం పడుతోంది. కాగా, డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఈ నెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది.

త్వరలోనే ఉప లోకాయుక్తల నియామకం

లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి



బి.కొత్తకోట: రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు ఉప లోకాయుక్తలను నియమించనున్నట్లు లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి తెలిపారు. ఆయన గురువారం అన్నమయ్య జిల్లా చెన్నరాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ లోకాయుక్త ప్రస్తుత చట్ట నిబంధనల కారణంగా ఉప లోకాయుక్తలుగా పని చేసేందుకు న్యాయమూర్తులు సుముఖత వ్యక్తం చేయడం లేదని చెప్పారు. ఉప లోకాయుక్తలుగా గ్రేడ్-1 జిల్లా న్యాయమూర్తులను నియమించాల్సి ఉందన్నారు. వారు ఈ విధులు నిర్వహిస్తే హైకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసే అవకాశం ఉండదన్న కారణంతో నియామకాలు సాధ్యం కావడంలేదన్నారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, తక్షణమే స్పందించి చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారని, సభ ఆమోదించిందని తెలిపారు. ఆ బిల్లు గవర్నర్ ఆమోదం పొందగానే ఉప లోకాయుక్తల నియామకానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో లోకాయుక్త క్యాంపుల ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌జిల్లాలో పెన్నా నదిని ఆక్రమించి నిర్మాణాలు చేసిన 101మందికి సుమోటోగా నోటీసులు జారీచేశామని చెప్పారు. ప్రస్తుతం లోకాయుక్త వద్ద 4,800 కేసులు ఉన్నాయన్నారు. అత్యధికంగా రెవెన్యూ శాఖ కేసులు ఉన్నాయని, తమ తీర్పులను అమలుచేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. పోలవరం పరిహారం అక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరుపుతామని చెప్పారు.

నల్లమలలో బైకు కలకలం

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలోని నల్లమల అడవిలో ఓ బైకు అనుమానాస్పదంగా ఉండటం కలకలం రేపింది. స్థానిక జీనకంకర తపోవనం సమీపంలోని అడవిలో నాలుగు రోజుల నుంచి బైక్ ఉండటం గురువారం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై మహానంది ఎస్‌ఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా కొందరు భక్తులు మహానందికి వచ్చారని, పలువురు తమబైకులను స్థానిక టాయిలెట్ల వద్ద పార్కింగ్ చేసుకున్నారన్నారు. సూపర్‌స్పెండర్ బైకులు రెండూ ఒకటే ఉండటంతో ఓ యువకుడు తన బైక్ అనుకుని ఇతరుల బైకును తీసుకెళ్లాడన్నారు. దీంతో గుర్తించిన యువకుడు బైకును నల్లమలలో వదిలేసి మళ్లీ తన బైకును తీసుకెళ్లిన ట్లు తెలిపారు. తాజాగా నల్లమలలో ఉన్న బైకును మహదేవపురం గ్రామానికి చెందిన యజమానులు వచ్చి తీసుకెళ్లారని చెప్పారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో రాజస్థాన్ బాబా పూజలు

మహానంది: రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజస్థానీయుల గురువు బోమా రామ్‌జీ బాబా గురువారం మహానందికి వచ్చారు. ఈ మేరకు ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. లోకంలో అందరూ బాగుండాలని మహానందీశ్వరస్వామిని వేడుకున్నట్లు చెప్పారు. మహానందిలో జలసంపద అద్భుతంగా ఉందన్నారు. ఆయన వెంట నంద్యాల పట్టణంలో వ్యాపారాలు నిర్వహించుకుంటున్న రాజస్థానీ వ్యాపారులు పాల్గొన్నారు.

వేసవిలో అరుదైన వాతావరణం

- మూడు వారాల నుంచి కొనసాగుతున్న ద్రోణి, ఆవర్తనాలు
- 20 రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- సముద్రం నుంచి వచ్చే తేమ గాలులే కారణం



సాక్షి, విశాఖపట్నం: వేసవి ఆరంభంలో అరుదైన వాతావరణం నెలకొంది. మార్చి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఉపరితల ద్రోణి, ఆవర్తనాల ప్రభావం కొనసాగుతోంది. ఫలితంగా మూడు వారాల నుంచి రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అక్కడక్కడా భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాలతో పాటు అప్పుడప్పుడు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులు కూడా సంభవిస్తున్నాయి. సాధా రణంగా ద్రోణి, ఆవర్తనాలు ఏర్పడితే 3 లేదా 4 రోజులు, గరిష్టంగా వారం రోజుల పాటు ప్రభావం చూపుతాయి. కానీ.. ఈసారి పరిస్థితి అలా లేదు. మూడు వారాలు దాటినా అవి బలహీన పడకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఇందుకు ఉత్తరాదిలో 'వెస్టర్న్ డిస్టర్బెన్సెస్' (పశ్చిమ అసమతుల్యతలు) ఏర్పడటం వల్ల అటు నుంచి చల్లని పొడిగాలులు వస్తున్నాయి. ఇటు బంగాళాఖాతం వైపు నుంచి తేమతో కూడిన దక్షిణ, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయి. ఫలితంగా గాలి కోత (విండ్ డిస్కంటిన్యూ)తో ఉపరితల ద్రోణులు, ఆవర్తనాలు ఏర్పడుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మార్చిలోనే 7 అసమతుల్యతలు

మార్చి నెలలోనే 7 వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ ఏర్పడినట్టు గుర్తించారు. ఉపరితల ద్రోణులు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పడుతూ కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా కొనసాగుతుండటం వల్ల ఆయా చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ద్రోణికి ఉపరితల ఆవర్తనం కూడా తోడైతే వర్షాల ఉధృతి పెరగడానికి దోహదపడుతోంది. వాస్తవానికి ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఏప్రిల్ ఆఖరులో మొదలవుతుందని, ఈ ఏడాది మార్చిలోనే ఆరంభమైందని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి ఆర్.మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురవడం వల్ల చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే తక్కువగానే నమోదవుతున్నాయన్నారు. ఇలాంటి వాతావరణం ఇటీవల కాలంలో ఎన్నడూ లేదని తెలిపారు. సముద్రం నుంచి తేమ గాలులు నిలిచిపోయే వరకు ద్రోణి, ఆవర్తనాలు మరికొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉందన్నారు.

ఉష్ణతాపాన్ని అదుపులో ఉంచాయి

ఈ ఏడాది ఫిబ్రవరిలోనే రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో వేసవి తాపం ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందారు. కానీ అందుకు భిన్నంగా ద్రోణు లు, ఆవర్తనాలు ఉపశమనం కలిగించాయి. ప్రస్తుతం కొనసాగుతున్న అరుదైన వాతావరణం వల్ల మే నెలలో థండర్ షవర్స్ (చిరు జల్లులు/వర్షాల)కు ఆస్కారం తక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నా రు. మే నెల ఆరంభం నుంచి ఉపరితల ద్రోణి బంగాళాఖాతం వైపు వెళ్లిపోతుందని, దీంతో అప్పట్నుంచి వేసవి తీవ్రత గణనీయంగా పెరుగుతుందని పేర్కొంటున్నారు.

అమెజాన్‌తో కేంద్రం ఒప్పందం

న్యూఢిల్లీ: మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, సామాజిక అవగాహన అంశాల్లో అమెజాన్‌తో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేంద్ర క్రీడల, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ ఒప్పందం మేరకు కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖకు సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్, ఇతర ప్రచురణలు, వీడియోల్ని మరింత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు అమెజాన్ ఇండియా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనుంది.

వాకపల్లి అత్యాచార కేసు కొట్టివేత

- విచారణాధికారి వైఫల్యం వల్ల కేసును కొట్టివేస్తున్నట్లు కోర్టు తీర్పు
- బాధితులకు నష్టపరిహారం అందించాలని ఆదేశం
- విచారణాధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు



వాకపల్లి గ్రామం

సాక్షి, పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా)/ విశాఖ లీగల్: వాకపల్లి గిరిజన మహిళలపై అత్యాచారం కేసులో గురువారం తీర్పు వెలువడింది. విచారణ అధికారుల వైఫల్యం కారణంగా ఈ కేసును కొట్టివేస్తున్నట్లు విశాఖలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి ఎల్.శ్రీధర్ ప్రకటించారు. బాధితులకు నష్టపరిహారం ఇచ్చేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విచారణాధికారి శివానందరెడ్డి సరిగ్గా విచారణ చేయనందున శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి సిఫార్సు చేశారు. వివరాలు.. 2007 ఆగస్టు 20వ తేదీన అప్పటి విశాఖ జిల్లాలోని వాకపల్లిలో 11 మంది గిరిజన మహిళలు తమపై ప్రత్యేక పోలీస్ దళం(గ్రేహౌండ్స్) సిబ్బంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాలు ఉద్యమించాయి. అప్పటి ప్రభుత్వం 21 మంది పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. బి.ఆనందరావును విచారణాధికారిగా నియమించగా కొంతకాలానికి ఆయన మరణించారు.

ఆ తర్వాత శివానందరెడ్డి విచారణాధికారిగా వ్యవహరించారు. మొత్తం 13 మందిని నిందితులుగా గుర్తించారు. ప్రాసిక్యూషన్ 38 మంది సాక్షులను విచారించింది. సుదీర్ఘ విచారణ తర్వాత కేసును కొట్టివేస్తూ కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. కాగా, 11 మంది మహిళల్లో ఇద్దరు అనారోగ్య సమస్యలతో మరణించారు. అప్పటి ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేయగా.. బాధితులు నిరాకరించారు.

టీడీపీ హయాంలో ఎన్ని ఇళ్ల స్థలాలిచ్చారు?

921వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: తెలుగుదేశం పార్టీ హయాంలో పేదలకు ఎన్ని ఇళ్ల స్థలాలిచ్చారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని చంద్రబాబు అండ్‌కోను బహుజన పరిరక్షణ సమితి నాయకులు సూటిగా ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 921వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదలకు 54 వేల ఇళ్ల పట్టాలిచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకెళుతుంటే కులవాదులు అడ్డుకునేందుకు తప్పుడు కేసులు వేయడం సిగ్గుచేటన్నారు. బాబు మోచేతి నీళ్లు తాగుతున్న కొంతమంది దళిత దళారులు రాజధాని ప్రాంతంలో ఉద్యమం పేరుతో దళితుల ఆత్మగౌరవాన్ని మంట గలుపుతున్నారని మండిపడ్డారు. అసైన్డ్ కుంభకోణంలో టీడీపీ మంత్రులు, చంద్రబాబు హస్తం ఉందని స్పష్టంగా ఆధారాలతో సహా కేసులు నమోదైతే మారుమాట్లాడని వీరు.. 54 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే ఎల్లో మీడియాలో చిలుక పలుకులు పలుకుతుండటం సిగ్గుచేటన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు ఎనలేని మేలు జరుగుతుందనడంలో సందేహం లేదని చెప్పారు. రాష్ట్రంలో 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తారని చంద్రబాబు అండ్‌కోను హెచ్చరించారు.నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సులభంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ.. కష్టంగా గణితం

- జేఈఈ మెయిన్ 2వ సెషన్ తొలిరోజు పరీక్ష
- తొలి సెషన్ మాదిరిగానే ప్రశ్నల స్థాయి

సాక్షి, అమరావతి: జేఈఈ మెయిన్ 2వ సెషన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం 2 బ్యాచులుగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. ఈనెల15 వరకు పరీక్షలు జరుగుతాయి. తొలి రోజు పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు ఒకింత సులభంగా ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. గణితంలో మాత్రం ప్రశ్నలకు సమాధానాల గుర్తింపు కష్టమైందని తెలిపారు. దేశవ్యాప్తంగా 330 పట్టణాల్లో ఏపీలో 25 పట్టణాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు 9.4 లక్షల మంది రిజిస్టర్ అయ్యారు. ఏపీ నుంచి 1.5 లక్షల మంది వరకు రాస్తున్నారు. గురువారం జరిగిన జేఈఈ మెయిన్ తొలి షిఫ్ట్ పరీక్షలో విద్యార్థుల ఫీడ్‌బ్యాక్ ప్రకారం ప్రశ్నల తీరు మధ్యస్థ స్థాయిలో ఉంది. పేపర్ జనవరి (తొలి) సెషన్ మాదిరిగానే ఉందని విద్యార్థులు చెప్పారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ పేపర్ల క్లిష్టత గత ఏడాది జేఈఈతో పోలిస్తే తక్కువగా ఉందని విజయవాడలోని ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థ సబ్జెక్టు నిపుణుడు మురళి తెలిపారు. ఫిజిక్స్ పేపర్ మోడరేట్ స్థాయిలో ఉందని, 85 శాతం ప్రశ్నలు ఫార్ములా ఆధారితంగా వచ్చాయని నిపుణులు చెప్పారు. సెమీ కండక్టర్, పీఎన్ జంక్షన్ తదితర అంశాల ఆధారంగా ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. కెమిస్ట్రీ పేపర్ సులువుగానే ఉందని, ఎన్సీఈఆర్టీ పుస్తకాల ఆధారంగా ప్రశ్నలడిగారని, థియరీ ఆధారంగా ప్రశ్నలు ఉన్నాయని తెలిపారు. ఫిజిక్స్ కెమిస్ట్రీల కన్నా గణితం కష్టంగా ఉందని వెల్లడించారు.

కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డు ధ్వంసం

- టీడీపీ మాజీ మంత్రి కాలువ అనుచరుల బరితెగింపు
- ప్రశ్నించిన కాంట్రాక్టర్‌పై దాడి



కాంట్రాక్టర్ రఘు

కణేకల్లు : అభివృద్ధి పనులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు రావడాన్ని జీర్ణించుకోలేని ఆ టీడీపీ నేత.. కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డును ధ్వంసం చేశాడు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై దాడి చేశాడు. ఈ ఘటన గురువారం అనంతపురం జిల్లా కణేకల్లు మండలంలో జరిగింది. కణేకల్లు నేసేపేట బీసీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్, వైఎస్సార్‌సీపీ నేత నేసే రఘు గురువారం పనులు ప్రారంభించారు. అదే కాలనీలో నివాసముంటున్న టీడీపీ నేత, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ముఖ్య అనుచరుడు బోయ హనుమంతరాయుడు రోడ్డు వేయొద్దంటూ గొడవకు దిగాడు. సిమెంట్ రోడ్డు వేయడం వల్ల తన ఇంటి వద్ద వర్షం నీరు నిలుస్తుందంటూ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇంటి ముందు కాంక్రీట్‌తో కాస్త ఎత్తు పెంచుకుంటే నీళ్లు వెళతాయని, అందుకోసం రోడ్డే వేయవద్దని చెప్పడం బాగోలేదని కాంట్రాక్టర్ నచ్చచెప్పే యత్నం చేశాడు. అయినా వినిపించుకోని హనుమంతరాయుడు తన కుమారుడు ఈశ్వర్, ఆనంద్‌లతో కలిసి అప్పుడే వేసిన రోడ్డును ధ్వంసం చేయించాడు. అడ్డుకునేందుకు యత్నించిన కాంట్రాక్టర్‌పై హనుమంతరాయుడు, అతని ఇద్దరు కుమారులు దాడి చేశారు. ఈ ఘటనపై కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సిమెంట్ రోడ్డును ధ్వంసం చేస్తున్న టీడీపీ నేత కుమారుడు ఈశ్వర్

పవన్‌ది లక్ష్యం లేని పోరాటం

- పేదల ఇళ్లను అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు
- సీపీఐ నేత నారాయణ విమర్శ



శెట్టిపల్లి భూములలో గడ్డపారతో తవ్వుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి మంగళం: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ది రాజకీయ లక్ష్యం లేని పోరాటం అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. తిరుపతి పరిధిలోని శెట్టిపల్లి భూముల్లో గురువారం వామపక్ష నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ ఢిల్లీకి వెళ్లి టీడీపీ, బీజేపీతో కలిసి ఎన్నికలకు పోయేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీకి బద్ధ శత్రువైన బీజేపీ విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం లేదని.. అలాంటి పార్టీతో పొత్తు పెట్టుకుంటే గెలవలేరన్నారు. తామెప్పుడూ రామోజీరావును సపోర్ట్ చేయలేదన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో అసైన్డ్ భూములు ఉన్నాయంటే.. తామంతా వెళ్లి ఆక్రమించామన్నారు. శెట్టిపల్లి భూముల్లో పేదల ఇళ్ల నిర్మాణాలను ఆపిన ద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు. తిరుపతి కార్పొరేషన్‌లోకి శెట్టిపల్లిని విలీనం చేయడం సంతోషమని.. కార్పొరేషన్ అధికారులు మౌలిక వసతులు కల్పించి అందుకు అవసరమైన పన్నులు వసూలు చేసుకోవచ్చన్నారు. అనంతరం శెట్టిపల్లి భూముల్లో ఇళ్లు కడతామంటూ గడ్డపారతో గుంతలు తవ్వి రాళ్లు పెట్టారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు హరినాథరెడ్డి, రామానాయుడు, మురళి, కేతారి రాధాకృష్ణ, వందాసి నాగరాజు, పెంచలయ్య పాల్గొన్నారు.



ఒంటిమిట్ట వీధుల్లో రథంపై ఊరేగుతున్న శ్రీరాముడు

వైభవంగా కోదండ రాముడి రథోత్సవం

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండ రాముడు రథాన్ని అధిష్ఠించి గ్రామ వీధుల్లో విహరించారు. చెక్క భజనలు, కోలాట ప్రదర్శనల నడుమ భక్తులు శ్రీరామ నామం జపిస్తూ రథాన్ని ముందుకు లాగారు. ఒంటిమిట్ట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు కాళీయమర్దన అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం , సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఘనంగా పౌర్ణమి గరుడ సేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

తిరుమల: తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, వీజీవో శ్రీ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, తిరుమలలోని శేషాచల అడవుల్లో ప్రముఖ తీర్థంగా భాసిల్లుతున్న తుంబురు తీర్థ ముక్కోటి సందర్భంగా 36,200 మంది భక్తులు గురువారం తీర్థ స్నానం ఆచరించారు. కాగా, గరుడ సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ రామకృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు.


తిరుమలలో హైకోర్టు సీజే



తిరుమల: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆయనకు పద్మావతి అతిథిగృహం వద్ద టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు. సీజే శుక్రవారం శ్రీవారిని దర్శించుకుంటారు.

శ్రీశైలంలో రూ.75కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్

- ఈఓ ఎస్.లవన్న



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం రూ.75కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని త్వరలో అమలుకు శ్రీకారం చుడతామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. గురువారం శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపంలో ఈఓ ఎస్.లవన్న మీడియాతో మాట్లాడుతూ దేవస్థాన పరిపాలన కార్యాలయం ఎదురు, గంగాధర మండపం నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు ఉన్న తాత్కాలిక దుకాణాలు(టెంపరవరీ షాపు రసీదు) ఖాళీ చేసి బహిరంగ వేలం ద్వారా దుకాణాలు కేటాయించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు దేవస్థానం సంకల్పించింది. ఇందులో భాగంగా స్థానిక తాత్కాలిక దుకాణదారులు కూడా నష్టపోకుండా ఉండేందుకుగాను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచనల మేరకు దుకాణాలు నిర్వహించుకుంటున్న దుకాణదారులకే వేలం ద్వారా దుకాణాలు కేటాయించేలా ట్రస్ట్‌బోర్డులో తీర్మాణం చేశారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం మల్లికార్జున కల్యాణ మండపంలో 142 దుకాణాలకు వేలం నిర్వహించారు. రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనేలా అధికారులు నిర్ణయించారు. అయితే తాత్కాలిక దుకాణదారులు ఒక్కరు మాత్రమే వేలంలో పాల్గొనగా, మిగిలిన వారు వేలంలో పాల్గొనేందుకు అనాసక్తి చూపారు. అయితే దేవస్థాన అధికారులు శుక్రవారం కూడా వేలంలో పాల్గొనేలా అవకాశం కల్పించారు. శుక్రవారం బ్యాంకులకు సెలవు కావడంతో డిపాజిట్‌ను నగదు రూపంలో తీసుకుని అనుమతించేందుకు దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు దేవస్థాన మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థాన పరిపాలన భవనంకు ఎదురుగా ఉన్న దుకాణాల స్థానంలో నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో ఆయా దుకాణాలను తొలగించాలని నిర్ణయించారు. అలాగే క్షేత్రానికి తరచూ వీవీఐపీలు వస్తున్న తరుణంలో భద్రతా కారణాల దృష్ట్యా గంగాధర మండపం నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు ఉన్న తాత్కాలిక దుకాణాలను తొలగించాలని జిల్లా ఎస్పీ తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ఈఓ వివరించారు. స్థానిక వ్యాపారులు నష్టపోకూడదని దేవస్థానం అన్నివిధాల ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందని, వ్యాపారులు కూడా దేవస్థాన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని దేవస్థానానికి సహకరించి వేలంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వేలంలో పాల్గొనకపోతే ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్ణయిస్తామని అన్నారు. తాత్కాలిక దుకాణాల తొలగింపుకు దేవస్థానానికి పూర్తి హక్కులు ఉంటాయని, వ్యాపారులు ఇది గుర్తించుకోవాలని విన్నవించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ హెచ్.జి.వెంకటేష్, రెవెన్యూ ఏఈవో శ్రీనివాసరెడ్డి, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, సీఎస్‌వో అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు.. కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

బనశంకరి: కర్ణాటక అసెంబ్లీకి మే 10వ తేదీన జరగనున్న ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మరో 42 మంది అభ్యర్థులతో గురువారం రెండో జాబితా విడుదల చేసింది. పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం సిద్దరామయ్య వరుణ సీటుతో పాటు మరో చోటు నుంచి పోటీకి దిగుతారని భావిస్తున్న కోలారు స్థానం ఇందులో లేవు! ముగ్గురు సిట్టింగ్‌లకు టికెట్లు దక్కలేదు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురికీ చోటు దక్కింది. 124 మందితో కాంగ్రెస్ ఇప్పటికే తొలి జాబితా విడుదల చేయడం తెలిసిందే.

జైన్‌కు దొరకని బెయిల్

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. ఆయనకు బెలియిస్తే సాక్ష్యాధారాలను తారుమారు చేసే ఆస్కారముందని న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ అభిప్రాయపడ్డారు. ఆయన సహ నిందితులు వైభవ్ జైన్, అన్కుష్ జైన్ బెయిల్ పిటిషన్లనూ కొట్టేశారు. జైన్‌ను ఈడీ 2022 మే 3న అరెస్ట్ చేయడం తెల్సిందే.

కాంగ్రెస్ సీనియర్ నేత ఆంటోనీ కొడుకు బీజేపీలోకి

న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ ఆంటోనీ కాషాయ కండువా కప్పుకున్నారు. కేరళ కాంగ్రెస్ డిజిటల్ మీడియా హెడ్‌గా చేసిన ఆయన, ప్రధాని మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ విషయంలో పార్టీ వైఖరిని విమర్శిస్తూ జనవరిలో రాజీనామా చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, వి.మురళీధరన్ సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీకి అతి సన్నిహితుడిగా పేరున్న ఆయన తండ్రి ఏకే ఆంటోనీ ఈ పరిణామంపై విచారం వెలిబుచ్చారు. అనిల్ చేరికతో కేరళలో క్రైస్తవుల్లో పట్టు పెరుగుతుందని బీజేపీ భావిస్తోంది.

స్పేస్ పాలసీకి ఆమోదం

న్యూఢిల్లీ: ఇండియన్ స్పేస్ పాలసీ–2023కు కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. ఇస్రో, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్‌తో పాటు ఈ రంగంలోని ప్రైవేట్ సంస్థల పోషించాల్సిన పాత్ర, నెరవేర్చాల్సిన బాధ్యతలను ఈ పాలసీ కింద రూపొందించారు. సహజ వాయువు, సీఎన్‌జీ, పైప్డ్ కుకింగ్ గ్యాస్ ధరలపై నియంత్రణకు నూతన ప్రైసింగ్ ఫార్ములానూ కేబినెట్ ఆమోదించింది. దీనిప్రకారం దేశంలో పాత క్షేత్రాల నుంచి వెలికితీసే సహజ వాయువు (ఏపీఎం గ్యాస్) ధరలే ఇకపై ముడి చమురు ధరలకు సూచికగా ఉంటాయి. ఇప్పటిదాకా అమెరికా, రష్యా చమురు ధరల ఆధారంగా మన దేశంలో ధరలను నిర్ణయిస్తున్నారు.



అవినీతి అక్రమాలకు పాల్పడి, న్యాయస్థానంలో నేర విచారణను ఎదుర్కొంటున్న మొట్టమొదటి అమెరికా మాజీ అధ్యక్షుడిగా అపకీర్తిని మూటగట్టుకున్న డొనాల్డ్ ట్రంప్ మళ్లీ దేశాధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. 2024లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున తానే బరిలో ఉంటానని సంకేతాలిస్తున్నారు. అసలు అది సాధ్యమేనా అన్న చర్చ ప్రపంచమంతటా సాగుతోంది. ట్రంప్‌పై నమోదైన హష్ మనీ చెల్లింపుల కేసులో ఇకపై ఏం జరగవచ్చన్న దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ట్రంప్‌పై కోర్టులో విచారణ ప్రారంభం కావడానికి చాలా సమయం పడుతుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అంతకంటే ముందే కేసులను కొట్టివేయించేందుకు ట్రంప్ న్యాయబృందం ప్రయత్నాలకు పదును పెడుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉండొచ్చన్నది ఆసక్తికరంగా మారింది...

సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ కేసు దారెటు!?

గాగ్ ఆర్డర్ ఇస్తారా?

- డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్రమైన అభియోగాలు వచ్చాయని, అవి నిరూపితమైతే ఆయనకు గరిష్ట స్థాయిలో జైలుశిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.
- న్యాయమూర్తులపై ట్రంప్ అవాకులు చెవాకులు పేలుతున్నారు. న్యూయార్క్ సుప్రీంకోర్టు జడ్జి జువాన్ మెర్చాన్, మన్‌హట్టన్ జిల్లా అటార్నీ అల్విన్ బ్రాగ్‌పై విరుచుకుపడ్డారు.
- ట్రంప్ మంగళవారం మన్‌హట్టన్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అనుచరులు హంగామా సృష్టించారు. ఇదంతా న్యాయస్థానానికి చికాకు తెప్పించింది.
- సమాజంలో హింసను ప్రేరేపించే, అశాంతిని సృష్టించే, ప్రజల భద్రతకు భంగం కలిగించే వ్యాఖ్యలకు, ప్రవర్తనకు దూరంగా ఉండాలని ట్రంప్‌కు సుప్రీం కోర్టు న్యాయమూర్తి మెర్చాన్ హితవు పలికారు.
- ఇది జరిగిన ఐదు గంటల తర్వాత ట్రంప్ నోరు పారేసుకున్నారు. జువాన్ మెర్చాన్, అల్విన్ బ్రాగ్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు.
- మెర్చాన్, ఆయన భార్య, ఆయన కుటుంబం తనను ద్వేషిస్తోందని ఆరోపించారు. ఇక అల్విన్ బ్రాగ్ ఒక విఫలమైన జిల్లా అటార్నీ అని ఆక్షేపించారు. ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అల్విన్ బ్రాగ్ ఒక జంతువు, మానసిక రోగి అని ట్రంప్ మండిపడ్డారు.
- ట్రంప్ నోటికి తాళం వేసేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జువాన్ మెర్చాన్ గాగ్ ఆర్డర్ జారీ చేసే అవకాశం కనిపిస్తోంది.
- గాగ్ ఆర్డర్ జారీ చేస్తే కేసుల గురించి ట్రంప్ గానీ, ఆయన న్యాయబృందం గానీ ఎక్కడా బహిరంగంగా చర్చించకూడదు.
- గాగ్ ఆర్డర్‌ను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించి కేసు నమోదు చేస్తారు. ట్రంప్‌కు 1,000 డాలర్ల జరిమానా లేదా 30 రోజుల జైలు శిక్ష.. లేదా రెండు శిక్షలూ విధించే అవకాశం ఉంటుంది.

సాక్ష్యాలు అందాక ఏం చేస్తారో?

- ట్రంప్ హష్ మనీ చెల్లించిన కేసులో మన్‌హట్టన్ జిల్లా అటార్నీ కార్యాలయం గత ఐదేళ్లుగా విచారణ కొనసాగిస్తోంది.
- చెల్లింపుల వ్యవహారాన్ని ట్రంప్ ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని, 2016లో జరిగిన అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని, ఇది ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని అల్విన్‌బ్రాగ్ చెబుతున్నారు.
- దర్యాప్తులో భాగంగా తాము సేకరించిన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూటర్లు ట్రంప్ న్యాయ బృందానికి అప్పగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను 'డిస్కవరీ' అంటారు.
- ఇది 35 రోజుల్లోగా పూర్తికావాలి. కానీ, అల్విన్ బ్రాగ్ నేతృత్వంలోని ప్రాసిక్యూటర్ల బృందానికి 65 రోజుల సమయం.. అంటే జూన్ 8 దాకా గడువు ఇచ్చారు. సాక్ష్యాలు చేతికి అందాక ట్రంప్ న్యాయవాదులు ఎలాంటి ఎత్తుగడ వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

ఇకనైనా నోరు మూసుకోకపోతే గాగ్ ఆర్డర్ తప్పదు

కేసులన్నీ కొట్టివేయించేందుకు ట్రంప్ లాయర్ల యత్నాలు

కోర్టులో తీర్మానాలు ప్రవేశపెట్టాలని నిర్ణయం

తుది తీర్పు వచ్చే నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి

అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు ట్రంప్ ఏర్పాట్లు

ట్రంప్ పోటీ ఖాయమేనా?

- ట్రంప్ లాయర్ల తీర్మానాలపై డిసెంబర్ 4న కోర్టు తీర్పు వెలువడనుంది.
- తీర్మానాలకు వ్యతిరేకంగా తీర్పు వస్తే ట్రంప్‌పై అసలైన విచారణ ప్రారంభమవుతుంది.
- వచ్చే ఏడాది జనవరి నుంచి విచారణ చేపట్టాలని తాము కోర్టును కోరుతామని ప్రాసిక్యూటర్లు చెప్పారు.
- మార్చి నుంచి జూన్ వరకూ అమెరికాలో వసంత కాలం. అప్పుడైతే బాగుంటుందని ట్రంప్ లాయర్లు అభిప్రాయపడుతున్నారు.
- విచారణ మొదలయ్యే నాటికి అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రైమరీ ఎన్నికల్లో ప్రజలు పార్టీల తరఫున పోటీ చేసే నామినీలకు ఓటు వేస్తారు.
- ట్రంప్‌పై విచారణ పూర్తయ్యి, తుది తీర్పు రావడానికి చాలా సమయం పడుతుంది. అప్పటికే ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. కొత్త అధ్యక్షుడు కొలువుతీరుతాడు.
- 2024లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ నిక్షేపంగా పోటీ చేయొచ్చు. ఏ చట్టమూ ఆయనను అడ్డుకోలేదు.
- రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా వరుసగా మూడోసారి పోటీ చేయడానికి ట్రంప్ ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.
- ఒకవేళ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ట్రంప్‌ను కోర్టు దోషిగా తేల్చి, శిక్ష ఖరారు చేస్తే పదవి నుంచి దిగిపోవడమో లేక కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానాల్లో పోరాడడమో చేయాల్సి ఉంటుంది.



కోర్టులో న్యాయవాదులతో ట్రంప్ (ఫైల్)

తీర్మానం ప్రవేశపెడతారా?

- ట్రంప్‌ను అన్ని కేసుల నుంచి నిర్దోషిగా బయటకు తీసుకువస్తామని ఆయన తరఫు లాయర్లు ఇప్పటికే తేల్చిచెప్పారు. అందుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.
- చట్టప్రకారం చూస్తే విచారణ ప్రారంభం కావడానికి ముందు కేసులన్నింటినీ పునఃపరిశీలించి, ఒక నిర్ణయం తీసుకోవాలని కోర్టును అభ్యర్థించే వెసులుబాటు ఉంది. ఈ మేరకు కోర్టులో తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు.
- కేసులను పూర్తిగా కొట్టివేయాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టాలని ట్రంప్ బృందం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ న్యాయస్థానం సానుకూలంగా స్పందిస్తే ట్రంప్‌కు విముక్తి లభించినట్లే. అయితే, ఇదంతా ఆయన లాయర్ల శక్తిసామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.
- ట్రంప్ కేసులను విచారిస్తున్న జడ్జిని విధుల నుంచి తొలగించాలని, విచారణ వేదికను మన్‌హట్టన్ నుంచి సమీపంలోని స్టాటెన్ ఐలాండ్‌కు మార్చాలని కోరుతూ కూడా తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు వీలుంది. మన్‌హట్టన్‌లో ట్రంప్ అభిమానులు పెద్దగా లేరు. అక్కడ విచారణ జరపడం సమంజసం కాదని ఆయన వాదిస్తున్నారు.
- మామూలుగా అయితే 45 రోజుల్లోగా తీర్మానం ప్రవేశపెట్టాలి. ట్రంప్ బృందానికి జడ్జి మెర్చాన్ ఆగస్టు 8 దాకా గడువు ఇచ్చారు. అంటే నాలుగు నెలలు. ట్రంప్ లాయర్ల తీర్మానంపై ప్రాసిక్యూటర్లు స్పందించడానికి సెప్టెంబర్ 19వ తేదీని డెడ్‌లైన్‌గా నిర్దేశించారు.
- తమకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలూ కచ్చితంగా వాడుకుంటామని, ప్రతి చిన్న అంశాన్ని కూడా సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తున్నామని ట్రంప్ న్యాయవాది జోయ్ టాకోపినా చెప్పారు.

బడ్జెట్ సమావేశాలకు తెర

పార్లమెంటు నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు గురువారంతో తెర పడింది. అధికార, విపక్షాల పరస్పర డిమాండ్లు, నిరసనలు, గొడవల మధ్య ఏ అంశంపైనా సజావుగా చర్చ జరగకుండానే సమావేశాలు ముగిశాయి. జనవరి 31న మొదలైన బడ్జెట్ సమావేశాల్లో ఆసాంతం అదానీ, రాహుల్ అంశాలే చర్చలో నిలిచాయి. ముఖ్యంగా మార్చి 13న మొదలైన 25 రోజుల రెండో విడత పూర్తిగా వాయిదాలమయంగా సాగింది. అదానీ అవకతవకలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణకు విపక్షాలు, భారత్‌లో ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ క్షమాపణకు బీజేపీ పట్టుతో ఉభయ సభలు రోజూ వాయిదా పడుతూ రావడం తెలిసిందే. దాంతో పలు ముఖ్యమైన బిల్లులను చర్చే లేకుండా ఉభయ సభలూ ఆమోదించాల్సి వచ్చింది.

ఎప్పట్లాగే అధికార, విపక్ష సభ్యుల ఆందోళనల కారణంగా గురువారం రాజ్యసభ ఉదయం సమావేశమైన కాసేపటికే మధ్యాహ్నానికి వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక, సభా కార్యకలాపాలను వీడియో తీసినందుకు కాంగ్రెస్ ఎంపీ రజనీ అశోక్‌రావ్ పాటిల్‌పై విధించిన సస్పెన్షన్ వర్షాకాల సమావేశాల తొలి వారం దాకా కొనసాగుతుందని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. అప్పట్లోగా ప్రివిలేజెస్ కమిటీ దీనిపై దర్యాప్తు పూర్తి చేసి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేస్తుందని చెప్పారు. దీన్ని విపక్షాలు తీవ్రంగా నిరసించాయి. బుధవారం విపక్ష నేత మల్లికార్జున ఖర్గే లేవనెత్తిన పాయింటాఫ్ ఆర్డర్‌ను తోసిపుచ్చడాన్ని ఖండించాయి. రానురాను సభలో చర్చకు తావు లేకుండా పోతుండటం ఆందోళనకరమని చైర్మన్ ఆవేదన వెలిబుచ్చారు. ''మనల్ని చూసి ప్రజలు నవ్వుతున్నారు. సభలో మన ప్రవర్తనపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజల ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తున్నామో ఆలోచించాలి'' అని సూచించారు. అయినా సభ్యుల నిరసనలు నెమ్మదించకపోవడంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. లోక్‌సభ ఉదయం సమావేశమవుతూనే అదానీపై జేపీసీ డిమాండ్‌తో విపక్ష సభ్యులు హోరెత్తించారు. సభ గౌరవాన్ని మంటగలుపుతున్నారంటూ స్పీకర్ ఓం బిర్లా మండిపడ్డారు. సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

- రాజ్యసభ 130 గంటలకు గాను కేవలం 31 గంటలే పని చేసింది.
- తొలి దశ సమావేశాల ఉత్పాదకత 56.3 శాతం కాగా రెండో దశలో ఏకంగా 6.4 శాతానికి పడిపోయింది.
- లోక్‌సభ 133 గంటలకు గాను 45 గంటలే పని చేసింది.
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపైనే 13 గంటలకు పైగా చర్చ సాగింది. బడ్జెట్‌పై చర్చించింది 14.45 గంటలే.
- తొలి దశ సమావేశాలు ఉత్పాదకత 83.8 శాతం కాగా రెండో దశలో కేవలం 5.29 శాతమే.
- ఆర్థిక బిల్లు, కాంపిటీషన్ (సవరణ) బిల్లులను చర్చ లేకుండానే ఉభయసభలూ ఆమోదించాయి.

విపక్షాల ఐక్యతా రాగం

చేతులు కలిపిన 19 పార్టీలు ● విజయ్‌చౌక్ దాకా తిరంగా మార్చ్ ● బీజేపీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

నినాదాలతో హోరెత్తించిన ఎంపీలు	సంయుక్తంగా మీడియా ముందుకు	కలసికట్టుగా లోక్‌సభ ఎన్నికలకు: ఖర్గే	ఐక్యతను ముందుకు తీసుకెళ్తాం: నేతలు	ప్రజాస్వామ్యంపై నిరంతరం పెను దాడి	మోదీ సర్కారుపై నేతల విమర్శల వర్షం

న్యూఢిల్లీ: బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం నిరంతర దాడికి గురవుతోందంటూ కాంగ్రెస్‌తో పాటు 19 విపక్ష పార్టీలు మండిపడ్డాయి. గురువారం బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డ అనంతరం పార్లమెంటు ప్రాంగణం నుంచి విజయ్ చౌక్ దాకా 'తిరంగా మార్చ్' పేరిట నిరసన ర్యాలీ జరిపాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఆప్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), వామపక్షాలు, ఐయూఎంఎల్, ఆరెస్పీ తదితర పార్టీలు ఇందులో పాల్గొన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సారథ్యంలో సోనియాగాంధీతో పాటు ఎంపీలంతా త్రివర్ణ పతాకం చేబూని నినాదాలు చేస్తూ సాగారు. తమ ఐక్యతను పటిష్టపరుచుకుంటూ మోదీ సర్కారుపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని వారంతా ప్రకటించడం విశేషం! విపక్షాల ఐక్యతను మరింత ముందుకు తీసుకెళ్లడమే గాక వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఉమ్మడిగా పోరాడతామని ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు. అదానీ ఉదంతం, కులగణన ఎన్నికల్లో విపక్షాలకు ప్రధానాంశాలుగా మారతాయా అని ప్రశ్నించగా అన్ని పార్టీల అధ్యక్షులూ చర్చించుకుని వాటిపై నిర్ణయానికి వస్తారని బదులిచ్చారు. కులగణన తమ ఎజెండాలో అతి ముఖ్యమైన అంశమన్నారు. లోక్‌సభ స్పీకర్ ఇచ్చిన మర్యాదపూర్వక విందును విపక్ష నేతలు సంయుక్తంగా బహిష్కరించారు. తర్వాత కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 19 పార్టీల నేతలూ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు! మోదీ సర్కారుది అహంభావపూరిత వైఖరి అంటూ దుయ్యబట్టారు. అదిలాగే కొనసాగితే దేశం పూర్తిస్థాయి నియంతృత్వంలో మగ్గిపోతుందన్నారు. కొంతకాలంగా కాంగ్రెస్‌తో వేదిక పంచుకోవడానికి ఇష్టపడని తృణమూల్, బీఆర్ఎస్, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ కూడా ర్యాలీలోనూ, మీడియా సమావేశంలోనూ కలిసి పాల్గొనడం విశేషం! బడ్జెట్ సమావేశాలు ఆసాంతం ప్రభుత్వంపై విపక్షాలు సమైక్యంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మార్చి 13న రెండో విడత సమావేశాలు మొదలైనప్పటి నుంచీ సంయుక్తంగా నిరసనలు, ర్యాలీలతో హోరెత్తిస్తున్నాయి.

మాటల్లోనే ప్రజాస్వామ్యం: ఖర్గే

రాజ్యాంగం, న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తామంతా పోరాడుతున్నామని ఖర్గే ప్రకటించారు. మోదీ సర్కారు ప్రవచిస్తున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి మాటలకే పరిమితమవుతోందని మండిపడ్డారు. ''అదానీ అవినీతిపై బదులివ్వాల్సి వస్తుందనే భయంతో బడ్జెట్ సమావేశాలు తుడిచిపెట్టుకుపోవాలని బీజేపీ ఆశించింది. అందుకు విపక్షాలను బాధ్యులను చేయజూడటం దారుణం. రూ.50 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌ను కేవలం 12 నిమిషాల చర్చతో ఆమోదించడమా? సభల్లో ఎన్నిసార్లు నోటీసులిచ్చినా విపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు. ఇలా జరగడం నా 52 ఏళ్ల ప్రజా జీవితంలో తొలిసారి. 19 విపక్షాల్లో 18 పార్టీలు అదానీ అంశంపై కేంద్రాన్ని నిలదీశాయి. ఆయన సంపద కేవలం రెండున్నరేళ్లలో రూ.12 లక్షల కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని పట్టుబట్టాయి. సభలో బీజేపీదే పూర్తి మెజారిటీ. జేపీసీ వేసినా ఎక్కువ మంది వాళ్లే ఉంటారు. అయినా విచారణకు వెనకాడుతున్నారంటే దాల్ మే కుచ్ కాలా హై'' అన్నారు. అదానీతో మోదీకి, బీజేపీకి అక్రమ బంధం ఉందని ఆరోపించారు. ''రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడగానే వాయువేగంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు. కానీ బీజేపీ అమ్రేలీ ఎంపీకి మూడేళ్ల జైలు శిక్ష పడి 16 రోజులైనా ఆయనపై వేటు వేయలేదు'' అని మండిపడ్డారు.



పార్లమెంట్ నుంచి విజయ్‌చౌక్ దాకా విపక్ష ఎంపీల ర్యాలీ. (ఇన్‌సెట్లో) విపక్ష నేతల ప్రెస్‌మీట్

> విపక్షాలన్నీ విభేదాలను పక్కన పెట్టి ఒక్కతాటిపైకి వస్తున్నాయి. మా ఐక్యతను ఇప్పుడు దేశమంతా చూస్తోంది. మేం నానాటికీ బలపడుతున్నాం. మమ్మల్ని విడదీసేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీన్నెలా ముందుకు తీసుకెళ్లాలో అంతా కలిసి నిర్ణయించుకుంటాం. విపక్ష కూటమికి ఎవరు నాయకత్వం వహించాలన్నది ప్రశ్న కాదు - కె.కేశవరావు, బీఆర్ఎస్

> కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినా ఊరుకుంటామేమో గానీ అదానీపై నిలదీస్తే మాత్రం సహించబోమని బీజేపీ తన ప్రవర్తనతో రుజువు చేసింది. - సంజయ్‌సింగ్, ఆప్

> భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంతో రాహుల్‌గాంధీని చూసి బీజేపీ భయపడుతోంది. అధికార పక్ష సభ్యులు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడాన్ని తొలిసారిగా చూశాం - టి.ఆర్.బాలు, డీఎంకే

కెనడాలో ఆలయం వద్ద విద్వేష ఘటన

టొరొంటో: హిందూ వ్యతిరేక శక్తులు కెనడాలో మరోసారి దుశ్చర్యకు పాల్పడ్డాయి. ఒంటారియో ప్రావిన్స్‌లోని విండ్సర్ నగరంలోని బాప్స్ స్వామినారాయణ ఆలయ గోడపై భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా రాతలు రాశారు. ఇందుకు పాల్పడ్డవారి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. దీన్ని ఒట్టావాలోని భారత హైకమిషన్ తీవ్రంగా ఖండించింది. జనవరిలో సైతం కెనడాలో ఇలాంటి ఘటనే జరిగింది. ఒంటారియో ప్రావిన్స్‌లోని బ్రాంప్టన్ నగరంలోని గౌరీశంకర్ ఆలయంపై భారత వ్యతిరేక రాతలు రాశారు. గతేడాది సైతం కెనడాలో ఇలాంటి మూడు ఘటనలు జరిగాయి. కెనడా గణాంకాల ప్రకారం 2019–2021 మధ్య మత, లింగ, జాతివిద్వేష నేరాలు 72 శాతం పెరిగాయి. కెనడా జనాభాలో 4 శాతమున్న భారతీయుల్లో ఇవి అభద్రతను పెంచుతున్నాయి. ఈ శక్తులకు అడ్డుకట్టవేయాలని కెనడా సర్కార్‌ను భారత్ కోరింది.

ఐరాస స్టాటిస్టికల్ కమిషన్‌కు భారత్ ఎన్నిక

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితి అత్యున్నత గణాంకాల విభాగం యూఎన్ స్టాటిస్టికల్ కమిషన్‌కు రెండు దశాబ్దాల తర్వాత భారత్ ఎన్నికైంది. రహస్య బ్యాలెట్ ఓటింగ్‌లో జరిగిన హోరాహోరీ పోరులో నెగ్గింది. యూఎన్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ భారత్ యూఎన్ స్టాటిస్టికల్ కమిషన్ మెంబర్‌గా, నార్కోటిక్ డ్రగ్స్ కమిషన్‌గా, ప్రోగ్రామ్ కో ఆర్డినేటింగ్ బోర్డ్ ఆఫ్ జాయింట్ యూఎన్ ప్రోగ్రామ్ ఆన్ ఎయిడ్స్‌గా ఎన్నికైంది.

'ఆక్స్‌ఫాం'పై దర్యాప్తుకు కేంద్రం సిఫార్సు

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) చట్ట ఉల్లంఘన ఆరోపణలపై ఆక్స్‌ఫాం ఇండియా సంస్థపై సీబీఐ దర్యాప్తుకు కేంద్ర హోం శాఖ సిఫార్సు చేసినట్టు సమాచారం. ఈ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు ఎదుర్కోనున్న రెండో స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫాం. అమన్ బిరదారీ అనే సంస్థపైనా సీబీఐ దర్యాప్తుకు హోం శాఖ గత నెల సిఫార్సు చేయడం తెలిసిందే. పలు సంస్థలు, ఇతర ఎన్జీవోలకు విదేశీ 'సాయాన్ని' ఆక్స్‌ఫాం బదిలీ చేసినట్టు హోం శాఖ గుర్తించింది. అమన్ బిరదారీకీ కొంత మొత్తం పంపిందని సమాచారం.ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ ఉన్న సంస్థలకు నిధుల బదిలీ, కన్సల్టెన్సీ మార్గంలో తరలింపుకు పాల్పడిందని ఐటీ సర్వేలో తేలింది.

సీటు కిందే నాగుపాము..

పైలట్ ఏం చేశాడంటే..!

జోహన్నెస్‌బర్గ్: 11 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానంలో పైలట్‌కు తన సీటు కింద అతి విష పూరితమైన కేప్ కోబ్రా కనిపిస్తే? దక్షిణాఫ్రికాకు చెందిన రుడాల్ఫ్ ఎరాస్మస్ అనే పైలట్‌కు ఇదే అనుభవం ఎదురైంది! అయినా సరే, అంతటి ప్రతికూల పరిస్థితిలోనూ తాను ఏమాత్రం గాభరా చెందకుండా, ప్రయాణికులనూ కంగారు పెట్టకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశాడు!! దాంతో అనుభవశాలులైన పైలట్లు సైతం ఆయనను హీరో అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన సోమవారం జరిగింది. నలుగురు ప్రయాణికులతో కూడిన చిన్న విమానం దక్షిణాఫ్రికాలో వోర్సెస్టర్ నుంచి నెల్స్‌ప్రూయిట్‌కు బయల్దేరింది. కాసేపటికే తనకెదురైన భయానక అనుభవాన్ని ఓ వెబ్‌సైట్‌తో ఇరాస్మస్ పంచుకున్నారు. ''నా సీటు దగ్గరే కాలి వెనుక ఎప్పుడూ వాటర్ బాటిల్ పెట్టుకుంటా. అప్పుడప్పుడూ అది నా కాలికి చల్లగా తాకుతూ ఉంటుంది. బయల్దేరిన కాసేపటికి సీటు కింద చూస్తే బాటిల్ వెనుకే నాగుపాము కనిపించడంతో షాకయ్యా'' అన్నారు. నిజానికి ఆ పాము ముందు రోజు సాయంత్రమే సిబ్బందికి విమానం రెక్క కింద కన్పించిందట. పట్టుకునేందుకు ప్రయత్నిస్తే ఇంజన్లోకి దూరింది. ఎంత వెదికినా కనిపించకపోవడంతో వెళ్లిపోయి ఉంటుందని భావించారట. ''నా సీటు కింద పాముందని ప్రయాణికులకు చెప్పాలా వద్దా అని ఒక్క క్షణం ఆలోచించా. వాళ్లను గాభరా పెట్టకుండా మెల్లిగా విషయం వివరించా. వెంటనే కంట్రోల్ టవర్‌కు సమాచారమిచ్చా. అత్యవసరంగా విమానాన్ని లాండ్ చేశా. నలుగురు ప్రయాణికులూ దిగాకే నా సీటును వదిలిపెట్టా. అప్పటికి పాము నా సీటు కింది భాగాన్ని చుట్టేసుకుని ఉంది'' అని ఇరాస్మస్ వివరించారు. అయితే ఆ తర్వాత ఎంత వెదికినా పాము దొరక్కపోవడం విశేషం!



అక్రమార్జనపై పోరు

బంధుప్రీతిరహిత భారత్‌ను సాధిస్తాం ● బీజేపీ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాని

న్యూఢిల్లీ: అవినీతి, బంధుప్రీతి, శాంతిభద్రతల సవాళ్లను రూపుమాపేందుకు బీజేపీ కంకణబద్ధమై అవిశ్రాంతంగా కృషిచేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. గురువారం బీజేపీ 44వ వ్యవస్థాపక దినోత్సవం(స్థాపనా దివస్) సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించినప్పటికీ మూడోసారీ మనదే విజయం అనే సంతృప్తి భావన మీలో రానివ్వకండి. మనం గెలవాల్సింది 2024 సార్వత్రిక ఎన్నికలను మాత్రమే కాదు. ప్రతి ఒక్క భారతీయుడి హృదయాన్ని గెల్చుకోవాలి' అని పార్టీ నేతలు, కార్యకర్తలను సున్నితంగా హెచ్చరించారు. 'బంధుప్రీతి, వంశపాలన, కుల, ప్రాంతీయతత్వంతో కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు మునిగిపోయాయి. ఇప్పుడు వాటి అవినీతి బయటపడుతుండటంతో రాజకీయ అస్తిత్వం కోసం తిప్పలుపడుతున్నాయి. అందుకే బీజేపీపై ఎన్నో అపవాదులు మోపాయి. ఇంకెన్నో కుట్రలు పన్నాయి. కుతంత్రాలను తట్టుకుని బీజేపీ సమున్నతంగా నిల్చుంది. అందుకే బీజేపీ పేరు ఎత్తితేనే ఆ పార్టీలు అసహనంతో, విద్వేషంతో రగిలిపోతున్నాయి' అని విపక్ష పార్టీలను విమర్శించారు. ప్రధాని ప్రసంగాన్ని బీజేపీ దాదాపు 10 లక్షల ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారంచేసింది. మోదీ ఏమన్నారంటే...

- 'మోదీ సమాధికి గొయ్యి తీస్తాం' అని మాట్లాడుతున్నారు. కానీ పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, దళితులు, మహిళలు కమలానికి రక్షణగా నిల్చున్నారు. అందుకే కమలం (బీజేపీ పార్టీ) మరింత వికసిస్తోంది.
- రాజరిక మనస్తత్వంతో ఉన్న కొందరు.. పేదలను ఇన్నాళ్లూ తమ బానిసలుగా భావించారు. కానీ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక పేదలకు సాధికారత కల్పించింది. అందరినీ కలుపుకుని ముందుకుపోదాం అనే సంస్కృతిని బీజేపీనే తెచ్చింది.
- ఎన్నికల్లో గెలుపుతోనే మనం ఆగిపోకూడదు. కోట్లాది మంది ప్రజల మనసుల్ని గెలవాలి. ప్రతి ఎన్నికను మనం చెమటోడ్చి గెల్చుకుందాం. జనసంఘ్ కాలం నాటి మన శ్రమస్ఫూర్తిని నిరంతరం కొనసాగిద్దాం
- నిస్వార్థ సేవకు హనుమానే బీజేపీకి ఆదర్శం. అవినీతి, బంధుప్రీతిని ఆత్మబలంతో పారదోలుదాం.
- విపక్షాలు చిన్న లక్ష్యాలతోనే సరిపెట్టుకుంటున్నాయి. బీజేపీ పెద్ద లక్ష్యాలను సంకల్పించి అతిపెద్ద విజయాలను సాధిస్తోంది
- జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 అనేది చరిత్రలో కలిసిపోతుందని విపక్షాలు ఏనాడూ ఊహించి ఉండవు. కశ్మీర్‌లో ఇటు శాంతి స్థాపన, అటు అభివృద్ధిని బీజేపీ సుసాధ్యం చేయడాన్ని విపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి.



బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండా ఎగరేస్తున్న అధ్యక్షుడు నడ్డా. (ఇన్‌సెట్లో) ప్రసంగిస్తున్న మోదీ

2 నుంచి 303 దాకా..

43 ఏళ్ల బీజేపీ ప్రస్థానం

సరిగ్గా 43 ఏళ్ల క్రితం, అంటే 1980 ఏప్రిల్ 6న పురుడు పోసుకున్న బీజేపీ 1984 సార్వత్రిక ఎన్నికల్లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలతో పార్లమెంటరీ ప్రస్థానం ప్రారంభించింది. 2019 కల్లా 303 సీట్లకు ఎదగడమే గాక వరుసగా మూడోసారి అధికార పీఠం చేజిక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతోంది. అటల్ బిహారీ వాజ్‌పేయి, తర్వాత అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి దిగ్గజాలు పార్టీకి సారథ్యం వహించారు. 1989 ఎన్నికల్లో 2 నుంచి 85 సీట్లకు ఎగబాకింది. తర్వాత 2004, 2009 మినహా ప్రతి ఎన్నికల్లోనూ సీట్ల సంఖ్యను పెంచుకుంటూ వచ్చింది. మోదీ మ్యాజిక్‌తో 2014లో సొంత మెజారిటీతో అధికారంలోకి వచ్చింది.

సంవత్సరం	గెల్చిన సీట్లు
1984	2
1989	85
1991	120
1996	161
1998	182
1999	182
2004	138
2009	116
2014	282
2019	303

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023

కరోనా బాధితుల ఇళ్లకు స్టిక్కర్లు

సాక్షి,చెన్నై: రాజధాని నగరం చెన్నైలో ఇకపై కరోనా బారిన పడ్డ వారి ఇళ్లకు ప్రత్యేక స్టిక్కర్లు అంటించాలని కార్పొరేషన్ వర్గాలు నిర్ణయించారు. చెన్నైలో మళ్లీ కరోనా కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్న విషయం తెలిసిందే. వైరస్ బారిన పడ్డ వారి స్వీయ నిర్బంధంలో ఉండకుండా జన సంచారం ఉండే ప్రాంతాలలోకి వస్తుండడం వెలుగు చూసింది. ఆ కుటుంబాలకు చెందిన వారు సైతం యథేచ్ఛగా బయట తిరుగుతుండటం, కరోనా జాగ్రత్తలు పాటించక పోవడంతో కార్పొరేషన్ వర్గాలు కన్నెర్ర చేయడానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా ఇకపై కరోనా బాధితుల ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. ఈ స్టిక్కర్లు ఉన్న ఇళ్లలోని వారు బయట ఇష్టానుసారంగా తిరిగినా, తగిన జాగ్రత్తలు పాటించకున్నా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

యూట్యూబర్‌పై జాతీయ భద్రతా చట్టం ప్రయోగం



పోలీసులు అరెస్టు చేసిన యూట్యూబర్ మనీష్ కశ్యప్ టీకే తివారి

సాక్షి, చెన్నై: బిహార్ యూ ట్యూబర్‌పై జాతీయ భద్రతా చట్టాన్ని తమిళ పోలీసులు గురువారం ప్రయోగించారు. గత నెల తమిళనాడులో ఉత్తరాది వలస కార్మికుల్లో భయాందోళన కలిగించే విధంగా కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. వలస కార్మికులపై తమిళులు దాడులు చేస్తున్నట్లుగా ఉన్న ఆ వీడియోలతో బిహార్, జార్కండ్ ప్రభుత్వాలు తమ ప్రతినిధులను తమిళనాడుకు పంపించి విచారణ చేపట్టాయి. దర్యాప్తులో ఇవన్నీ ఫేక్ వీడియోలుగా తేలాయి. దీంతో బిహార్ పోలీసుల విచారణలో ఆ రాష్ట్రానికి చెందిన యూ ట్యూబర్ మనీష్ కశ్యప్ టికే తివారి (32)ను కుట్రదారుగా తేల్చారు. అతడిని అరెస్టు చేసి తమిళ పోలీసులకు అప్పగించారు. ఇక్కడి కోర్టులో హాజరు పరిచినానంతరం మదురై కేంద్ర కారాగారానికి తివారిని రిమాండ్‌కు తరలించారు. ఈ పరిస్థితులలో ఇతడిపై జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగిస్తూ తమిళనాడు పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. ఆ చట్టం కింద మరోమారు అరెస్టు చేశారు. ఫలితంగా ఏడాది కాలం ఇతడికి బెయిల్ మంజూరు కాదని అధికారులు వెల్లడించారు.

ఈవీకేఎస్ డిశ్చార్జ్



ఆస్పత్రి నుంచి బయటకు వస్తున్న ఈవీకేఎస్ ఇలంగోవన్

సాక్షి, చెన్నై : ఈరోడ్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇలంగోవన్ అనారోగ్యం నుంచి కోలుకున్నారు. ఆయన్ని గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. గత నెల 15వ తేదీన గుండె పోటు రావడంతో ఈవీకేఎస్‌ను పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. అయనకు కరోనా నిర్ధారణ కావడం, తీవ్ర శ్వాస సమస్యతో ఐసీయూలో చేరడంతో టెన్షన్ తప్పలేదు. రెండుసార్లు ఆయనకు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఎట్టకేలకు ప్రస్తుతం ఆయన సంపూర్ణ ఆరోగ్య వంతులయ్యారు. దీంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. కాంగ్రెస్ వర్గాలు, ఈవీకేఎస్ మద్దతుదారులు ఆనందం వ్యక్తం చేశారు.

రూ. 6 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: ధనుష్కోటి సముద్ర మార్గం ద్వారా శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్న రూ. 6 కోట్ల విలువైన గంజాయిని శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకుంది. ఈ అంశంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తోంది. వివరాలు.. రామనాథపురం జిల్లా ధనుష్కోటి తీరం నుంచి శ్రీలంకకు మత్తు పదార్థాలు తరలిస్తున్నట్లుగా శ్రీలంక నావిక దళానికి రహస్య సమాచారం అందింది. దీంతో వారు బుధవారం తలైమన్నారు సముద్ర సరిహద్దులో సందేహాస్పదంగా నిలబడి ఉన్న ఓ పడవను తనిఖీ చేశారు. అందులోని 98 కిలోల గంజాయి, చమురు, ముడిపదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పడవలో వున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారిని తలైమన్నార్ సముద్ర తీరం శిబిరానికి తరలించారు. పోలీసుల విచారణలో నిందితులు రామనాథపురం జిల్లా వేతాలైకి చెందిన పుర్హాన్ (48), రహమాన్ అలీ (42), గజిని మహమ్మద్ (36)గా తేలింది. వారు గంజాయి తయారీకి కావలసిన ముడి పదార్థాలను వేతాలై నుంచి పడవలో ఎక్కించుకుని శ్రీలంక తీరానికి వెళ్తున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 6 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

ఫిక్కీ జాతీయ అధ్యక్షురాలిగా సుధా శివకుమార్



సుధా శివకుమార్

కొరుక్కుపేట: ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) జాతీయ అధ్యక్షురాలిగా చెన్నైకు చెందిన సుధా శివకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ 40వ అధ్యక్షురాలిగా ఆమె నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారతను సాధించే దిశగా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన సుధా శివకుమార్ మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్లంలో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేసి, అండర్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచారు.

టెర్మినల్.. జిగేల్!

మీనంబాక్కం విమానాశ్రయంలో అత్యద్భుత రీతులో టెర్మినల్ ఏర్పాటైంది. అంతర్జాతీయ హంగులతో రూపుదిద్దుకున్న ఈ టెర్మినల్‌లో ప్రయాణికులకు ప్రత్యేక వసతులు కల్పించారు. దీనిని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇంద్ర భవనాన్ని తలపిస్తున్న ఇక్కడి నిర్మాణాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

- 1,260 కోట్ల వ్యయంతో తమిళ సంస్కృతిని చాటేలా ఏర్పాట్లు
- చెన్నై విమానాశ్రయానికి సరికొత్త హంగులు
- రేపు కొత్త టెర్మినల్‌ను ప్రారంభించనున్న ప్రధాని మోదీ



విద్యుత్ దీపాల వెలుగులో కారిడార్

సాక్షి, చెన్నై: రాజధాని నగరంలోని మీనంబాక్కం విమానాశ్రయం నుంచి స్వదేశంతో పాటు వివిధ దేశాల్లోని ప్రధాన నగరాలకు విమానాల సేవలు అందుతున్న విషయం తెలిసిందే. ఏడాదికి సగటున 23 మిలియన్ల ప్రయాణికులు ఈ విమానాశ్రయ సేవలను వినియోగించుకుంటున్నారు. గతంలో ఇక్కడ స్వదేశీ టెర్మినల్, అంతర్జాతీయ టెర్మినల్స్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం ఇక్కడ విమానాల కార్గో(సరకుల) రవాణా పెరగడం, ప్రయాణీకుల సంఖ్య మరింతగా పెరుగుతుండటం, విమానాల సంఖ్య, సేవలు క్రమంగా విస్తరిస్తుండడంతో కొత్త టెర్మినల్ ఏర్పాటు తప్పనిసరిగా మారింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖ భారీ నిర్మాణాలపై దృష్టి సారించింది.

కళ్లు మిరిమిట్లు గొలిపేలా..

మొదటి దశలో భాగంగా ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ -2ను సరికొత్త హంగులతో 1,36,295 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేశారు. రూ. 1,260 కోట్లతో ఈ పనులు పూర్తి చేశారు. ఈ టెర్మినల్ ను తమిళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా తీర్చిదిద్దారు. దక్షిణ భారత దేశ ఆలయాలు, ఇతర పురాతనను స్థలాలను చాటే విధంగా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. కంబైన్డ్ విమానాశ్రయ టెర్మినల్ పనులు అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఈ కొత్త టెర్మినల్ ఐదు అంతస్తులతో రూపుదిద్దుకుంది. ఒక్కో అంతస్తులో ఒక్కో విధమైన ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగ్‌లు, ఇతర వస్తువుల తరలింపు, బోర్డింగ్, చెకింగ్‌పాయింట్, విశ్రాంతి గదులు అంటూ విశాలమైన నిర్మాణాలు అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దారు. ఐదో అంతస్తును పూర్తిగా విమాన సంస్థలకు కేటాయించారు. ఇక్కడే వారి కార్యాలయాలు, వారికి సంబంధించిన వ్యవహారాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఈవిమానాశ్రయంలోని కొన్ని నిర్మాణాలు, చిత్రాలను గురువారం మీడియాకు అధికారులు విడుదల చేశారు. ఈ టెర్మినల్‌ను శనివారం చెన్నై పల్లావరం ఆర్మీ మైదానం వేదికగా జరిగే సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేస్తారు. ఇంద్ర భవనాన్ని తలపించే విధంగా ఉన్న ఇక్కడి ఏర్పాట్లు ప్రయాణికులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

భద్రత కట్టుదిట్టం..



టెర్మినల్ ముఖ ద్వారం

ప్రధాని రాకతో విమానాశ్రయ పరిసరాలను పూర్తిగా నిఘా వలయంలోకి తెచ్చారు. రన్ వే మొదలు, స్వదేశీ, అంతర్జాతీయ టెర్మినల్స్, తాజాగా నిర్మించిన కొత్త టెర్మినల్స్ పరిసరాలను పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఎస్పీజీ వర్గాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. విమానాశ్రయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడమే కాదు, విద్యుత్ దీప కాంతులతో ఎయిర్‌పోర్ట్ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. డీజీపీ శైలేంద్ర బాబు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించే ప్రాంతాల్లో గురువారం భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. ప్రధాని పర్యటన కోసం 20 వేల మంది పోలీసులు విధుల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.



లాన్



ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు



శోభాయమానంగా ప్రత్యేక హాల్



తమిళ సంస్కృతిని చాటే చిత్రాలు



ఆకర్షణీయ హంగులతో లగేజీ తరలింపునకు ఏర్పాట్లు

తీర్థవారి విషాదంపై అసెంబ్లీలో చర్చ

- పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామన్న దేవదాయశాఖ మంత్రి శేఖర్ బాబు
- బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నాడీఎంకే పట్టు



అసెంబ్లీ భవనం

సాక్షి, చెన్నై: మండిపాక్కం సమీపంలోని మువరసంపట్టు ధర్మలింగేశ్వర ఆలయం పంగుణి ఉత్సవాల్లో నెలకొన్న విషాదంపై గురువారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖమంత్రి శేఖర్ బాబు సభకు హామీ ఇచ్చారు. వివరాలు.. మువరసం పట్టులోని ధర్మలింగేశ్వర ఆలయంలో బుధవారం జరిగిన తీర్థవారి కార్యక్రమంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఐదుగురు అర్చకులు మరణించారు. ఎలాంటి ముందస్తు భద్రతా చర్యలు చేపట్టకుండా ఈ ఆలయంలో ఉత్సవాల నిర్వహణపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఆలయం ప్రైవేటు వ్యక్తులు, గ్రామం గుప్పెట్లో ఉండడంతో విచారణను వేగవంతం చేశారు. ఆలయ సమీపంలోని కొలనులోకి ఎవ్వరూ వెళ్లకుండా మూసి వేశారు. ఆలయంలోకి భక్తులకు అనుమతి లేకుండా రద్దు చేశారు. ఉత్సవాలను నిలుపుదల చేశారు. తెప్పోత్సవాలను రద్దు చేశారు. ఈ పరిస్థితుల్లో గురువారం ఈ వ్యవహారం అసెంబ్లీని తాకింది. అన్నాడీఎంకే సభ్యులు చర్చకు పట్టుబట్టారు. దేవదాయ శాఖ, పోలీసుల నిర్లక్ష్యానికి ఐదు ప్రాణాలు బలయ్యారని ధ్వజమెత్తారు. బాధిత కుటుంబాలకు తలా రూ. 10 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్ష నేత పళనిస్వామి డిమాండ్ చేశారు. ఇందుకు మంత్రి శేఖర్‌బాబు సమాధానం ఇస్తూ, ఇది దురదృష్టకర ఘటనగా పేర్కొన్నారు. ఎలాంటి ముందస్తు అనమతి తీసుకోకుండా నిర్వాహకులు ఉత్సవాలను నిర్వహించారని గుర్తుచేశారు. ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ప్రైవేటు వ్యక్తుల గుప్పెట్లో ఉన్న ఆలయాలలో ఉత్సాహాల నిర్వహణకు సంబంధించి కఠిన నిబంధనలు అమల్లోకి తెస్తామని ప్రకటించారు. అలాగే మృతులకు సభలో సంతాపం తెలియజేశారు.

తిరుచ్చిలో టైడల్ పార్క్

అసెంబ్లీలో తమిళాభివృద్ధి శాఖ, ఖాదీ, చిన్న తరహా పరిశ్రమలకు నిధుల కేటాయింపులపై మంత్రులు తంగం తెన్నరసు, అన్బరసన్‌లు ప్రసంగించారు. తిరుచ్చిలో టైడల్ పార్కు ఏర్పాటు చేయనున్నామని మంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు. ఇందు కోసం రూ. 600 కోట్లు కేటాయించామన్నారు. ఇక సభలో ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యురాలు వానతీ శ్రీనివాసన్ మాట్లాడుతూ, డెల్టాలో కోల్ తవ్వకాల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం దాగుడు మూతలు ఆడుతోందని, వాస్తవాలను కప్పిపుచ్చినట్టు ధ్వజమెత్తారు. ఇక, మంత్రి నెహ్రూ మాట్లాడుతూ, టీ నగర్‌లో వర్షాల కాలంలో నీరు నిల్వ ఉండ కుండా ప్రత్యేక చర్యలతో పాటు భూగర్భ డ్రైనేజీ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించన్నట్లు ప్రకటించారు. ఇక అన్నాడీఎంకే సభ్యుడు తంగమణి తన ప్రసంగంలో కేన్సర్ రోగుల గురించి ప్రస్తావిస్తూ, తన కుటుంబంలో జరిగిన ఘటనను గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. కాగా, సభలో తమిళర్ వాల్వురిమై కట్చి ఎమ్మెల్యే వేల్ మురుగన్ ప్రతి అంశంపై తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని లేచి లేచి నిలబడటంతో స్పీకర్ అప్పావు మందలించారు.

• దివిటీలతో అమ్మవారికి మొక్కులు



ఈరోడ్ సమీపంలోని ప్రసిద్ధ పాన్ కాళియమ్మన్ ఉత్సవాల సందర్భంగా, వేలాది మంది భక్తులు తమ చేతుల్లో దివిటీలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈరోడ్ జిల్లాలోని శివగిరి సమీపంలోని తలయనల్లూరులో ప్రసిద్ధ పాన్ కాళియమ్మన్ ఆలయం ఉంది. ఇందులో వార్షిక ఉత్సవాలు గత నెల 28వ తేదీన విశేష పూజలతో ప్రారంభమయ్యాయి. నాటి నుంచి రోజూ అమ్మవారికి అభిషేకం, పూజలు కూడా నిర్వహించారు. బుధవారం భక్తులు పొంగళ్లు పెట్టి, పిండి దీపం పెట్టి పూజలు చేశారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన దివిటీల మొక్కు బుధవారం అర్ధరాత్రి జరిగింది. వేల సంఖ్యలో భక్తులు చేతుల్లో దివిటీలతో తరలివచ్చి ఆలయ వీధుల్లో తిరిగి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ఈరోడ్, నమక్కల్, కరూర్, తిరుపూర్, కోయంబత్తూరు, సేలం సహా పలు జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. – సేలం

సముద్రంలో అలజడి..

- తమిళ మత్స్యకారులపై శ్రీలంక బలగాల కాల్పులు
- ఆరుగురికి గాయాలు

కొరుక్కుపేట: తమిళ జాలర్లపై మరోసారి శ్రీలంకా సేనలు విరుచుకు పడ్డాయి. వివరాలు.. కారైకల్ జిల్లా క్లించల్మేడు మత్స్యకార గ్రామానికి చెందిన చెల్లదురైతో పాటు, 12 మంది మత్స్యకారులు తన సొంత పడవలో చేపల వేటకు వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి కొడియకరైకు ఆగ్నేయంగా హిందూ మహాసముద్రంలో చేపలు పట్టారు. అక్కడికి వచ్చిన శ్రీలంక సేనలు కారైకల్ మత్స్యకారులపై కాల్పులకు పాల్పడ్డారు. ఆ తర్వాత రూ. 5లక్షలు విలువైన వల వేసిన వస్తువులను ఎత్తుకెళ్లారు. శ్రీలంక నేవీ సిబ్బంది దాడిలో నివాష్, కార్తీక్, మెదిత్ , శివగురు, అజిత్ అనే ఐదుగురు మత్స్యకారులు గాయపడ్డారు. దీంతో మత్స్యకారులు ఇండియన్ కోస్ట్ గార్డుకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న భారత తీర రక్షణదళం మత్స్యకారులకు ప్రథమ చికిత్స అందించి కారైకల్ పోర్టుకు తీసుకుని వచ్చారు. బాధిత మత్స్యకారులు మాట్లాడుతూ చేపల వేట సమయంలో శ్రీలంక నావికాదళం కాల్పులు జరపడంతో బోటును ఆపివేశామని, అయితే శ్రీలంక నేవీ సిబ్బంది కాల్పులు జరపడమే కాకుండా ఇనుపరాడ్లతో దాడి చేసి వల, ఇతర వస్తువులు పట్టుకెళ్లిపోయారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి కోరారు.

కళాక్షేత్రలో ఆరోపణల వెనుక అదృశ్య శక్తులు



మాట్లాడుతున్న నటి అభిరామి

సాక్షి, చెన్నై : కళాక్షేత్రలో లైంగిక వేధింపుల ఆరోపణల వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయని, ఈ వ్యవహారంపై పెద్ద డ్రామా జరుగుతోందని పూర్వ విద్యార్థి, సినీ నటి అభిరామి వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని కోరుతూ చెన్నై పోలీసు కమిషనర్ శంకర్ జివ్వాల్ కార్యాలయంలో ఆమె గురువారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థులను రెచ్చగొట్టి తెర వెనుక నుంచి ఎవరో రాజకీయం చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. కళాక్షేత్ర వ్యవహారంలో జరుగుతున్నది ఇదేనని ఆరోపించారు. ఇక, ఈ కేసులో అరెస్టయిన హరిపద్మన్ సతీమణి మీడియాతో మాట్లాడుతూ, తన భర్త ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఆయన ప్రత్యేకంగా క్లాస్ కూడా తీసుకోరని, ఆయన పని ముగియగానే కళాక్షేత్ర ఆవరణలో క్వార్టర్స్ ఇంటికి వచ్చేస్తారని వివరించారు. ఈ కేసులో ఆయన్ని బలి పశువు చేశారని, తన పిల్లల జీవితాలను సర్వ నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినట్టుగా పేర్కొంటున్న పూర్వ విద్యార్థినిని గతంలో తన భర్త ఓ విషయంగా మందలించారని, ఆ తర్వాత ఆ విద్యార్థిని అందరితో కలిసి ఆనందగానే ఉంటోందని, ప్రస్తుతం ఎందుకు ఇలా చేసిందో ఆమె విజ్ఞతకే వదిలి పెడుతున్నామని అన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్ర విచారణ చేయాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

హైకోర్టు న్యాయమూర్తిగా దేవరాజ్ నాగార్జున్



ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ దేవరాజ్ నాగార్జున్

సాక్షి, చెన్నై : మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా దేవరాజ్ నాగార్జున్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి రాజ ప్రమాణ స్వీకారం చేయించారు. హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి చర్యలు విస్తృతం చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ వచ్చిన దేవరాజ్ నాగార్జున్‌ను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో గురువారం హైకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. కాగా కొత్త న్యాయమూర్తికి సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 60కు చేరింది.

ప్రజల్ని రెచ్చగొట్టి స్టెరిలైట్‌కు తాళం

- గవర్నర్ వ్యాఖ్యలపై వివాదం



గవర్నర్ ఆర్ఎన్ రవి

సాక్షి, చెన్నై: ప్రజల్ని రెచ్చగొట్టి మరీ తూత్తుకుడిలో స్టెరిలైట్‌కు తాళం వేయించారని గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. గురువారం విద్యార్థులతో కలిసి 'ఆలోచించు.. ధైర్యంగా అడుగులు వేయ్' పేరిట నిర్వహించిన సదస్సులో గవర్నర్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. పాపులర్ ఫ్రంట్ ఆఫ్‌ఇండియా ప్రజల్ని రెచ్చగొడుతోందని ధ్వజమెత్తారు. ఈ విధంగా ప్రజల్ని రెచ్చగొట్టి తూత్తుకుడిలో స్టెరిలైట్‌కు తాళం వేయించారని మండిపడ్డారు. విదేశీ నిధులు దేశంలో రప్పించి సంఘ విద్రోహ శక్తులు చేసిన కుట్రలను భగ్నం చేశామన్నారు. అలాగే రాజ్ భవన్‌కు వచ్చిన నివేదిక, ముసాయిదా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే, అది తిరస్కరించినట్లు భావించాలని వెల్లడించారు.

ఏఆర్‌టీ గ్రూప్‌లో సోదాలు

సాక్షి, చెన్నై : ఏఆర్‌టీ గ్రూప్‌లో ఆర్థిక నేర విభాగం పోలీసులు గురువారం సోదాలు నిర్వహించారు. అన్నానగర్, నొలంబూరు కేంద్రంగా ఏఆర్‌టీ గ్రూప్ పేరిట బంగారు షోరూమ్, మాల్స్, మరికొన్ని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ నిర్వాహకుడిగా ఆల్విన్ జ్ఞాన దురై ఉన్నారు. ఇటీవల ఈ సంస్థ పెట్టుబడులకు అధిక వడ్డీ ఇస్తామంటూ ప్రకటించింది. దీనికి ఆకర్షితులైన వారు రూ. 5 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టారు. రూ.లక్షకు వారానికి రూ. 3 వేలు వడ్డీ ఇస్తామనే ప్రకటనను నమ్మి మోసపోయిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో నొలంబూరు పోలీసులు సంస్థ నిర్వాహకుడు ఆల్విన్‌జ్ఞాన దురై, సిబ్బంది రాబర్ట్, ప్రియ, వీమా, సమీర్, జవహర్‌పై కేసు నమోదు చేశారు. ఇందులో ప్రియను పోలీసులు అరెస్టు చేయగా, మిగిలిన వారు అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరి కోసం గాలిస్తూ వస్తున్న నేపథ్యంలో కేసును ఆర్థిక నేర విభాగానికి బదిలీ చేశారు. దీంతో ఆ విభాగం పోలీసు అధికారుల బృంద గురువారం అన్నానగర్, తిరుమంగళం, నొలంబూరు, మొగపేర్‌లోని ఆ సంస్థకు చెందిన షోరూమ్‌లు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు.

క్లుప్తంగా

చెన్నై విమానాశ్రయంలో రూ.95 లక్షల బంగారం సీజ్

అన్నానగర్: చెన్నై విమానాశ్రయంలో అబుదాబి నుంచి గురువారం విద్యుత్ మోటారులో దాచి అక్రమంగా తరలిస్తున్న రూ.95.15 లక్షల విలువైన 1.796 గ్రాముల బంగారాన్ని కస్టమ్స్ శాఖ అధికారులు సీజ్ చేశారు. వివరాలు..చెన్నై విమానాశ్రయానికి గురువారం వేకువజామున అబుదాబి నుంచి వచ్చి విమానంలోని ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో చెన్నైకు చెందిన ఓ 30 ఏళ్ల వ్యక్తి వద్ద ఉన్న విద్యుత్ మోటారును పగులగొట్టి చూడగా అందులో భారీగా అందులో బంగారం ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి పూర్తి వివరాలను తెలియరాలేదు.

పురాతన విల్‌వీరన్ విగ్రహం లభ్యం


లభ్యమైన రాతి విగ్రహం

అన్నానగర్: నత్తం సమీపంలో గురువారం 14వ శతాబ్దానికి చెందిన విల్‌వీరన్ విగ్రహం లభ్యమైంది. దిండుక్కల్ జిల్లా పళణి సమీపంలో నెల్లూరు ప్రభుత్వ కల్లార్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పురాతన వస్తువుల పరిరక్షణ మండలి ఉపాధ్యాయుడు కరుప్పయ్య, దడియూరు నాడు చారిత్రక పరిశోధనా కేంద్రానికి చెందిన మాణిక్యరాజ్, సుబ్బు ఉలగనాథ పాండియన్, రాము మనకటూరు ప్రాంతంలో గురువారం తవ్వకాలు చేపట్టారు. ఆ సమయంలో విల్‌వీరన్ విగ్రహాన్ని గుర్తించి దేవదాయశాఖ అధికారులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో కండక్టర్ మృతి

అన్నానగర్: కోవూరు లక్ష్మీనగర్‌లోని బాబు గార్డెన్స్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రబిన్ (31) చెన్నై వ్యాసర్‌పాడిలోని ట్రాన్స్‌పోర్టు గవర్నమెంట్ వర్క్స్‌లో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతను గురువారం అచ్చరపాక్కం సమీపంలో నివసించే స్నేహితుడి బైకు తీసుకుని పాడూర్ గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రబిన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదురాంతకం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిడ్డను అప్పగించాలని
ఆంధ్ర మహిళ ధర్నా

- బిడ్డను కన్న నెల రోజులకే ఇంటి నుంచి గెంటేశారని ఫిర్యాదు

తిరువళ్లూరు: ప్రసవించిన నెల రోజులకే అత్తింటి వారు బిడ్డను బలవంతంగా లాక్కుని ఇంటి నుంచి గెంటేశారని ఆంధ్రకు చెందిన ఓ వివాహిత తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరు మహిళ పోలీసు స్టేషన్ వద్ద గురువారం ఆందోళనకు దిగడం కలకలం రేపింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం పెద్దకోమటిపేట ప్రాంతానికి చెందిన నాగులు బుజ్జిరామారావు కుమార్తె పద్మజ(38). సాలూరులో డిగ్రీని పూర్తి చేసి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మొదట భర్త నుంచి విడిపోయిన పద్మజ రెండవ వివాహం కోసం మ్యాట్రిమోనీలో తన వివరాలను నమోదు చేసుకున్నారు. పద్మజ వివరాలు తెలుసుకున్న తిరువళ్లూరుకు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడైన సుదర్శనం పద్మజ తల్లిదండ్రులను సంప్రదించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో 2021 జనవరి 25న తిరువళ్లూరులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వీరి వివాహం జరిగింది. వీరికి గత ఏడాది ఏప్రిల్‌లో వీరికి ఓ ఓ కుమారుడు జన్మించాడు.


పద్మజ- సుదర్శనం పెళ్లినాటి ఫొటో


చిన్నారి అచ్యుత్

అయితే పద్మజ ప్రసవించిన నెల రోజులకే పాపను లాక్కుని పుట్టింటికి తరమేశారు. బిడ్డ కోసం తిరువళ్లూరు మహిళా పోలీసులను ఆశ్రయించిన పద్మజ పలుమార్లు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పట్టించుకోకపోవడంతో మహిళ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు చేపట్టింది. తన కుమారుడిని చూడడానికి కూడా అత్తారింటి వారు అనుమతించడం లేదని, ప్రశ్నిస్తే దాడులకు యత్నిస్తున్నారని విలపించింది. తమిళనాడు పోలీసులు న్యాయం చేయడం లేదని వాపోయింది.

కిటకిటలాడిన గిరివలయం రోడ్డు

వేలూరు: పౌర్ణమిని పురస్కరించుకొని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ గిరివలయం రోడ్డులో భక్తుల రద్దీ నెలకొంది. అరుణాచలేశ్వరాలయంలో ప్రతి నెలా పౌర్ణమి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గిరివలయం రోడ్డులో 14 కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా పౌర్ణమి బుధవారం రాత్రి 10.17 నుంచి ప్రారంభమైంది. దీంతో కార్తీక దీపం తరహాలోనే ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లును సిద్ధం చేశారు. అదే విధంగా ఆలయంలోని అన్నామలైయార్ సమేద ఉన్నామలై అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పుష్పాలంకరణ చేపట్టారు. ఇదిలా ఉండగా పౌర్ణమి సమయంలో 14 కిలోమీటరు దూరంలో ఉన్న గిరివలయం రోడ్డులో కాలి నడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుంటే చేసిన పాపాలు పోయి పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. అందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరువణ్ణామలై చేరుకొని స్వామి వారిని దర్శించుకొని మహా కొండకింద కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో తిరువణ్ణామలైలో బుధవారం సాయంత్రం నుంచే గిరివలయం రోడ్డులో ఎటు చూసినా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


పోటో: 52: గిరివలయం రోడ్డులో భక్తుల రద్దీ

మంత్రిపై సోషల్ మీడియాలో పోస్టులు చేసిన వ్యక్తి అరెస్టు


నిందితుడిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

వేలూరు: రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో మంత్రి దురై మురుగన్ ప్రసంగించిన సమయంలో ''నేను చాలా కాలంగా డీఎంకే పార్టీలో పనిచేస్తున్నాను.. తాను మరణించిన తరువాత సమాధిపై డీఎంకే గోపాలపురం విశ్వాసి అని రాసి పెట్టాలి'' అని.. ఆవేశంగా మాట్లాడాడు. మంత్రి దురై మురుగన్ మాట్లాడిన మాటలను ప్రతి పక్ష పార్టీలకు చెందిన వివిధ నాయకులు సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శించింది. అందులో అన్నాడీఎంకే పార్టీకి చెందిన ఐటీ విభాగం ప్రతినిధి పొల్లాచ్చికి చెందిన అరుణ్‌కుమార్ సోషల్ మీడియాలో విమర్శిస్తూ పోస్టల్ చేశాడు. దీంతో కాట్పాడికి చెందిన డీఎంకే ప్రతినిధి వన్నియరాజ కాట్పాడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటిని దర్యాప్తు చేపట్టిన కాట్పాడి పోలీసులు రాత్రికి రాత్రే పోలీసులు పొల్లాచ్చికి వెళ్లి అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కాటాప్డికి తీసుకొచ్చారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

లయోలాతో అవగాహన ఒప్పందం

కొరుక్కుపేట: విద్యారంగంలో పేరుగాంచిన లయోలా ఐకామ్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (లీసెట్)తో చెన్నైకు చెందిన అగర్వాల్ ఆప్టోమెట్రీ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు నగరంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో లీసెట్ డైరెక్టర్ డాక్టర్ సెబాస్టియన్ సూసాయి, డాక్టర్ అగర్వాల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆప్టోమెట్రి డీన్ డాక్టర్ కర్పగం దామోదరన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ మేరకు అగర్వాల్ సంస్థ నాలుగేళ్ల బీఎస్సీ ఆప్టోమెట్రీ కోర్సు, రెండేళ్ల ఎమ్మెస్సీ ఆప్టోమెట్రీ కోర్సులను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశం పొందటానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.


ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న ప్రతినిధులు

పనిచేసే దుకాణంలోనే 50 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: జీతం సక్రమంగా ఇవ్వడం లేదంటూ బంగారు ఆభరణాల వర్క్‌షాపు యజమానులను కట్టేసి బుధవారం రాత్రి 50 సవర్ల నగలు దోచుకెళ్లిన ఓ ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. మరొకరి కోసం వెతుకుతున్నారు. వివరాలు.. చెన్నై పార్క్‌నగర్ రాయప్పశెట్టి వీధిలోని ఓ ఇంటిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సలావుద్దీన్ (26), సాజిద్ (26) బంగారు ఆభరణాల షాపు నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నారు. అదే రాష్ట్రానికి చెందిన సుగంత్‌రాయ్ (27), అజయ్ (23) నాలుగు నెలల క్రితం వీరి వద్ద పనికి చేరారు. వీరు కూడా ఆభరణాల వర్కుషాపుల యజమానులతో కలిసి ఉంటున్నారు. ఈక్రమంలో వీరికి గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో బుధవారం రాత్రి సుగంధ రాయ్, అజయ్ షాపు యజమానులైన సలావుద్దీన్, సాజిత్‌పై దాడి చేశారు. తరువాత కాళ్లు చేతులు కట్టేసి దుకాణంలో ఉన్న 50 సవర్ల నగలను దోచుకున్నారు. నగల గదిలో వున్న గ్యాస్ సిలిండర్‌ను ఓపెన్ చేశారు. భయంలో సలావుద్దీన్, సాజిత్ అరవడంతో గస్తీ కాస్తున్న థౌజండ్‌లైట్స్ పోలీసులు షాపు వద్దకు వెళ్లారు. పోలీసులను చూసి సుగంత్‌రాయ్, అజయ్ పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి సుంగత్ రాయ్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి 50 కిలోల బంగారం, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు థౌజండ్ లైట్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన అజయ్ కోసం గాలిస్తున్నారు.

కుమారుడి మరణవార్త విని..
తుదిశ్వాస విడిచిన తండ్రి

కొరుక్కుపేట: కన్నకొడుకు మరణించాడనే వార్తను తట్టుకోలేక తండ్రి మరణించిన ఘటన పరమక్కుడిలో తీవ్ర విషాదాన్ని నింపింది. రామనాథపురం జిల్లా పరమక్కుడి మంచ్చల్ పట్టినం ప్రాంతానికి చెందిన మురుగేశన్ (63). అతని భార్య భువనేశ్వరి. ఈ దంపతులకు కుమారుడు కార్తీక్ రాజా (34), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బిడ్డలందరికీ వివాహాలై వే ఉంటున్నారు. ఇక రామనాథపురంలో కార్తీక రాజు ద్రౌపది అమ్మన్ ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. అందులో వచ్చే ఆదాయంతో తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. ఇదిలా ఉండగా మురేగేశన్ అనారోగ్య కారణాలతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి ఆసుపత్రి వద్ద తండ్రిని చూసి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి బయలుదేరాడు. మార్గం మధ్యలోని ఒట్టపాలెం ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న రౌంటానా వద్ద ప్రహరీ గోడను కార్తీక్ రాజా బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన దెబ్బ తగిలి కార్తీక్ రాజా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి మురుగేశన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ షాక్‌కు గురై తుదిశ్వాస విడిచాడు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరమక్కుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు మరణవార్త విని తండ్రి ప్రాణాలు కోల్పోయిన ఘటన పరమక్కుడిలో స్థానికంగా తీవ్ర విషాదం నింపింది.


మృతి చెందిన తండ్రి కొడుకులు

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి బాలుడి మృతి

- ముగ్గురు కోచ్‌లు అరెస్టు

అన్నానగర్: చెన్నైలోని పెరియమేడ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో బుధవారం ఏడేళ్ల బాలుడు మునిగి మృతి చెందాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు కోచ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నైలోని కొనపేట హాజి మహ్మద్ అబ్బాస్ వీధికి చెందిన రాకేష్ గుప్తా కుమారుడు తేజ గుప్త (07). వెప్పేరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. 10 రోజుల క్రితం చెన్నైలోని పెరియమేడ్‌లోని మై లేడీ పార్క్ స్విమ్మింగ్ పూల్‌లో రాకేష్‌గుప్త తన కుమారుడిని స్విమ్మింగ్ శిక్షణలో చేర్పించాడు. బాలుడి తాత శశికుమార్ రోజూ బాలుడిని శిక్షణకు తీసుకెళ్లేవాడు. బుధవారం సాయంత్రం తాత శశికుమార్ తేజా గుప్తను స్విమ్మింగ్ శిక్షణకు తీసుకెళ్లి కోచ్ సెంథిల్‌కుమార్, సుమన్‌కు అప్పగించారు. స్విమ్మింగ్ సాధన చేసే క్రమంలో తేజగుప్త నీటిలో మునిగిపోయాడు. శిక్షకులు రక్షించి ఎం.రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలుడిని పరీక్షించిన వైద్యులు తేజా గుప్త అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై పెరియమేడ్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు వెప్పేరి అసిస్టెంట్ కమిషనర్ అరివకుమార్, పెరియమేడు ఇన్‌స్పెక్టర్ దివ్యకుమార్ కేసు నమోదు చేశారు. స్విమ్మింగ్ కోచ్‌లు సెంథిల్‌కుమార్, సుమన్, లైఫ్‌గార్డ్ ప్రేమ్ కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చిన్నారి స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి మృతి చెందినట్లు విచారణలో తేలింది. జీంచో తిరువళ్లికేనికి చెందిన కోచ్‌లు సెంథిల్‌కుమార్ (37), సుమన్ (31), లైఫ్‌గార్డ్ ప్రేమ్‌కుమార్ (25)ను పోలీసులు అరెస్టు చేశారు.


మృతి చెందిన తేజగుప్త

కోలీవుడ్ టాక్స్

త్రిష రూటే సపరేటు



తమిళసినిమా: త్రిష ఈ పేరే ఒక క్రేజీ. మోడలింగ్ రంగం నుంచి వచ్చి సినిమాల్లో మొదట చిన్న చిన్న పాత్రలో నటించి ఆ తరువాత కథానాయకిగా అగ్రస్థానానికి ఎదిగింది. ప్రశాంత్, సిమ్రాన్ జంటగా నటించిన జోడీ చిత్రంలో త్రిష స్నేహితురాలిగా చిన్నపాత్రలో మెరిసింది. ఆ చిత్రం విడుదలై రెండు దశాబ్దాలు దాటింది. కాగా లేసా లేసా చిత్రంతో కథానాయకిగా తెరంగేట్రం చేసిన త్రిషకు ఆ తరువాత కెరియర్ పరంగా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. విక్రమ్ సరసన నటించిన సామి, విజయ్‌తో జత కట్టిన గిల్లి వంటి చిత్రాలు సంచలన విజయాన్ని సాధించి త్రిషకు స్టార్ డమ్ తీసుకొచ్చాయి.

ఆ తరువాత తమిళంతో పాటు తెలుగు, కన్నడం, హిందీ, మలయాళం అంటూ బహు నటిగా ఎదిగిపోయింది. అది ఈమెను లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాల నాయకి స్థాయికి చేర్చింది. అయితే దురదృష్టవశాత్తు త్రిష నటించిన లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాలు సత్ఫలితాలను ఇవ్వలేదు. దీంతో మార్కెట్ కాస్త డౌన్ అయ్యింది. అలాంటి సమయంలో 96 చిత్రం ఆమెను మళ్లీ గాడిలోకి తెచ్చింది. ఆ తరువాత కొన్ని చిత్రాలు నిరాశపరిచాయి. అలాంటి సమయంలో గత ఏడాది మణిరత్నం దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్ త్రిషకు మరోసారి పెద్ద లిఫ్ట్ ఇచ్చింది. అందులో ఆమె పోషించిన యువరాణి కుందవై పాత్రకు ప్రశంసల వర్షం కురిసింది. ఐశ్వర్యరాయ్‌కు మించిన పేరు తెచ్చిపెట్టింది. దీంతో మళ్లీ అవకాశాలు రావడం మొదలెట్టాయి. అలా త్రిష గ్రాఫ్ తగ్గుతున్నప్పుడల్లా ఒక సంచలన విజయం వచ్చి ఆమె కెరీర్‌కు ప్లస్ అవుతోంది. ప్రస్తుతం విజయ్ సరసన లియో చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు మలయాళంలో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఒక భారీ చిత్రంలో త్రిష నటిస్తోంది. అదే విధంగా పొన్నియిన్ సెల్వన్ -2 చిత్రం ఈ నెల 28వ తేదీన తెరపైకి రానుంది. అందుకే సినీ వర్గాలు త్రిష రూటే సపరేటు అంటున్నారు.

దేవా సంగీతంలో వా వరలాం వా

తమిళసినిమా: అన్నామలై, బాషా తదితర 450కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించిన దేవా తాజాగా సంగీతాన్ని అందిస్తున్న చిత్రం వా వరలాం వా. సంతోష్ ప్రతాప్ కథానాయకుడిగా నటిస్తున్న ఇందులో కింగ్స్ లీ ప్రధాన భూమికను, మైమ్ గోపీ ప్రతినాయకుడిగానూ నటిస్తున్నారు. నటి భవ్య నాయకిగా నటిస్తున్న ఇందులో సింగం పులి, శరవణ సుబ్బయ్య, దీప, వయాపురి, బోండా మణి, పైల్వాన్ రంగనాథన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఎస్‌జీఎస్ క్రియేషన్స్ మీడియా పతాకంపై ఎస్పీఆర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎల్‌జి రవిచంద్రన్, ఎస్‌పీఆర్‌లో ద్వయం దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇందులో ఎల్జి రవి చంద్రన్ ఇంతకుముందు మాసాని, అయిందా తలైముర్రై సిద్ధ వైద్య శిఖామణి, నాన్ అవళై సందిత్త పోదు, చిత్రాలకు దర్శకత్వం వహించారు. కథ, చిత్ర వివరాలను దర్శకులు వెల్లడిస్తూ.. ఇందులో కథానాయకుడు తన స్నేహితుడితో కలిసి డబ్బు ఆశతో ధనవంతుడు అయ్యాడా..? అనే ఇతివృత్తంతో వినోదం ప్రదానాంశంగా వా వరలాం వా రూపొందినట్లు పేర్కొన్నారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై, చెంగల్పట్టు, మదురాంతకం, వేదవాక్కం, వేదాందకమ్ ప్రాంతాలలో ఏకధాటిగా నిర్వహించి పూర్తి చేసినట్లు చెప్పారు. చిత్రంలో పాటలకు ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.


దేవా

ప్రేమమ్ దర్శకుడితో
విజయ్ సేతుపతి

తమిళసినిమా: మలయాళంలో ప్రేమమ్, నేరం వంటి సూపర్‌హిట్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అల్ఫోన్స్ పుత్రన్. ఈయన ఇటీవల దర్శకత్వం వహించిన చిత్రం గోల్డ్. నటుడు సుకుమార్, నయనతార జంటగా నటించిన ఈ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. దీంతో తన తదుపరి చిత్రాన్ని తమిళంలో రూపొందించనున్నట్లు దర్శకుడు అల్ఫోన్స్ పుత్రన్ ఇటీవల అధికారికంగా రోమియో పిక్చర్స్ పతాకంపై రాహుల్ నిర్మించినట్లు తెలిపారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అదేవిధంగా ఇటీవలే ఇందులో నటించే నటీనటుల ఎంపిక మొదలైందని, కథానాయకుడిగా విజయ్ సేతుపతిని నటింపచేయడానికి చర్చలు జరుపుతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఇది ఇంతకుముందు విజయ్ సేతుపతి, త్రిష జంటగా నటించిన 96 చిత్రం తరహాలో విభిన్న ప్రేమకథా చిత్రంగా ఉంటుందని సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. ఇకపోతే తమిళం, తెలుగు, హిందీ చిత్రాలలో నటిస్తూ బిజీగా ఉన్నారు. కాగా విజయ్ సేతుపతి నటించిన విడుదలై చిత్రం మంచి ఆదరణతో దూసుకుపోతోంది.


విజయ్ సేతుపతి

జయం రవికి జోడీగా కృతిశెట్టి?

తమిళసినిమా: నటి కృతి శెట్టి మరో లక్కీఛాన్స్ వరించిందని తాజా సమాచారం. తెలుగులో వరుస చిత్రాలతో బిజీగా వున్న ఈ బ్యూటీకి ఇప్పటికే ది వారియర్ చిత్రం ద్వారా కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. అయినా కృతిశెట్టికి అక్కడ అవకాశాలు వస్తునే ఉన్నాయి. ప్రస్తుతం నాగచైతన్య జంటగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న చిత్రంలో ఆమె నటిస్తోంది. తాజాగా నటుడు జయం రవికు జంటగా నటించే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. పొన్నియిన్ సెల్వన్ చిత్రం విజయంతో మంచి జోష్‌లో ఉన్న జయంరవికి ఆ తరువాత విడుదలైన అఖిలన్ చిత్రం నిరాశపరిచింది. ప్రస్తుతం సైరన్ చిత్రంలో నటిస్తున్నారు. దీంతో పాటు ఇరైవన్ అనే చిత్రం ఆయన చేతిలో ఉంది. కాగా తాజాగా మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీనిని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేష్ రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఈ చిత్రం ద్వారా భువనేశ్వర్ అనే నూతన దర్శకుడు పరిచయం అవుతున్నారు. చిత్రం జూన్ నెలలో సెట్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. అదే విధంగా వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. కాగా ఇందులో జయం రవికు జంటగా నటి కృతి శెట్టిని నటింపచేయడానికి యూనిట్ వర్గాలు చర్చలు జరుపుతున్నట్లు తాజా సమాచారం. కాగా దీనికి జీనీ అనే టైటిల్‌ను ఖరారు చేశారని తెలిసింది.


జయం రవి


కృతిశెట్టి

నేను డ్రీమ్ గర్ల్ కాదు..!

తమిళసినిమా: తాను డ్రీమ్ గర్ల్ కాదని, రియల్ గర్ల్ అని నటి శృతిహాసన్ పేర్కొన్నారు. ఈమె తెలుగులో చిరంజీవి సరసన నటించిన వాల్తేరు వీరయ్య, బాలకృష్ణకు జంటగా నటించిన వీర సింహారెడ్డి చిత్రాలు సంక్రాంతికి తెరపై వచ్చి సంచలన విజయం సాధించాయి. ఒక కథానాయకి నటించిన రెండు భారీ చిత్రాలు ఒకేసారి పోటీలో నిలిచి గెలవడం అరుదైన విషయమే. అది నటి శృతిహాసన్ జీవితంలో జరిగింది. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ప్రభాస్ సరసన పాన్ ఇండియా చిత్రం సోలార్‌లో నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు ముమ్మరంగా జరుపుకుంటున్న ఈ చిత్రం సెప్టెంబర్ 28వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నటి శృతిహాసన్ గురువారం ఉదయం చెన్నైలోని ఓ స్టార్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. సలార్ చిత్రంలో నటించడం గురించి మాట్లాడుతూ తనకు కేజీఎఫ్ చిత్రం చాలా నచ్చిందన్నారు. ఆ చిత్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సోలార్ చిత్రంలో నటించమని అడగడంతో వెంటనే ఓకే చెప్పానన్నారు. అందులో తనది చాలా డిఫరెంట్ పాత్ర అని చెప్పారు. సలార్ చిత్రంలో నటించడం చాలా హ్యాపీగా ఉందన్నారు. తొలుత హిందీ సినిమాతో నటిగా పరిచయమయ్యానన్నారు. ఆ తరువాత తెలుగులో, ఆపై ఏఆర్ మురుగదాస్ కోలీవుడ్‌లో అవకాశం కల్పించారన్నారు. అయితే తెలుగులో నటించిన గబ్బర్ సింగ్ చిత్రంతో తొలి విజయం వరించిందన్నారు. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమ అంటే ప్రత్యేకమన్నారు. అయితే హిందీ, తమిళం భాషల్లో నటించడం తనకు ఇష్టమని తెలిపారు. తమిళంలో ఎక్కువ చిత్రాలు చేయకపోవడానికి కారణం సమయం లేకపోవడమేనన్నారు. డ్రీమ్ గర్ల్‌గా ఎదగడానికి ఎందుకు ప్రయత్నించడం లేదు అడుగుతున్నారని, సినీ రంగంలో హేమమాలినీ, శ్రీదేవి డ్రీమ్ గర్ల్స్ అని తాను డ్రీమ్ గర్ల్ కాదని రియల్ గర్ల్ అనిపే ర్కొన్నారు. తాను తండ్రి సినీ దిగ్గజం అయినా స్వశక్తితోనే ఈ స్థాయికి ఎదిగాన న్నారు. ఆయన రాజకీయ వారసురాలిని కాలేనని, కారణం తనకు ఆ రంగంలో పరిణితి లేదని చెప్పారు.


శృతిహాసన్

క్లుప్తంగా

పిడుగు పడి ఇద్దరి మృతి

తిరువొత్తియూరు: వేర్వేరు చోట్ల పిడుగు పడి ఇద్దరు మృతి చెందారు. తెన్‌కాశి జిల్లాలో బుధ వారం సాయంత్రం పిడుగు పడింది. ఆ సమయంలో ఆవులు మేపుతున్న విద్యార్థి మృతి చెందాడు. తెన్‌కాశి జిల్లా ఆలంకులం సమీపంలో ఉన్న వెంకటేశ్వరపురానికి చెందిన వేలాయుధం కుమారుడు దేవానంద్ (17) ప్లస్ 2 చదువుతున్నాడు. పబ్లిక్ పరీక్షలు రాసిన అతను సెలవులు ఇవ్వడంతో తన అవ్వ ఇల్లు అయినా తులుక్కానం కులం గ్రామానికి వెళ్లాడు. బుధ వారం సాయంత్రం అవ్వతో కలిసి ఆవులు మేపుతున్నాడు. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దేవానంద్ ఉన్న చోట పిడుగు పడింది. తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడిక్కడే మృతిచెందాడు. అదేవిధంగా బుధవారం సాయంత్రం ఆలంకులం సమీపంలో ఆనైపురానికి చెందిన సోల్లమాటీన్ (49) మృతిచెందాడు. నాలుగు మేకలు కూడా మృతి చెందాయి.

రూ.30 లక్షల సముద్రపు నత్తల స్వాధీనం

– అన్న, తమ్ముడు అరెస్టు



స్వాధీనం చేసుకున్న సముద్రపు నత్తలు

అన్నానగర్: వేలాంగన్ని సమీపంలో గురువారం ఉదయం రూ.30 లక్షల విలువైన సముద్రపు నత్తలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అన్న, తమ్ముడిని అరెస్టు చేశారు. కన్యాకుమారి జిల్లా నాగై పరిసర ప్రాంతాలలోని వ్యాపారుల నుంచి సముద్రపు నత్తలు కొనుగోలు చేసి ఇళ్లలో భద్రపరచి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు వేలాంగన్ని పోలీసులకు గురువారం సమాచారం అందింది. ఈ మేరకు వేలాంగన్ని సమీపంలోని మేళపిడకై రోడ్డులోని చిన్నన తుంబూర్ బ్రిడ్జ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వస్తున్న కార్గో వ్యాన్‌ను తనిఖీ చేయగా రూ.30 లక్షల విలువైన 400ల కిలోల సముద్రపు నత్తలను 10 బాక్సుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి సింహరావెల్, కేశవన్‌ను అరెస్టు చేశారు. కార్గో వ్యాన్, సముద్రపు నత్తలను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

కోట్ల విలువైన నార్కోటిక్ పౌడర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డ్రగ్ పౌడర్లు

అన్నానగర్: ధనుష్కోటి సముద్ర ప్రాంతం గుండా శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్న పలు కోట్ల రూపాయల విలువైన నార్కోటిక్ పౌడర్‌ను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. రామనాథపురం జిల్లా సముద్ర ప్రాంతం నుంచి శ్రీలంకకు గంజాయి సహా పలు వస్తువులు అక్రమంగా రవాణా అవుతున్నాయి. ఈ స్థితిలో తలైమన్నార్ సముద్ర ప్రాంతంలో అనుమానాస్పదంగా వస్తున్న బోటును ఆపేందుకు నేవీ పోలీసులు ప్రయత్నించారు. మెరైన్‌లను చూడగానే ఆ పడవలోని వ్యక్తులు వేగంగా వెళ్లారు. నేవీ పోలీసులు బోటును పట్టుకుని తనిఖీ చేయగా 95 పొట్లాల్లో గంజాయితో తయారు చేసిన 92 కిలోల మత్తుమందు పౌడర్‌ను గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని రామనాథపురం జిల్లా మండపం సమీపంలోని వేదలై ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు

తిరుత్తణి: తిరుత్తణి సబ్ స్టేషన్ పరిధిలోని పట్టాభిరామపురం, ప్రభుత్వాసుపత్రి, బీసీఎస్.కండ్రిగ, కార్తికేయపురం, సరస్వతినగర్, పెరియకడంబూరు, చిన్నకడంబూరు, వినాయకపురం, పరిసర ప్రాంతాల్లో శనివారం మాసాంతర మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సేవలు నిలిపివేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈమేరకు డివిజినల్ విద్యుత్‌శాఖ ఇంజినీరు ఓ ప్రకటన గురువారం విడుదల చేశారు

అశ్వ వాహనంపై రామయ్య విహారం



కొరుక్కుపేట: అశ్వ వాహనంపై ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రులు భక్తులను కటాక్షించారు. ఈ మేరకు చెన్నై జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కనులపండువుగా సాగుతున్నాయి. ఈవేడుకల్లో బాగంగా గురువారం రాత్రి శ్రీరాముడు అశ్వవాహనంపై విహరించారు. అంతకు ముందు అర్చకులు సీతారాములు విశేషంగా అలంకరించి పూజలను చేశారు. కన్యకా పరమేశ్వరి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నేత్రపర్వంగా చేపట్టారు. అనంతరం కుంభకోణం అనంతనారాయణన్ భాగవతార్ నేతృత్వంలో చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమం అందరినీ అలరించింది.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- కట్టుదిట్టమైన చర్యలు
- పరీక్షకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు
- మే 5న ఫలితాలు
- ఓ వైపు తండ్రి మృత దేహం.. మరో వైపు పరీక్షకు విద్యార్థి



లేడివెల్లింగ్టన్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థినికు విద్యా ఉపకరణాలను అందజేస్తున్న విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి



పరీక్ష కేంద్రంలో తనిఖీలు చేస్తున్న సేలం జిల్లా కలెక్టర్ కార్మోగం

సాక్షి, చెన్నై : పుదుచ్చేరితో పాటు తమిళనాడులో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కటుదిట్టమైన ఆంక్షలు, భద్రతా ఏర్పాట్ల నేపథ్యంలో తొలి రోజు ల్యాంగ్వేజ్ పరీక్ష జరిగింది. కౌన్సిలింగ్, ప్రార్థనల అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రాష్ట్ర విద్యాశాఖ సర్వం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. తమిళనాడు, పుదుచ్చేరిలోని 12,639 పాఠశాలలకు చెందిన 9,76,089 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,66,765 మంది విద్యార్థులు, 4,55,960 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇతరులు ఐదుగురు, 264 మంది జైలు ఖైదీలతో పాటు ప్రత్యేక ప్రతిభావంతులు ఉన్నారు. 3,976 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులు యూనిఫాం ధరించి పాఠశాలలకు చేరుకున్నారు. పాఠశాలల వద్ద విద్యార్థులలో భయాన్ని పోగొట్టే విధంగా కౌన్సిలింగ్ చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. విద్యార్థులు 9.30 గంటలకు ఉత్సాహంగా పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. సరిగ్గా పది గంటల నుంచి 1.15 గంటలకు వరకు తొలి రోజు ల్యాంగ్వేజ్ పరీక్ష జరిగింది. ఎలాంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షలపై నిఘా ఉంచాయి. ఈ నెల 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మే 5వ తేదీ ఫలితాల వెల్లడి దిశగా ముందుగానే విద్యాశాఖ ప్రకటన చేయడం విశేషం.

తండ్రిమరణంతో...

కడలూరు జిల్లా బన్రూటి సమీపంలోని అక్కారపల్లికి చెందిన దినకరన్(47)కు చంద్రు ఒకే కుమారుడు. ఇతను తిరుత్తురై పూండిలో పదో తరగతి పరీక్ష రాయాల్సి ఉంది. బుధవారం తండ్రితో పాటు కులదైవం ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అక్కడ తండ్రికి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. తండ్రి మరణించడంతో పరీక్షకు వెళ్లాలా..? లేదా అన్న డైలమాలో పడ్డాడు చంద్రు. తండ్రి మృతదేహాన్ని ఇంట్లో పెట్టుకుని చివరకు పరీక్షకు హాజరయ్యాడు.

ప్రశాంతంగా పది పరీక్షలు

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా గురువారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో 24,506 మంది బాలికలు, 23,819 మంది బాలురు పరీక్షలు రాస్తున్నారు. ఇందుకోసం 188 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు 48,744 మంది హాజరుకాగా, 711 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేశారు. 239 మంది స్పెషల్ టీమ్, 188 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పర్యవేక్షించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కేంద్రంలోకి అనుమతించారు. ఇది ఇలా వుండగా పుళల్ జైలు నుంచి 64 మంది ఖైదీలు, 270 అంధ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్న ఉపాధ్యాయులు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తిరుత్తణిలో..

తిరుత్తణి: పదో తరగతి పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. తిరుత్తణి ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి ఉదయం తొమ్మిది గంటలకే విద్యార్థునులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ నిర్వహించి తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. స్టాండింగ్ స్క్వాడ్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. పళ్లిపట్టు, పొదటూరుపేట, ఆర్కేపేట, కేజీ కండ్రిగ, కనకమ్మ సత్రం పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని అధికారులు వెల్లడించారు. తొలిరోజు మాతృభాష పేపర్ పరీక్ష నిర్వహించారు. తొలిరోజు పరీక్ష సులభంగా వున్నట్లు విద్యార్థులు తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత సర్టిఫికెట్ కోర్సులు

కొరుక్కుపేట : రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం పరిధిలోని తమిళనాడు అపెక్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఉచిత సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశ పెట్టారు. ఈ వివరాలను గురువారం అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది మే నెలలో బ్యాంకింగ్ – ఫైనాన్స్, మరొకటి ఫిన్‌టెక్ స్కిల్స్‌లో రెండు ఉచిత సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. నాన్ మొదల్వన్ పథకంలో భాగంగా తీసుకువచ్చిన ప్రోగ్రామ్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్, ఫిన్‌టెక్ స్కిల్స్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్ హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు కళాశాల విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుస్తాయన్నారు. కోర్సు కాల పరిమితి 18 నుంచి 20 వారాల వరకు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ కళాశాలలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన నాన్-ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులు ఆన్‌లైన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. ఈ ప్రోగ్రామ్‌లకు అర్హత సాధించడానికి విద్యార్థులు ఉచిత ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 16 (ఆదివారం) తమిళనాడు అంతటా నిర్వహించబడుతుందని వివరించారు.

నేడు గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు

కొరుక్కుపేట: ఏసు క్రీస్తు శిలువపై ప్రాణాలు అర్పించిన రోజును పవిత్ర శుక్రవారం (గుడ్ ఫ్రైడే)గా భావిస్తూ క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం చర్చిల్లో ఏర్పాట్లు చేశారు.

21 ఆలయాల్లో 29 పనులు



ఆలయాలలో పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం స్టాలిన్

- రూ. 149 కోట్లు కేటాయింపు
- సీఎం శంకుస్థాపన

సాక్షి, చెన్నై : దేవదాయ శాఖ పరిధిలోని 21 ఆలయాల్లో కొత్తగా ఒక్కో ఆలయంలో 29 పనులకు సీఎం స్టాలిన్ గురువారం శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ.149 .93 కోట్లను కేటాయించారు. 21 ఆలయాలకు రాజగోపురాలు, కల్యాణ మండపాలు, అర్చకులు, సిబ్బందికి గృహాలు, ప్రహరీ గోడలు, భక్తులకు వసతి గృహాలు, అత్యవసర చికిత్స కేంద్రాలు, క్యాంటీన్లు, వేచి ఉండేందుకు ప్రత్యేక గదులు, తదితరాలు చేపట్టనున్నారు. చెన్నై వడపళణి మురుగన్, ట్రిప్లికేన్, పార్థసారథి స్వామి ఆలయం, సెయ్యార్ వేదపురీశ్వర ఆలయం, సేలం సుఖవనేశ్వరర్ ఆలయం, నామక్కల్, ఈరోడ్ బన్నారీ అమ్మన్ ఆలయం, కరూర్ కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయం, తాంతోనిమలై తదితర ఆలయాలలో ఈ పనులు చేపట్టనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఈ పనులకు శంకుస్థాపన చేశారు.

పురావస్తు తవ్వకాలు

తమిళనాడులోని ఎనిమిది ప్రదేశాలలో పురావస్తు తవ్వకాల పనులకు సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీకారం చుట్టారు. శివగంగై జిల్లా, కీలడి, తిరువణ్ణామలై జిల్లా, కిల్నామండి తదితర ప్రాంతాల్లో పురవాస్తు తవ్వకాలు చేపట్టనున్నారు. తవ్వకాల్లో వెలుగు చూసిన పురాతన వస్తువులు, సంపదలు, చరిత్ర తదితర వివరాలను సాంకేతికత ద్వారా తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేక యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాగే క్షయ వ్యాధి నిర్మూలనకు తమిళనాడు ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈసందర్భంగా ప్రత్యేక కార్యక్రమం సచివాలయంలో జరిగింది. ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తరఫున జరుగుతున్న కార్యక్రమాలను గుర్తు చేస్తూ, ఇందులో రాణిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని సర్టిఫికెట్లతో సీఎం సత్కరించారు.

చెన్నైలో ఝార్ఖండ్ మంత్రి మృతి



ఝార్ఖండ్ మంత్రి జగర్నాథ్ మహతోకు నివాళులర్పిస్తున్న తమిళనాడు మంత్రి

సాక్షి, చెన్నై: అనారోగ్యంతో చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఝార్ఖండ్ విద్యాశాఖ మంత్రి జగర్నాథ్ మహతో (56)తో గురువారం కన్నుమూశారు. 2020లో ఆయనకు ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్స చెన్నైలో జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆయన కన్నుమూశారు. దీనిపై తమిళనాడు సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సంతాపం తెలియజేశారు. ఆరోగ్యమంత్రి ఎం. సుబ్రమణియన్ ఆస్పత్రికి చేరుకుని జగర్నాథ్ మహతో భౌతిక కాయనికి నివాళుర్పించారు. అనంతరం చెన్నై నుంచి ఆయన భౌతిక కాయాన్ని ఝార్ఖండ్‌కు తరలించారు.

డివైన్లీ గిఫ్టెడ్ పుస్తకావిష్కరణ

కొరుక్కుపేట: ప్రఖ్యాత రచయిత వైద్యుడు డాక్టర్ గిరీష్ కుమార్ తాజా పుస్తకం అయిన డివైన్లీ గిఫ్టెడ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం చెన్నై నగరంలో ఘనంగా జరిగింది. ఈపుస్తకంలో డాక్టర్ గిరీష్ కుమార్‌తోపాటు మరో 17మంది సహ రచయితలతో రూపుదిద్దుకున్న డివైన్లీ గిఫ్టెడ్‌ను పద్మశ్రీ అవార్డు గ్రహీత, డ్రమ్స్ శివమణి, అతని భార్య రునా రిజ్వీ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీష్ కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన, దైవ విషయాలను ప్రజల్లో మరింత పెంచాలన్న సంకల్పంతో డివైన్లీ గిఫ్టెడ్ పుస్తకాన్ని తీసుకుని వచ్చినట్లు తెలిపారు. వ్యక్తులు వారి సంబంధాలు, జీవిత సవాళ్లను అధిగమించడానికి ఇందులోని విషయాలు దోహపడుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గిరీష్ కుమార్

• సాయం



రంజాన్ మాసం సందర్భంగా చెన్నైలోని పేద ముస్లింలకు వైఎస్సార్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్ నేతృత్వంలో సరుకుల పంపిణీ -సాక్షి, చెన్నై

వంగనూరులో డీఎంకే ప్రచారం



మాట్లాడుతున్న డీఎంకే నాయకుడు వాసు కరుణానిధి

పళ్లిపట్టు: రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నట్టు ఆ పార్టీ వక్త వాసు కరుణానిధి తెలిపారు. వంగనూరులో గురువారం డీఎంకే వీధి ప్రచార సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం స్టాలిన్ 70వ జన్మదిన వేడుకల్లో భాగంగా డీఎంకే శ్రేణులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఆర్కేపేట మండలంలోని వంగనూరు, శ్రీకాలికాపురం గ్రామాల్లో గురువారం వీధి ప్రచారం చేపట్టారు. జిల్లా నేత విభాగం కన్వీనర్ ఎస్ఆర్.రవి ఆధ్వర్యంలో నిర్వహించిన వీధి సభల్లో ఆ పార్టీ వక్త వాసు కరుణానిధి, మురసొలిమూర్తి, నేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓఏ.నాగలింగం తదితరులు పాల్గొని ప్రసంగించారు. నేత పరిశ్రమ కోసం డీఎంకే ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తున్నట్టు చెప్పారు. ఉచిత విద్యుత్, ఉచిత చీర, ధోవతులు అందజేస్తున్నట్టు తెలిపారు. నేతన్నలు డీఎంకేకు అండగా నిలవాలని కోరారు. మండల కార్యదర్శులు పళని, షణ్ముగం, మాజీ జిల్లా కమిటీ సభ్యుడు రఘు, మండల వైస్ చైర్మన్ తిలకవతి రమేష్, ప్రభుత్వ న్యాయవాది రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వైద్య పరికరం వితరణ

కొరుక్కుపేట: చెన్నైలోని ఓమందూరార్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.57 లక్షల విలువైన డిజిటల్ మమోగ్రఫీ పరికరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్–మిడ్ టౌన్, రోటరీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా వితరణ చేశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత్ ఎఫ్ఐహెచ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జోస్ ఫాల్గర్, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3232 డిస్ట్రిక్ గవర్నర్ రోటేరియన్ డాక్టర్ ఎస్.నందకుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్–మిడ్ టౌన్ అధ్యక్షుడు కార్తిక్ వీరభద్రన్ పాల్గొన్నారు. వీరు పరికరాన్ని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఆర్.విమలకు అందజేశారు. ఈ సందర్బంగా కార్తిక్ వీరభద్రన్ మాట్లాడుతూ డిజిటల్ మమోగ్రఫీ ఎక్స్‌రే పరికరం బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తుందని తెలిపారు. భారతదేశంలో రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలు సంఖ్య నానాటికీ పెరుగుతున్నారు. ప్రారంభ దశలో రొమ్ము క్యాన్సర్ నివారణ, చికిత్స కోసం మామోగ్రఫీ ఎంతో దోహదపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఉపయోగకరంగా ఉంటుందని రోటరీ తరపున మామోగ్రఫీ పరికరాన్ని వితరణ చేసినట్టు తెలిపారు.



ఆసుపత్రి నిర్వాహకులకు వైద్య పరికరం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పురావస్తు తవ్వకాలు ప్రారంభం



తవ్వకాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: పురావస్తుశాఖ ఆధ్వర్యంలో తిరువళ్లూరు జిల్లా పత్రపెరంబదూరు గ్రామంలో మూడో దశ తవ్వకాలను కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ గురువారం ఉదయం ప్రారంభించారు. తిరువళ్లూరు జిల్లా పత్రపెరంబదూరులో 2015-16, 2017-18లో తవ్వకాలను చేపట్టారు. ఇందులో సింధూ, హరప్పా నాగరికతను చాటి చెప్పే ఆధారాలు లభించాయి. దీంతో మరిన్ని ఆధారాల కోసం మూడవ దశ తవ్వకాలు ప్రారంభించడానికి ముఖ్యమంత్రి రూ.30 లక్షలు మంజూరు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరువళ్లూరు జిల్లాలోని పట్టరపెరంబదూరు, నత్తంబేడు, ఇరుళంతోపు, శివన్‌కోయిల్ తదితర ప్రాంతాల్లోని 825 చదరపు మీటర్ల మేరకు 33 గుంతల తవ్వకాలను చేపట్టామన్నారు. ఇందులో 1,404 కళాఖండాలు, పురాతన నాగరికత సమానమైన ఆధారాలు లభించినట్టు చెప్పారు. పత్రపెరంబదూరులో జరిగిన తవ్వకాల్లో వృత్తాకార బావిని గుర్తించామన్నారు. ఈ బావి సుమారు 3.91 మీటర్ల లోతు ఉందని, తమిళనాడులో పురావస్తు చరిత్రలో పత్రపెరంబదూరులో లభించిన బావి అతిపెద్దదని వివరించారు. క్రీపూ 3-4 శతాబ్దాల నాటిదిగా గుర్తించారు. దీంతో దక్షణ భారతదేశం చరిత్రకు అవసరమైన ఆధారాలు పత్రపెరంబదూరులో మరిన్ని లభించే అవకాశం వున్నట్టు గుర్తించి మూడవదశ తవ్వకాలను చేపట్టామని వివరించారు. ఈ తవ్వకాలు రోజుకు సుమారు 25 మందితో సెప్టెంబర్ 25 వరకు పురావస్తుశాఖకు చెందిన డైరెక్టర్ భాస్కరన్ నేతృత్వంలో జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ డైరెక్టర్ భాస్కరన్, పురావస్తుశాఖ అధికారి సురేష్, తహసీల్దార్ మదియళగన్ పాల్గొన్నారు.

తిరుత్తణి ఆలయంలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు

తిరుత్తణి: తిరుత్తణి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం కోసం రూ. 40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీకారం చుట్టారు. తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా హిందూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించి శిక్షణ కేంద్రం నిర్మాణానికి రూ.16.50 కోట్లు, 500 మంది కూర్చునే విధంగా రూ.9.63 కోట్లతో కల్యాణ మండపం, వందమందికి సరిపడేలా రూ.13.90 కోట్లతో నాలుగు కల్యాణ మండపాల కట్టడాల పనులను గురువారం సచివాలయం నుంచి సీఎం స్టాలిన్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కొండ ఆలయ కార్యాలయం ప్రాంతంలో నిర్మించనున్న కట్టడాల నిర్మాణ పనులను తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ శంకుస్థాపక చేసి ప్రారంభించారు. వేలూరు హిందూ దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ లక్ష్మణన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతిభూపతి, వైస్ చైర్మన్ సామిరాజ్, పట్టణ డీఎంకే కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిరుత్తణి ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

ఫిర్యాదు స్వీకరణలో ఆలస్యం

- పంచాయతీ అధ్యక్షురాలి భర్త ఆత్మహత్యాయత్నం

తిరువళ్లూరు: భార్య కాపురానికి రావడం లేదని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన పంచాయతీ అధ్యక్షురాలి భర్త ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి విద్యుత్ తీగలను పట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని చిన్నమాంగాడు మత్స్యకార గ్రామానికి చెందిన ధర్మదురై(33) భార్య రోజా(28) పూంగుళం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. మత్స్యకారుడు ధర్మదురై, రోజా కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి వెన్నిల(07), దినేష్(05) పిల్లలు వున్నారు. వీరి మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా రోజా పుట్టింటికి వెళ్లి పొన్నేరి సోమంజేరిలో సోదరులతో కలిసి ఉంటోంది. కాపురానికి రావాలని ధర్మదురై భార్యను కోరాడు. ఈ క్రమంలో భార్య రోజా సోదరులకు, ధర్మదురై ఘర్షణ పడ్డారు. మనస్తాపం చెందిన ధర్మదురై తనపై భార్య సోదరులు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు భార్య కాపురానికి వచ్చేలా చూడాలని ఆరంబాక్కం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని మూడు గంటల పాటు స్టేషన్‌లో వుంచుకున్నా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన ధర్మదురై పోలీసుల తీరుకు నిరసనగా స్టేషన్ ఎదురుగా వున్న ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి విద్యుత్ తీగలను పట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని పోలీసులు సమీపంలోని వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి చెన్నై వైద్యశాలకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.



ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎక్కిన ధర్మదురై

భక్తి శ్రద్ధలతో గోపూజ



గోపూజలో ఆర్యవైశ్య అన్నదాన సభ మహిళా సభ్యులు, అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

కొరుక్కుపేట: ఆర్యవైశ్య అన్నదాన సభ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ కన్యకా పరమేశ్వరి గోశాల ప్రాంగణంలో గోపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం ఆర్యవైశ్య అన్నదాన సభ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన గోశాలలోని ఆవులకు పసుపు, కుంకుమ, పూలతో విశేషంగా అలంకరించి గోపూజ చేపట్టారు. అనంతరం సభ మహిళా సభ్యులంతా కలిసి విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, భగవద్గీతలను సామూహికంగా పారాయణం చేసి భక్తిని చాటుకున్నారు. గోవులకు ఆహారం అందించి ప్రార్థించారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ నెలా పౌర్ణమి రోజున గోపూజను తమ సభ తరపున చేపడుతున్నామన్నారు. గోవు సమస్త దేవతాస్వరూపం అని తెలిపారు. గోపూజ వల్ల మానవాళిని పీడిస్తున్న సమస్త దోషాలు తొలగి, శ్రేయస్సు కలుగుతుందని చెప్పారు. అందరూ గోమాతను పూజించాలని కోరారు. ఈ పూజల్లో మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'


వైఎస్సార్ జిల్లా నరసాపురంలో చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొత్తూరులో చెక్కు అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


కృష్ణాజిల్లా పెనమలూరులో స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి


శ్రీసత్యసాయి జిల్లా అమరాపురంలో ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

జనంలోకి జగనన్న సైన్యం!

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి నేడు శ్రీకారం

- 175 నియోజకవర్గాల్లో 20వ తేదీ వరకూ నిర్వహణ
- ఏడు లక్షల మందితో వైఎస్సార్‌సీపీ పదాతిదళం సిద్ధం
- 1.60 కోట్ల కుటుంబాల్లోని ఐదు కోట్ల మంది ప్రజలతో మమేకం
- సమన్వయం చేయనున్న ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు
- ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా సర్వే నిర్వహణ
- ఐదు ప్రశ్నలతో ప్రజా మద్దతు పుస్తకంలో వివరాలు నమోదు

మాట నిలబెట్టుకుంటూ 46 నెలల్లో 98.5 శాతం ఎన్నికల హామీలను అమలు చేసి మేనిఫెస్టోకు సిసలైన నిర్వచనం ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కూడా గడవక ముందే సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2 లక్షల కోట్లు జమ చేశారు. వార్డు మెంబర్ నుంచి కేబినెట్ వరకూ సింహభాగం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, మహిళలకు రిజర్వ్ చేస్తూ చట్టం తెచ్చి మరీ చిత్తశుద్ధి చాటుకున్నారు. 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు.. 2.60 లక్షల మంది వలంటీర్లు.. 26 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరణతో పరిపాలనను వికేంద్రీకరించి ఇంటివద్దే సుపరిపాలన అందిస్తున్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదర్శ పాలనతో ముఖ్యమంత్రి జగన్ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారు. ఇదే అంశాన్ని చాటి చెబుతూ టీడీపీ సర్కార్‌కు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ మరోసారి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో నేటి నుంచి ప్రారంభమయ్యే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకూ కొనసాగనుంది. సచివాలయానికి ముగ్గురు చొప్పున నియమించిన కన్వీనర్లు, ప్రతి 50 నుంచి వంద ఇళ్లకు ఇద్దరు చొప్పున నియమించిన గృహ సారథులతో కూడిన ఏడు లక్షల మంది సైన్యం ఈ కార్యక్రమంలో పాల్గొంటుంది. దీనికి సంబంధించి వారికి ప్రత్యేకమైన కిట్ బ్యాగ్‌లు అందచేశారు. ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారు. 14 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా 15,004 సచివాలయాల పరిధిలో 1.60 కోట్ల కుటుంబాలలోని ఐదు కోట్ల మంది ప్రజలను కలుసుకోనున్నారు.

నమ్మకం రెట్టింపు

సుమారు 18 నెలల పాటు పట్టి పీడించిన కరోనాతో ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంతో తల్లడిల్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ ఆపలేదు. 46 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో రూ.రెండు లక్షల కోట్లను జమ చేయడం దేశ చరిత్రలో రికార్డు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకు 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్ వ్యవస్థీకరించి పరిపాలనను వికేంద్రీకరించారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ఆర్థిక చేయూతతో పేదరిక నిర్మూలనతోపాటు రాజ్యాధికారంలో సింహభాగం వాటా ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం చేకూర్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు సామాజిక సాధికారత సాధించేలా బాటలు వేశారు. తాము పెట్టుకున్న నమ్మకం కంటే రెండింతలు అధికంగా న్యాయం చేస్తూ పరిపాలిస్తుండటంతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు నినదిస్తున్నారు. ప్రజల్లో నుంచి వచ్చిన ఈ నినాదాన్నే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేర్చింది.

ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నలివీ..

1. ఇంతకు ముందు పాలనతో పోల్చుకుంటే జగనన్న పరిపాలనలో మీకు, మీ కుటుంబానికి మంచి జరిగిందా?
2. మన రాష్ట్రంలో ప్రతి ప్రాంతానికి, ప్రతి సామాజిక వర్గానికి, ప్రతి కుటుంబానికి గతంలో కంటే జగనన్న పాలనలో ఎక్కువ మంచి జరిగిందా?
3. గత ప్రభుత్వంలో కన్నా జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పెంఛన్, అమ్మ ఒడి, ఆసరా, చేయూత లాంటి అనేక పథకాల ద్వారా డబ్బులను నేరుగా మీ అకౌంట్‌లో వేయడం లేదా వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా మీ చేతికి అందించడం బాగుందా?
4. నేడు మన జగనన్న పాలనలో అమలు చేస్తున్న అనేక సంక్షేమాభివృద్ధి పథకాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని అనుకుంటున్నారా?
5. జగనన్న పాలనలో అమలవుతున్న ఈ సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కూడా కొనసాగించడానికి మీరు జగనన్నపై నమ్మకం ఉంచి మద్దతిస్తారా?

కిట్ బ్యాగ్‌లో ఏముంటాయంటే..

- ఒక్కో కిట్ బ్యాగ్‌లో 200 ఇళ్లకు సరిపడా సామగ్రి ఉంటుంది.
- టీడీపీ సర్కార్‌కు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను వివరిస్తూ రూపొందించిన 200 కరపత్రాలు
- ప్రజా మద్దతు పుస్తకాలు ▲ మూడు పెన్నులు
- ఇద్దరు గృహ సారథులు, ముగ్గురు కన్వీనర్లు ధరించేందుకు సీఎం జగన్ ఫొటోతో కూడిన ఐదు బ్యాడ్జీలు
- సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉన్న 200 స్టిక్కర్లు
- సీఎం జగన్ ఫొటో ఉన్న 200 మొబైల్ ఫోన్ స్టిక్కర్లు

కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారంటే..

- ప్రతి ఇంటి వద్దకు ఇద్దరు గృహ సారథులు, వలంటీరు వెళతారు. టీడీపీ సర్కార్‌కు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను ఆ కుటుంబ సభ్యులకు వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని చదివి వినిపిస్తారు. తర్వాత కరపత్రాన్ని వారికి అందజేస్తారు.
- ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజా సర్వేకు సంబంధించి ఐదు ప్రశ్నలు ఉన్న స్లిప్పుపై కుటుంబ పెద్ద పేరు, ఫోన్ నంబర్ నమోదు చేస్తారు. ఆ తర్వాత ఐదు ప్రశ్నలను చదివి ఆయా కుటుంబాలు ఇచ్చే సమాధానాల ఆధారంగా అవును / కాదు అనే వివరాలను నమోదు చేస్తారు. స్లిప్పు కుడి వైపున ఉన్న రసీదును ఆ కుటుంబానికి ఇస్తారు.
- వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారిని 82960–82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరతారు. మిస్డ్ కాల్ ఇచ్చిన నిముషంలోపే కృతజ్ఞతలు తెలియచేస్తూ సీఎం జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ ఆ కుటుంబానికి వస్తుంది.
- ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి తలుపునకు సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్ అతికించేందుకు అనుమతి కోరతారు. సమ్మతించిన వారి ఇంటి తలుపునకు స్టిక్కర్ అతికిస్తారు. అదే రీతిలో మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్ అతికించి ధన్యవాదాలు తెలియచేస్తారు.
- ఈ కార్యక్రమం పూర్తయ్యాక ప్రజల అభిప్రాయాన్ని సేకరించిన ప్రజా మద్దతు పుస్తకాన్ని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపుతారు.

15,004 సచివాలయాల్లో ఏకకాలంలో

రాష్ట్రంలోని 15,004 సచివాలయాల్లో శుక్రవారం ఏకకాలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 7వ తేదీన మొదలయ్యే ఈ కార్యక్రమం 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ఏడు లక్షల మంది పార్టీ సైనికులు 14 రోజుల్లో దాదాపు 1.60 కోట్ల కుటుంబాలను నేరుగా కలుసుకుంటారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్–అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సూచించింది.

క్లుప్తంగా...

ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

సాక్షి, అమరావతి: కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలకశాఖలోని ఆస్తులకు మొత్తం పన్ను ఒకేసారి చెల్లించేవారికి 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను డిమాండ్స్ పంపించామన్నారు. ఆస్తి యజమానులు రెండు అర్ధ సంవత్సరాలకు సంబంధించిన మొత్తం పన్ను బకాయి లేకుండా ఈ నెల 30వ తేదీలోగా చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆస్తిపన్నుతోపాటు ఖాళీ స్థలాలు, నీటి పన్నుకు ఈ రాయితీ వర్తిస్తుందని వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయా మున్సిపల్ కార్యాలయాలతోపాటు స్థానిక పట్టణ వార్డు సచివాలయాలు, ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించే వెసులుబాటు ఉందని తెలిపారు.

అందరికీ నాణ్యమైన విద్యుత్

- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అందించడం సీఎం జగన్ ధ్యేయం
- రాష్ట్రంలో ఏటా 1,700 ఎంయూల విద్యుత్ ఆదా లక్ష్యం
- ఏపీఎస్ఈసీఎం సమావేశంలో సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అన్ని వర్గాల వినియోగదారులకు ప్రపంచ ప్రమాణాలతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్), ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) చైర్మన్ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో గురువారం జరిగిన ఏపీఎస్ఈసీఎం 11వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించి, ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఎగుమతి చేయడానికి కూడా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ భవనాలన్నింటినీ స్టార్ రేటెడ్ బిల్డింగ్‌లుగా మార్చాలని ఆదేశించారు. గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కొనే కేంద్ర ప్రభుత్వ కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ స్కీమ్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మద్దతిస్తోందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన దాదాపు 17,000 మిలియన్ యూనిట్ల విద్యుత్తులో మొదటి దశగా ఏడాదిలో రూ.1,200 కోట్లు విలువైన 1,700 ఎంయూలు ఆదా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో చేపట్టిన ఇంధన పొదుపు చర్యలతో 1.64 లక్షల యూనిట్లు ఆదా అవుతాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివరించారు. ఈ సమావేశంలో ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్ధనరెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా నా మాటలను వక్రీకరించింది

- ఎస్సీలను ఎప్పుడూ అగౌరవపరచను
- చరిత్ర చెప్పే ప్రయత్నంలో ఏమైనా మాట్లాడితే క్షమించండి
- ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల : జిల్లాల ఏర్పాటుపై ఒక రాజకీయ పార్టీ చేసిన ఆరోపణలను ఖండించేందుకు తాను మాట్లాడిన మాటలను ఎల్లో మీడియా వక్రీకరించిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పక్కనే ఉన్న పొన్నూరును తొలగించి దూరంగా ఉన్న సంతనూతలపాడు అసెంబ్లీ సెగ్మెంట్‌ను కలిపిన విషయాన్ని గుర్తు చేసినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాన్ని ఎస్సీ నియోజకవర్గం చేయటం కోసమే దూరంగా ఉన్న సంతనూతలపాడును కలిపినట్లు వివరించానని చెప్పారు. జిల్లాల ఏర్పాటులో పొన్నూరుతో పాటు సంతనూతలపాడు కూడా బాపట్లకు రాలేదన్నారు. పొన్నూరు నియోజకవర్గం బాపట్లలో కలిస్తే ఇంకా బాగుండేదని అభిప్రాయపడ్డానన్నారు. బాపట్ల జిల్లా ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని పక్కదారి పట్టించేందుకు ఒక రాజకీయ పార్టీ అవలంబిస్తున్న తీరును ఖండించేందుకే చరిత్ర గురించి చెప్పానన్నారు. దానిని ఎల్లో మీడియా వక్రీకరించిందని తెలిపారు. కోన కుటుంబానికి ఎస్సీలు మొదటి నుంచి వెన్నుదన్నుగానే ఉన్నారని, వారిని అగౌరవపరిచేలా ఎప్పుడూ మాట్లాడనని చెప్పారు. చరిత్ర గురించి చెప్పే ప్రయత్నంలో ఎల్లో మీడియా చేసిన వక్రీకరణతో ఎస్సీల మనోభావాలు దెబ్బతిని ఉంటే తనను క్షమించాలని కోన పేర్కొన్నారు.

స్పైస్ బోర్డు సభ్యుడిగా ఎంపీ జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ: స్పైస్ బోర్డు సభ్యుడిగా బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఎన్నికయ్యారు. ఈ నెల 5న నిర్వహించిన ఎన్నికల్లో జీవీఎల్ ఎన్నికైనట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ గురువారం బులెటిన్ విడుదల చేశారు.

ప్రజలకు ఏం చేశారని టీడీపీకి ఓటేయాలి?

- వచ్చే ఎన్నికలతో టీడీపీ పనైపోతుంది
- చంద్రబాబుకు ఉత్తరాంధ్ర కోసం మాట్లాడే హక్కులేదు
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి ప్రతినిధి, విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికలతో టీడీపీ పనైపోతుందని, ఓటుతో ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గత పాలనలో టీడీపీ ఏం ఉద్ధరించిందని ప్రజలు వారికి ఓటు వేయాలని ప్రశ్నించారు. విజయనగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలి వద్ద రూ. 30 లక్షలతో ఏర్పాటు చేసిన దండి మార్చ్ విగ్రహాలను గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు విశాఖలో నిర్వహించిన పార్టీ సమావేశంలో రుషికొండలో ప్రభుత్వ భవనాలు నిర్మించడం తప్పా... అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు.. నేడు విశాఖ నగరం అభివృద్ధి దిశగా పయనిస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నపుడు విశాఖకు ఐటీ పరిశ్రమలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. పరవాడ వద్ద జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీని తానే ఏర్పాటు చేశానంటూ చంద్రబాబు చెప్పుకోవడంపై బొత్స మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ పాలనలో మాత్రమేనన్నారు. టీడీపీ పాలనలో ఏమి అభివృద్ధి జరిగిందో ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు ఎవరైనా సరే చెప్పాలని సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలతో దళారీ వ్యవస్థను ఏర్పాటుచేసి దోచుకుతిన్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

డీబీటీతో జీడీపీ పెరిగింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను డీబీటీ విధానంలో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు నేరుగా నగదు అందించడం వల్లే రాష్ట్రంలో జీడీపీ రేటు పెరిగిందని మంత్రి బొత్స అన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పారు. ప్రజల ఆరోగ్యం కోసం మండలానికి రెండు పీహెచ్‌సీలు పెట్టాలన్న ఆలోచన చంద్రబాబుకు వస్తుందా అని ప్రశ్నించారు. జనసేనను రాజకీయ పార్టీగా భావించట్లేదని, అదొక సెలబ్రిటీ పార్టీ అని మంత్రి బొత్స వ్యాఖ్యానించారు.

దరిద్రం పట్టుకుంది బాబుకే

- అధికార దాహంతోనే రంకెలు: మంత్రి అంబటి
- డిజైన్ ప్రకారమే 45.72 మీటర్ల ఎత్తుతోనే పోలవరం నిర్మాణం
- 41.15 మీటర్లకు తగ్గించినట్లు నాదెండ్ల నిరూపించగలరా?
- టీడీపీ తానా అంటే.. వారాహి బ్యాచ్ తందానా



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలంతా 'జగనన్నే మా భవిష్యత్తు' అని నినదిస్తుంటే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అధికార దాహంతో రంకెలు వేస్తున్నారని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబుకు దరిద్రం పట్టుకోవడం నిజమేనని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అంబటి గురువారం మీడియాతో మాట్లాడారు.

సత్తా లేకనే చిందులు

2019 నుంచి ప్రతి ఎన్నికలోనూ ఘోర పరాజయం పాలవడంతో టీడీపీ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు చంద్రబాబు, లోకేశ్ ఆపసోపాలు పడుతున్నారు. రాష్ట్రంలో 175 స్థానాలకు ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా? అని అడుగుతుంటే మీకెందుకని చంద్రబాబు చిందులు తొక్కుతున్నారు. దీన్ని బట్టి సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కొనే సత్తా లేదని చంద్రబాబు ఒప్పుకున్నట్లు స్పష్టమవుతోంది. పవన్ కళ్యాణ్‌తోపాటు ఎంతమందిని పోగేసుకుని వచ్చినా సీఎం జగన్‌ను ఓడించడం చంద్రబాబు తరం కాదు.

బాబు సూచనతోనే పవన్ ఢిల్లీ యాత్ర..

చంద్రబాబు సూచనతోనే పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేలా చర్చించినట్లు ఆయన చెప్పారు. ఓ రాజకీయ పార్టీగా మీకు సిగ్గుగా లేదా? చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం కోసమే రాజకీయాలు చేస్తున్నప్పుడు బీజేపీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారు? చంద్రబాబుకు ఏం కావాలో అది పవన్ కళ్యాణ్ వద్ద ఉంది. పవన్‌కళ్యాణ్‌కి కావాల్సిన బరువు చంద్రబాబు వద్ద ఉంది. నాలుగు కాపు ఓట్లు చీల్చి చంద్రబాబుకి దక్కేలా చేయాలని తాపత్రయ పడుతున్నారు. ప్యాకేజీకి కక్కుర్తి పడి ఒక కులం మొత్తాన్ని తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ తానా అంటే తందానా అనడమే వారాహి బ్యాచ్‌కు తెలుసు.

పోలవరంపై చిత్తశుద్ధి మాదే..

పోలవరం ఎత్తును 41.15 మీటర్లుగా అంగీకరిస్తూ అధికారులు సంతకం చేశారంటూ నాదెండ్ల మనోహర్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. డిజైన్ ప్రకారం 45.72మీటర్ల ఎత్తుతోనే పోలవరాన్ని నిర్మిస్తున్నట్లు నాతో సహా శాసనసభలో సీఎం జగన్ అనేక సార్లు చెప్పిన విషయం తెలియదా? నాదెండ్ల మనోహర్ తన ఆరోపణలను రుజువు చేస్తే పవన్ కళ్యాణ్‌ను నేనే పోలవరం వద్దకు తీసుకెళ్తా. పోలవరంపై పవన్ కళ్యాణ్‌కి ఏమీ తెలియదు. ఆయనకు సర్వం అయిన మనోహర్‌కు తెలిసిందల్లా చంద్రబాబుతో మాట్లాడి ప్యాకేజీ ఇప్పించడమే. పోలవరం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కలల పంట. దాన్ని పూర్తి చేయడంలో మాకున్న ఆతృత, చిత్తశుద్ధి మరెవరికీ ఉండదు.

రాజ్యసభ | ఏపీ ఇన్ పార్లమెంట్

పర్యాటకం ద్వారా రూ.1.34 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: విదేశీ పర్యాటకుల ద్వారా 2022 సంవత్సరంలో దేశానికి రూ.1.34 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించిందని పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. 2021 సంవత్సరంలో రూ.65 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2022లో 60 లక్షల మంది విదేశీ పర్యాటకులు వచ్చారన్నారు. కోవిడ్ ప్రభావం తగ్గిన తర్వాత విదేశీ పర్యాటకం గణనీయంగా పుంజుకుంటోందని మంత్రి తెలిపారు. పర్యాటక మంత్రిత్వ శాఖ సిఫార్సుల మేరకు 59 టూరిజం రూట్లను వివిధ ఎయిర్‌లైన్స్‌కు కేటాయించామన్నారు. దేశంలో 55 ప్రాంతాల్లో జీ–20 సమావేశాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాల్లో పర్యాటకులకు మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కాగా, విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి సమాధానమిస్తూ.. ఈ–శ్రమ్ పోర్టల్‌లో 2023, మార్చి 27 నాటికి ఏపీ నుంచి 79,54,498 మంది అసంఘటిత రంగ కార్మికులు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరందరికీ మొదటి ఏడాది రూ.2 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కరోనా కారణంగా ఇన్సూరెన్స్ కవరేజ్ పొడిగించే ప్రతిపాదన ఏదీ లేదని, పోర్టల్‌లో నమోదు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ మొదటి సంవత్సరం మాత్రమే ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు.

రైతులకు కృషి మౌసమ్ సేవలు

గ్రామీణ కృషి మౌసమ్ సేవ (జీకేఎంఎస్)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతులు కూడా ఆగ్రోమెట్ సేవలు పొందుతున్నారని కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. కిసాన్ పోర్టల్, రిలయన్స్ ఫౌండేషన్, కిసాన్ సంచార్‌ల ద్వారా 49,33,685 మంది రైతులు ఎస్ఎంఎస్‌లు అందుకున్నారన్నారు.

574 రెసిడెన్షియల్ యూనిట్లు

ఏపీలో 647 కోర్టు హాళ్లతోపాటు 574 రెసిడెన్షియల్ యూనిట్లు ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తాన్‌రావు ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. న్యాయ మౌలిక వసతుల అభివృద్ధి నిమిత్తం కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 60:40 కేంద్ర, రాష్ట్ర వాటాగా ఉంటుందన్నారు.

కేంద్ర ప్యానెళ్లలో మహిళా న్యాయవాదులు

కోర్టులు, ట్రిబ్యునళ్ల ముందు హాజరుకావడానికి కేంద్ర ప్రభుత్వం న్యాయవాదులను ఎంప్యానెల్ చేసుకుంటుందని న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ ఎఫైర్స్‌లో 411, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూలో 36, కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖలో 21 మంది మహిళా న్యాయవాదులు ఎంప్యానెల్ అయ్యారని చెప్పారు.

ఏపీలో 598 ఈ-కోర్టులు

ఆంధ్రప్రదేశ్‌లో 598 ఈ–కోర్టులు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

10 నుంచి సదరం స్లాట్ బుకింగ్‌లు

- ఏప్రిల్, మే, జూన్ నెలలకు అందుబాటులో..
- గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం



సాక్షి, అమరావతి : సదరం సర్టిఫికెట్లు పొందేందుకు స్లాట్ బుకింగ్‌లు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్, మే, జూన్ నెలలకు స్లాట్‌లు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో 171 ప్రభుత్వాస్పత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి శాశ్వత ధ్రువీకరణ పత్రాలిస్తారు. గతంలో ఏ జిల్లాకు చెందినవారు ఆ జిల్లాలోని ఆస్పత్రుల్లోనే స్లాట్ బుక్ చేసుకుని స్క్రీనింగ్‌కు హాజరుకావాల్సి ఉండేది. ఈ క్రమంలో విద్య, ఉపాధి, కుటుంబ అవసరాల నిమిత్తం సొంత జిల్లాలను విడిచి వేరే జిల్లాల్లో నివసించేవారు సదరం సర్టిఫికెట్ పొందేందుకు సొంత జిల్లాకు వెళ్లాల్సి వచ్చేది. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్న ప్రక్రియ. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలోని ఏ జిల్లాలో అయినా సదరం స్క్రీనింగ్‌కు హాజరై సర్టిఫికెట్ పొందేందుకు ప్రభుత్వం గతేడాది జూలై నుంచి అవకాశం కల్పించింది.

బండి సంజయ్‌కు బెయిల్

తెలంగాణ

నేడు విడుదలయ్యే అవకాశం

సాక్షి ప్రతినిధి, వరంగల్: పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ కేసులో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కు హనుమకొండ నాలుగో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం రాత్రి బెయిల్ మంజూరు చేసింది. సంజయ్ తరఫు న్యాయవాదులు వేసిన బెయిల్ పిటిషన్‌పై గురువారం సుదీర్ఘంగా విచారణ సాగింది. పలుమార్లు వాయిదాలతో సుమారు 8 గంటలపాటు జరిగిన వాదోపవాదాల అనంతరం రాత్రి 10 గంటల సమయంలో జడ్జి రాపోలు అనిత బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. రూ.20 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. దేశం విడిచి వెళ్లకూడదని, కేసు విచారణ నిమిత్తం ప్రాసిక్యూషన్‌కు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని, సాక్ష్యాలను చెరిపివేయకూడదని షరతులు విధించారు. బెయిల్ ప్రక్రియ పూర్తయ్యేసరికి గురువారం రాత్రి కావడంతో బండి సంజయ్ శుక్రవారం ఉదయం కరీంనగర్ జైలు నుంచి విడుదల కానున్నారు. మరోవైపు తదుపరి విచారణ నిమిత్తం సంజయ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల పిటిషన్‌పై తీర్పును కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కాగా, బండి సంజయ్ బెయిల్ పత్రాలు ఇంకా తమకు అందలేదని కరీంనగర్ జైల్ సూపరిటెండెంట్ సమ్మయ్య చెప్పారు. శుక్రవారం ఉదయం బెయిల్ పేపర్లు అందే అవకాశాలు ఉన్నాయని, రాగానే విడుదల చేస్తామని చెప్పారు.

శుభ శుక్రవారం పండుగ కాదు. పరీక్షించుకొని యేసు శుద్ధ రక్తంతో కడుగుకొని, కృతజ్ఞతతో పరివర్తన పొంది, నూతన శక్తిని పొందే దినం.

నేడు గుడ్ ఫ్రైడే



పడియున్న జనులను పైకి లేపు సిలువ

యెరూషలేము వీధులలో భారమైన కొయ్య సిలువ మోసుకొనుచు, కల్వరి వైపు అప్పటికే కొరడా దెబ్బలతో రక్తపు గాయాలతో నడవలేక నడుచుచున్న ఈయన ఎవరు? ఈయన మానవ పాపభారం మోయు యేసుక్రీస్తు అను రబ్బూనీ. తనను చూచి ఆశ్చర్యంతో గమనించు జన సమూహం, ఏడ్చుచున్న స్త్రీలను ప్రభువు చూచి ఇట్లనెను ''యెరూషలేము కుమార్తెలారా, నా నిమిత్తము ఏడ్వకుడి; మీ నిమిత్తమును మీ పిల్లల నిమిత్తమును ఏడ్వుడి'' (లూకా 23:28). కన్నీటి ప్రార్థన తప్పక జవాబునిచ్చును. శుభ శుక్రవారం, నేరములు రుజువు కాక పోయినను జనుల, అలనాటి నాయకుల అసూయ, ఒత్తిడిచే, పిలాతు అను గవర్నర్ యేసును సిలువ వేయుటకు అప్పగించెను.

యేసు పాపులను రక్షించుటకే మరణించెను. మనుష్య కుమారుడు సిలువ వేయుటకై కొనిపోబడును. (మత్తయి 26:2) మూడోదినమున లేచుట అగత్యమని చెప్పెను. (మత్తయి 16:21). నరావతారుడైన దేవుడు, పతనమైన నరుని పైకెత్తుటకు సిలువ కొయ్యపై మూడు మేకులతో వ్రేలాడుచు కల్వరి కొండపై అందరూ చూచునట్లు సిలువ శిక్షను పొందెను. తుదకు బల్లెంతో ప్రభువును పొడిచినప్పుడు రక్తం, నీళ్ల కారుట యోహాను అను శిష్యుడు చూచెను. సిలువ ఒక గొప్ప మర్మము. పాప రహితుడు పాప శిక్ష భరించెను. యేసు ఇట్లనెను– నేను భూమి మీద నుండి పైకెత్తబడిన ఎడల అందరినీ నా యొద్దకు ఆకర్షించుకొందును (యోహాను 12:32). అందులకే కోట్లాదిమంది యేసును ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించుచున్నారు. సురూపము, సొగసులేని ఈ కరుణామయుని ప్రేమ లోకమును ఆకర్షించి – రక్షణ, స్వస్థత, శాంతి, పరలోక భాగ్యము ఇచ్చుచున్నది. ఆ దినమే మంచి శుక్రవారం, మానవాళిని మంచిగా చేసి, మంచిని పంచే వ్యక్తులుగా సిలువపై యేసు చేయును.

నికోదేముతో యేసు ''అరణ్యంలో మోషే సర్పమును ఎలాగు ఎత్తెనో అలాగే విశ్వసించు ప్రతివాడు నశింపక ఆయన ద్వారా నిత్య జీవము పొందునట్లు మనుష్య కుమారుడు ఎత్తబడవలెను'' అనెను. (యోహాను 3:14) (సంఖ్యా 21:28). సిలువపై యేసు కుడి ఎడమల బందిపోటు దొంగలు, అందులో ఒకడు తన పాపముల కొరకు పశ్చాత్తాపపడగా యేసు ''నీవు నాతో కూడా పరదైసులో ఉందువు అని పాపిని పరలోకానికి లేవనెత్తెను''.

'సర్వ పాప పరిహారోం – రక్త ప్రోక్షణ అవశ్యం. తద్ రక్తం పరమాత్మేవ – పుణ్యదాన బలియాగం'' అని సామవేదం చెబుతున్నది. బైబిల్ సహితం రక్తము చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. (హెబ్రీ 9:21). 1యోహాను 1:7,9 ప్రకారము పాపములు ఒప్పుకొని యేసు చిందించిన నిర్దోష, ప్రశస్త రక్తాన్ని నమ్మితే జన్మ, కర్మ పాపములకు విముక్తి అని బైబిల్ తెలుపుచున్నది. యేసుకు శిక్ష మానవునికి రక్ష. క్లోరోఫామ్ కనుగొన్న సిమ్సన్ ఇలాగు అన్నాడు. నేను పాపిని, క్రీస్తు నా కొరకు మరణించెను అనినచో అప్పుడు పరలోకముకు వెళ్లే టికెట్ దొరుకును.

యేసు సిలువ మరణం పాప బానిసత్వానికి స్వస్తి, దైవ రాజ్యానికి హక్కు. యెషయా ప్రవక్త 700 సంవత్సరముల క్రితం ఇట్లు ప్రవచించెను.''మన అతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను, మన దోషములను బట్టి ఆయన నలుగగొట్టబడెను, మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను, అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది''. (యెషయా 53:5) యేసు సిలువ... పాపాలకు, దురలవాట్లకు, దుర్లాభములకు, రోగములకు సమాధి.

పాపంలో, గర్వంలో, మరణంలో, వ్యాధి బాధలతో, ఆర్థిక కృంగుబాటులో, యుద్ధములు, తెగుళ్లు భయములతో, సమాధానం లేని చిక్కు సమస్యలతో, నిస్పృహతో నిండిన మానవుని యేసు ప్రభువు గాయపరచబడిన తన చేతులతో తండ్రి వలె ప్రేమగా పైకెత్తి తనతో నివసింప చేసే దినమే గుడ్ ఫ్రైడే.

వివేకానందుడు సూడార్ 2, 372 పేజీలో 'సిలువపై వ్రేలాడు మానవుని ఆలోచించు, తనను సిలువ వేసిన వారిని కృపతో క్షమించి సర్వ గర్వముల అవమానం భరించెను. ఆయన స్తుతి పాత్రుడు. పాపములు భరించి, మోసి – ప్రయాసపడు సమస్త జనులారా నా యొద్దకు రండి అని (మత్తయి 11:28) చెప్పెను. 6 గంటలు సిలువ పైకెత్తబడి, వేలాడతీయబడిన యేసు ప్రేమతో ఆ బాధ, వేదనలో ఏడు మాటలు పలికెను.

అవి 1. క్షమాపణ 2. రక్షణ 3. ఆదరణ 4. ఆవేదన 5. శ్రమ 6. జయము 7. ఆత్మార్పణ, ఇవి జీవిత సార్థకతను సూచించుచున్నవి. (లూకా 23:34; 43) (యోహాను 19:26,27) (మత్తయి 27:46) (యోహాను 19:28) (యోహాను 19:30) (లూకా 23:46). ఇవి యేసుప్రభు కొండ మీద ప్రసంగించిన సూక్తుల వలె కలవరి కొండ సిలువ ప్రసంగములు. వీటి సారాంశం గ్రహించి, వీటిని అనుసరించినట్లయితే భూలోకమే పరలోక మగును.

తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును (లూకా 18:14). ఇది యేసు ప్రభు బోధించిన విధానం. ఎన్ని అద్భుతాలు చేసినను తగ్గించుకొని మాదిరి చూపే ముక్తి మార్గము యేసు వేసెను.

తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును (లూకా 18:14). ఇది యేసు ప్రభు బోధించిన విధానం.

అందుకే 2000 సంవత్సరముల క్రితం సిలువ వేయబడినను, సమాధి చేయబడి, తిరిగి బతికెను. అందులకే యేసు నామము ఉన్నత నామము, లోకానికి ఆదరణ, ఆదర్శ, దురాత్మలపై జయము కలుగజేసి, మోక్షమిచ్చే నామం.

మిసిసిపి నది బ్రిడ్జిపై – యేసు శిలువలో వ్రేలాడుతూ మూడు సిలువలు చిత్రించబడి ఆ క్రింద ఇలాగు రాయబడినది. ''ఇప్పుడు నీ నిర్ణయం!'' పక్కన వెళ్లే ప్రజానీకానికి అద్భుతమైన మనస్సాక్షిని ప్రేరేపించి నిర్ణయం తీసుకునే మాట. బలవంతం లేదు. ఆలోచించి దేవుడే దీనుడై, తన ప్రేమను వెల్లడి పరిచిన తరువాత పాపంలో, గర్వంలో, మరణంలో, వ్యాధి బాధలతో, ఆర్థిక కృంగుబాటులో, యుద్ధములు, తెగుళ్లు భయములతో, సమాధానం లేని చిక్కు సమస్యలతో, నిస్పృహతో నిండిన మానవుని యేసు ప్రభువు గాయపరచబడిన తన చేతులతో తండ్రి వలె ప్రేమతో పైకెత్తి తనతో నివసింప చేసే దినమే గుడ్ ఫ్రైడే. శుభ శుక్రవారం పండుగ కాదు. యేసు శుద్ధ రక్తంతో కడుగుకొని, కృతజ్ఞతతో పరివర్తన పొంది, నూతన శక్తి పొందే దినం. శ్రమలలో కూడా త్యాగముతో, ఏ భేదము లేక తోటి మానవుని పడద్రోయక, బాధపెట్టక, పైకెత్తి ఆదరించి ప్రోత్సాహపరిచే స్ఫూర్తినిచ్చు సిలువ దృశ్యం – ఇదే నిజమైన శుభ శుక్రవారం.

– తంటిపూడి ప్రభాకర రావు
ఎల్. ఇ.ఎఫ్ చర్చి, మచిలీపట్నం

ఫ్యాషన్

స్మార్ట్ ఫ్రాక్స్

వేసవి చాలా వరకు హాయిగొలిపే స్టైల్స్‌ని పరిచయం చేస్తుంటుంది. సౌకర్యంగా ఉన్న డ్రెస్సులనే మన ముందుకు తీసుకువస్తుంది. అందుకు తగినట్టుగానే మనవైన చేనేతలు ఎప్పుడూ కొత్తగా మెరిసిపోతూనే ఉంటాయి. కాటన్‌తో కంఫర్టబుల్‌గా ఉండే ఈ షార్ట్ ఫ్రాక్ డిజైన్స్‌ని ఒక బాటమ్ ఎంపికతో కుర్తీలుగానూ ఉపయోగించుకోవచ్చు.







కొత్తవే అయినా ఉపయోగించని దుపట్టాలు, చీరలు ప్రతి ఇంట్లో ఎన్నో కొన్ని తప్పక ఉంటాయి. వాటిని రీయూజ్ చేసుకుంటే ఈ వేసవి మరింత ఆహ్లాదంగా మారిపోతుంది. మంగళగిరి, ఇక్కత్, నారాయణ్‌పేట్, ఉప్పాద.. వంటి చేనేతల గురించి మనకు తెలిసినదే. వాటితో ఇలా షార్ట్ ఫ్రాక్స్‌గా డిజైన్ చేసుకోవచ్చు. ఇవి మేనికి సౌకర్యంగా ఉండటమే కాదు సమ్మర్ స్టైల్ జాబితాలో మొదటి స్థానంలో నిలుస్తాయి. యంగ్‌స్టర్స్‌కి ఆలోచనలకు తగినట్టూ అందంగానూ ఉంటాయి. అందుకు ఇంట్లో ఉన్న చేనేత దుప్పట్లు, చీరలనూ ఉపయోగించుకోవచ్చు. లేదంటే, మార్కెట్‌లో లభించే వాటినీ ఎంపిక చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫ్యాషనబుల్‌గా కనిపించవచ్చు.









వంటిల్లు

ఇంటి హలీమ్

రంజాన్ మాసం వచ్చేసింది... సగం మాసం పూర్తయింది కూడా. రోడ్డు మీదకు వెళ్తే హలీమ్ బోర్డులు ఆహ్వానిస్తున్నాయి. హలీమ్ రుచి నోరూరిస్తోంది. బలవర్ధకమైన ఆహారాన్ని పిల్లలకు అలవాటు చేయడం మంచిదే. అయితే తరచూ బయట తెచ్చుకోవడం ఎందుకు? ప్రయత్నించాలనే ఆసక్తి ఉంటే... అంత శ్రమించే శక్తి ఉంటే మన 'వంటిల్లు' కూడా హలీమ్‌కు వేదికవుతుంది.

చికెన్ హలీమ్



కావలసినవి

చికెన్ – అర కేజీ (బోన్‌లెస్); నెయ్యి – 4 టేబుల్ స్పూన్‌లు; జీడిపప్పు – అర కప్పు; బాదం – పావు కప్పు; పిస్తా– 15; దాల్చిన చెక్క – రెండు అంగుళాల ముక్క; యాలకులు – 4; నల్ల యాలకులు – 2; లవంగాలు – 5; మిరియాల పొడి – టీ స్పూన్; పత్తర్ ఫూల్ – టీ స్పూన్; షాజీరా – టీ స్పూన్; తోక మిరియాలు – టీ స్పూన్ (కెబాబ్ చీనీ); ఉల్లిపాయ ముక్కలు – కప్పు; పచ్చిమిర్చి– 6; అల్లంవెల్లుల్లి పేస్ట్ – 2 టేబుల్ స్పూన్‌లు; పసుపు – పావు టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; వేయించిన జీలకర్ర పొడి– టీ స్పూన్; పెరుగు– అర కప్పు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – ముప్పావు లీటరు.

డ్రైఫ్రూట్స్ పేస్ట్ కోసం...

వేయించిన జీడిపప్పు– గుప్పెడు; వేయించిన బాదం – గుప్పెడు; వేయించిన పిస్తా– అర గుప్పెడు; పెరుగు – అర కప్పు.

నానబెట్టాల్సిన ధాన్యాలు

గోధుమ రవ్వ – అర కప్పు (లావు రవ్వ); పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; కందిపప్పు – టీ స్పూన్; ఓట్స్ లేదా బార్లీ – రెండు టేబుల్ స్పూన్‌లు; పెసర పప్పు – టీ స్పూన్; బియ్యం– టేబుల్ స్పూన్; మినప్పప్పు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్.

హలీమ్ గార్నిష్ చేయడానికి...

పాలు – పావు కప్పు; ఎండిన గులాబీ రేకులు – 2 టేబుల్ స్పూన్‌లు; పుదీన తరుగు – పావు కప్పు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; గరం మసాలా – ఒకటిన్నర టేబుల్ స్పూన్‌లు; నెయ్యి– అర కప్పు; నేతిలో వేయించిన ఉల్లిపాయ ముక్కలు– కప్పు; నిమ్మకాయ ముక్కలు – పది;

తయారీ:

- గోధుమ రవ్వ మినహా నానబెట్టిన ధాన్యాలన్నింటినీ ఒక పాత్రలో వేసి కడిగి నిండుగా నీటిని పోసి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. గోధుమ రవ్వను విడిగా తడిపి పెట్టుకోవాలి. నాలుగు గంటల తర్వాత నీటిని వడపోసి రవ్వతోపాటు ధాన్యాలన్నింటినీ కలిపి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి.
- చికెన్‌ను శుభ్రంగా కడిగి ఉప్పు నీటిలో అరగంట సేపు నానబెట్టాలి.
- ప్రెషర్ పాన్‌లో టేబుల్ స్పూన్ నెయ్యి వేడి చేసి జీడిపప్పు, బాదం, పిస్తాలను దోరగా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి.
- అదే పెనంలో లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు, మిరియాలు వేసి అవి వేగిన తరవాత ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి అప్పుడు ఉప్పు నీటిలో నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కొద్దిసేపు వేగనివ్వాలి. ముక్కలు రంగు మారి తెల్లగా వచ్చిన తరవాత అందులో పచ్చిమిర్చి, ఉప్పు, పసుపుతోపాటు ధనియాల పొడి, మిరప్పొడి వంటి మసాలా దినుసులు పుదీన, కొత్తిమీర తరుగు, పెరుగు వేసి కలిపి రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. ఇప్పుడు ఒక కప్పు నీటిని పోసి మూత పెట్టి ఐదారు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- కుక్కర్ వేడి తగ్గిన తరవాత పప్పు గుత్తితో మెత్తగా మెదపాలి.
- డ్రై ఫ్రూట్స్ పేస్ట్ కోసం తీసుకున్న జీడిపప్పు, బాదం, పిస్తా, పెరుగు కలిపి మిక్సీలో మెత్తగా పేస్ట్ చేయాలి.
- ఒక మందపాటి పాత్రలో రెండు టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేడి చేసి అందులో పప్పులను గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని వేసి, కొద్దిగా నీటిని పోసి అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. బుడగలు రావడం మొదలైన తర్వాత మెదిపిన చికెన్ మిశ్రమాన్ని వేసి పప్పు గుత్తితో మెదుపుతూ ఉడికించాలి. పదిహేను నిమిషాల తర్వాత డ్రై ఫ్రూట్ పేస్ట్ వేసి కలిపి ఉడకనివ్వాలి. అరగంట తర్వాత గరం మసాలా దినుసులు, నాలుగు టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేసి కలిపి సన్నమంట మీద ఉడకనివ్వాలి. మరో పదిహేను నిమిషాల తర్వాత సగం కప్పు ఎర్రగా వేయించిన ఉల్లిపాయ ముక్కలు, పుదీన, కొత్తిమీర తరుగు, ఎండిన గులాబీ రేకులు, పాలు, రెండు టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేసి కలిపితే హలీమ్ రెడీ. పప్పు దినుసుల పేస్ట్‌లో మెదిపిన చికెన్ మిశ్రమం వేసిన తర్వాత దాదాపు ఓ గంట సేపు ఉడకాలన్నమాట.

వడ్డించేటప్పుడు కప్పులో హలీమ్ వేసి పైన వేయించిన జీడిపప్పు, బాదం, పిస్తా, ఉల్లిపాయ ముక్కలు, నెయ్యి, నిమ్మకాయ ముక్క వేయాలి.



మటన్ హలీమ్ కూడా ఇంట్లో ప్రయత్నించవచ్చు. అయితే చికెన్ కంటే ఎక్కువ సేపు ఉడికించాల్సి ఉంటుంది.

వెజ్ హలీమ్



కావలసినవి

ఉల్లిపాయ ముక్కలు – కప్పు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పాలు – కప్పు;అల్లం వెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్; ఎండిన గులాబీరేకులు– పావు కప్పు; పచ్చి మిర్చి – 5; నెయ్యి – 2టేబుల్ స్పూన్‌లు; గోధుమ రవ్వ – అర కప్పు (లావు రవ్వ); ఓట్స్ లేదా బార్లీ – పావు కప్పు; బాదం – 6; శనగపప్పు – టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; ఎర్ర కందిపప్పు – టీ స్పూన్; పెసర పప్పు – టీ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; షాజీరా– అర టీ స్పూన్; లవంగాలు – 2; మిరియాలు – టీ స్పూన్; దాల్చిన చెక్క – రెండంగుళాల ముక్క; యాలకులు – 8; జీలకర్ర– టీ స్పూన్; తోక మిరియాలు – అర టీ స్పూన్; పెరుగు – అరకప్పు; కొత్తిమీర తరుగు– టేబుల్ స్పూన్; పుదీన తరుగు– టేబుల్ స్పూన్; జీడిపప్పు – 20 గ్రా; పిస్తా– 20 గ్రా ; బాదం – 20 గ్రా; సోయా బీన్ నగెట్స్ (మీల్ మేకర్)– 100 గ్రా; నిమ్మరసం – టీ స్పూన్; నిమ్మకాయ ముక్కలు – 10.

తయారీ

- మీల్‌మేకర్ ని శుభ్రంగా కడిగి ఉడికించి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. మరీ మెత్తగా చేయరాదు, కొంచెం బరకగా ఉండాలి.
- తోక మిరియాలు, షాజీరా, యాలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, జీలకర్ర, పెసర పప్పు, మినప్పప్పు, ఎర్ర కందిపప్పు, శనగపప్పు, బాదం, ఓట్స్, గోధుమ రవ్వలను ఒక పాత్రలో వేసి బాగా కలిపి మిక్సీ లో పొడి చేయాలి.
- మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి అందులో పెరుగు, పాలు, గులాబీరేకులు, కొత్తిమీర తరుగు, పుదీన తరుగు, ఉప్పు వేసి లీటరు నీరు పోయాలి. నీరు వేడెక్కే లోపు అందులో మసాలాలు, పప్పులతో చేసిన పొడిని వేసి ఉండలు లేకుండా కలిపి సన్న మంట మీద పదిహేను నిమిషాల పాటు ఉడికించాలి. పొడి పిండి ఉండలు కట్టకుండా ఉండాలంటే... ముందుగా పొడిలో చన్నీటిని పోసి కలుపుకుని అప్పుడు స్టవ్ మీదున్న నీటిలో పోయవచ్చు.
- ప్రెషర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు సగం వేసి ఎర్రగా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో జీడిపప్పు, పిస్తా, బాదం దోరగా వేయించి, అందులో మిగిలిన ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేగిన తరవాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి వేసి మగ్గనివ్వాలి. ఇప్పుడు సోయాబీన్స్ నగెట్స్ (మీల్‌మేకర్) పేస్ట్ వేసి బాగా కలిపి మూత పెట్టి దాదాపుగా పదిహేను నిమిషాల పాటు మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- వేడి తగ్గిన తరవాత మూత తీసి పప్పుగుత్తితో ఒకసారి అంతా సమంగా కలిసేటట్లు మెదిపి ఉప్పు చూసి అవసరమైతే కొంత కలుపుకుని, నిమ్మరసం కలిపితే వెజ్ హలీమ్ రెడీ.
- సర్వ్ చేయడానికి కప్పులోకి తీసుకున్న తర్వాత కొద్దిగా ఉల్లిపాయ ముక్కలు, నిమ్మకాయ ముక్క ఒకటి పెట్టాలి. ఇష్టమైతే కొత్తిమీర తరుగు కూడా కలుపుకోవచ్చు.

కిచెన్ టిప్




పచ్చళ్లను నిలవ చేసే గాజు సీసాలు, జాడీలను కొంచెంసేపు ఎండలో పెట్టాలి. అలా చేయడం వల్ల అందులో నీళ్లన్నీ ఎండిపోయి పచ్చళ్ళు బూజు పట్టకుండా ఎక్కువ కాలం నిలవ ఉంటాయి.

స్వరరాగ మధుర తరంగాలు

● సక్సెస్ స్టార్

విజయేష్



అప్పటికింకా జయేష్ వయసు పదమూడే. అయితే మాత్రం ఏమిటీ ఆ వయసులోనే ఫస్ట్ టెక్ బిజినెస్‌కు శ్రీకారం చుట్టాడు.'ఎంహెచ్‌ఎం' పేరుతో గేమింగ్ సర్వర్ పోర్టల్ ప్రొవైడర్‌ను ప్రారంభించాడు ముంబైకి చెందిన జయేష్ గడేవర్. దీనికి కాస్తో కూస్తో లాభాలు వచ్చినా సూపర్ ప్రాఫిట్ మాత్రం రాలేదు.

ఇక కాలేజీ రోజుల్లో స్నేహితులతో కలిసి ఒక మారథాన్ కోసం వృద్ధులకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ తయారు చేశాడు జయేష్. ఇంట్లో వృద్ధులు పడిపోయినప్పుడుగానీ. ఇతరత్రా ప్రమాదాలు జరిగినప్పుడుగానీ సంబంధిత వ్యక్తులను ఈ సాఫ్ట్‌వేర్ ఎలార్ట్ చేస్తుంది.

'ముంబై యూనివర్శిటీ'లో ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత ఆయుష్ ఘోష్, కుష్ కౌశిక్‌లతో కలిసి 'క్రుట్ ఆటోమేషన్' అనే స్టార్టప్ మొదలుపెట్టాడు. ప్రాథమిక దశ, గ్రోత్–స్టేజ్‌లలో ఉన్న స్టార్టప్‌లకు సంబంధించి భద్రతాపరమైన కోణాలలో సహాయం అందించే 'క్రుట్ ఆటోమేషన్' విదేశాలకు కూడా విస్తరించింది.

24 సంవత్సరాల జయేష్ గడేవర్ పేరు పక్కన కో–ఫౌండర్ అండ్ సీటీవో, క్రుట్ ఆటోమేషన్ అనే అక్షరాలు ఘనంగా కనిపిస్తాయి. చదవడం, తెలుసుకోవడం, కొత్తగా ఆలోచించడం, ప్రయోగాలు చేయడం...అనేవి జయేష్ దైనందిన జీవితంలో భాగం అయ్యాయి. అందుకే విజయాలు అతడికి ఆత్మీయంగా దగ్గరయ్యాయి.

● గేమింగ్



వర్చువల్ రియాలిటీ బాక్సింగ్ వీడియోగేమ్ 'క్రీడ్ రైజ్ టు గ్లోరీ' రెండు రోజుల క్రితం విడుదలైంది. రాకీ ఫ్రాంచైజీ నుంచి వచ్చిన గేమ్ ఇది. లీడింగ్ వర్చువల్ రియాలిటీ స్టూడియో సర్వైవ్స్ నిర్మించిన ఈ ఛాంపియన్‌షిప్ ఎడిషన్‌లో కొత్త క్యారెక్టర్లు, లొకేషన్స్, కాస్ట్యూమ్స్ ఉంటాయి. సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. ఈసారి ప్లేయర్స్ హెవీ వెయిట్ ఛాంపియన్ అపోలో క్రీడ్ కుమారుడు ఎడోనిస్ క్రీడ్ రోల్‌లో ఆడాల్సి ఉంటుంది.

● 4కె/హెచ్‌డీఆర్ సపోర్ట్ ● అడ్వాన్స్‌డ్ కంట్రోలర్ ట్రాకింగ్ ● జానర్: ఫైటింగ్ ● మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్ ● ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ వీఆర్, ప్లేస్టేషన్ వీఆర్2



బిగ్గర్ ఫిష్ టు ఫ్రై

ఇంతకంటే ఆసక్తికరమైన విషయం ఉంది. ఇంతకంటే ముఖ్యమైన విషయం ఉంది. ఇంతకంటే మంచి అవకాశం ఉంది. ఇంతకంటే తీవ్రమైన సమస్య ఉంది...ఇలాంటి సందర్భాల్లో ఉపయోగించే ఇడియమ్ హ్యావ్ బిగ్గర్ ఫిష్ టు ఫ్రై. ఉదా: ఐ కాన్ట్ స్పెండ్ ఏ లాట్ ఆఫ్ టైమ్ ఆన్ ది ప్రాబ్లమ్. ఐ హ్యావ్ బిగ్గర్ ఫిష్ టు ఫ్రై.

రాక్ ది బోట్

సజావుగా జరుగుతున్న పనిని చెడగొట్టే ప్రయత్నం జరిగినప్పుడు. ఆశాజనకంగా సాగుతున్న చర్చలు ఫలప్రదం కాకుండా చేస్తున్నప్పుడు. ఐక్యతకు భంగం వాటిల్లే పరిస్థితి ఎవరైనా సృష్టించినప్పుడు...ఇలాంటి సందర్భాల్లో వార్నింగ్‌గా ఉపయోగించే ఇడియమ్ రాక్ ది బోట్. ఉదా: డోన్ట్ రాక్ ది బోట్ అన్‌టిల్ ది నెగోషియన్స్ ఆర్ ఫినిష్‌డ్.



● విన్నర్స్‌తో ఏఆర్ రెహమాన్

● మ్యూజిక్ వరల్డ్

'సాధన చేయుమురా నరుడా.... సాధ్యం కానిది లేదురా!' అన్నది పెద్దల మాట ఇంగ్లీష్ పాట విషయంలో కూడా ఆ విలువైన మాటను గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది. విదేశాల్లో పుట్టిన వారు, ప్రవాసభారతీయులు మాత్రమే ఇంగ్లీష్ పాటను బాగా పాడగలరా? 'సాధన చేస్తే ఎవరైనా పాడగలరు' అని నిరూపించింది నెక్సా మ్యూజిక్ ల్యాబ్...

గోవాలో జరిగిన మ్యూజిక్ ఫెస్టివల్‌లో యువగళాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. 'ఎవరు వీరు?' అని ఆరా తీసేలా చేశాయి. దేశంలోని వివిధ ప్రాంతాలు, భిన్నమైన సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన వారు, 'ఒక్క ఛాన్స్ ప్లీజ్' అని స్టూడియోలు, స్టేజీల చుట్టూ చక్కర్లు కొట్టిన గాయకులు కూడా ఇందులో ఉన్నారు. అలాంటి వారు తమ టాలెంట్‌ను ఈ మ్యూజిక్ ఫెస్టివల్‌లో ప్రదర్శించే అవకాశం రావడానికి ప్రధాన కారణం నెక్సా మ్యూజిక్ ల్యాబ్.

నేషనల్‌వైడ్ టాలెంట్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ 'నెక్సా మ్యూజిక్ ల్యాబ్' మారుమూల ప్రాంతాల నుంచి మహా పట్టణాల వరకు మట్టిలో మాణిక్యాలను బయటకు తీసుకువచ్చి అంతర్జాతీయ స్థాయిలో మెరిపిస్తోంది.

ఈ పోటీలో పాల్గొనదలచినవారు మూడు నిమిషాల నిడివి ఉన్న ఒరిజినల్ ఇంగ్లీష్ మ్యూజిక్ కంపోజిషన్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పాప్, జాజ్, ఫ్యూజన్...మ్యూజిక్ జానర్ ఏదైనా పరవాలేదు. దీంతో పాటు నెక్సా మ్యూజిక్ ఆడిషన్స్‌లో కూడా పాల్గొనవలసి ఉంటుంది.

ఎంట్రీలకు మినీమం ఏజ్ లిమిట్...పద్దెనిమిది సంవత్సరాలు.

సబ్మిట్ చేసిన ఎంట్రీలు నియమ, నిబంధనలకు తగినట్లుగా లేకపోతే నెక్సా గ్యాలరీలో కనిపించవు. అయినా నిరాశ చెందనక్కర్లేదు. తప్పులు సవరించుకొని ఫ్రెష్‌గా పంపవచ్చు. వ్యక్తిగత స్థాయిలోనూ, మ్యూజిక్ బ్యాండ్‌లో ఒకరిగా కూడా పాల్గొనవచ్చు.

ఏఆర్ రెహమాన్ నేతృత్వంలోని జ్యూరీ 24 మందిని ఎంపిక చేస్తుంది. వీరికి నెక్సా మ్యూజిక్ సీజన్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ ఇరవైనాలుగు మంది నుంచి ఫైనల్‌గా నలుగురిని ఎంపిక చేసి, వారి చేత పాడించిన ఆల్బమ్‌లను అంతర్జాతీయంగా విడుదల చేస్తారు.

దిల్లీకి చెందిన నిశా నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన యువ మ్యూజిక్ బ్యాండ్ 'హీట్ సింక్' వరకు ఎంతోమందిలో కొత్త వెలుగు తీసుకువచ్చింది నెక్సా మ్యూజిక్ ల్యాబ్.

బహుముఖ ప్రతిభ



నెక్సా సీజన్ 1 విజేతగా నిలిచిన దిల్లీకి చెందిన నిశా శెట్టి సింగర్, సాంగ్‌రైటర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తోంది. చిన్నప్పటి నుంచి నాటకాలు, వాటికి సంబంధించిన వర్క్‌షాప్‌లను చూస్తూ పెరిగింది. కథక్, కూచిపూడి, హిందుస్థానీ శాస్త్రీయసంగీతం నేర్చుకుంది. చిన్న చిన్న షోలలో పాల్గొనే నిశాకు 'నెక్సా మ్యూజిక్ ల్యాబ్' టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చింది.

'ఎంపికైన విజేతలలో మీరు ఒకరు' అంటూ నిర్వాహకుల నుంచి వచ్చిన మెయిల్ నేహాకు ఎప్పుడూ గుర్తుండే తియ్యటి జ్ఞాపకం.

'కలలు కనడం వరకు మాత్రమే పరిమితం కాకూడదు. కల సాకారం చేసుకునే శక్తి కోసం ఎక్కడెక్కడో వెదకనక్కర్లేదు. అది మన దగ్గరే ఉంది' అంటుంది నిశా శెట్టి.

● అవును...ఇది నిజమే!



▸ ప్రాచీన రోమన్ క్యాలెండర్‌లో 'ఏప్రిల్' అనేది రెండో నెల. 'ఏపిరైర్' అనే లాటిన్ పదం నుంచి 'ఏప్రిల్' వచ్చింది. దీని అర్థం తెరుచుకోవడం. ఏప్రిల్ నెలలో పూలు వికసిస్తాయి కాబట్టి ఆ పేరు వచ్చింది అనే వాదన ఉంది. ప్రాచీన రోమన్ క్యాలెండర్‌లో 'మార్చ్' మొదటి నెల. ఏప్రిల్ అనేది 'ఆఫ్రా' అనే పదం నుంచి వచ్చింది అని కొందరి నమ్మకం. 'ఆఫ్రొడైటీ' అనే గ్రీకు దేవత నుంచి వచ్చిన పదం ఇది. అందం, ప్రేమకు ఈ దేవత ప్రతీక. ప్రేమ ప్రతిపాదనకు ఈ నెల సరియైనదని నమ్మేవారు.

▸ స్వచ్ఛమైన గాలి, సహజకాంతి తగిలితే ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటాయని, ఆరోగ్యం బాగుంటుందనే ఉద్దేశంతో ఓపెన్–ఎయిర్ స్కూల్స్ ప్రారంభమయ్యాయి. వీటికి 'ఫారెస్ట్ స్కూల్' అనేది మార్గదర్శిగా నిలిచింది. జర్మన్ వైద్యుడు జాకబ్ బెర్న్‌హార్డ్ బెనడిక్స్ 1904లో బెర్లిన్‌కు సమీపంలోని అడవిలో ఫారెస్ట్ స్కూల్ ప్రారంభించాడు. ఆ తరువాత జర్మనిలో ఇదొక ట్రెండ్‌గా మారి యూరప్, నార్త్ అమెరికాలకు విస్తరించింది.

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఎ54 5జీ



డిస్‌ప్లే: 6.40 అంగుళాలు
రిజల్యూషన్: 1080X2340 పిక్సెల్స్ :
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ :
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్

ప్రొఫైల్ పిక్చర్ హైడ్ చేయడానికి...

వాట్సప్‌లో వద్దనుకున్న కాంటాక్ట్స్ నుంచి ప్రొఫైల్ పిక్చర్‌ను హైడ్ చేయడానికి...

1. వాట్సప్ ఓపెన్ చేసి స్క్రీన్ టాప్ రైట్‌లోని 3–డాట్ మెనూ క్లిక్ చేయాలి.
2. సెట్టింగ్స్ సబ్–మెనూ క్లిక్ చేస్తే మల్టీపుల్ ఆప్షన్స్ కనిపిస్తాయి.
3. ప్రైవసీ క్లిక్ చేయాలి.
4. 'హూ కెన్ సీ మై పర్సనల్ ఇన్ఫో' సెక్షన్‌లో ప్రొఫైల్ ఫొటో ట్యాప్ చేయాలి.
5. 'మై కాంటాక్ట్స్ ఎక్సెప్ట్' ఆప్షన్‌లో సేవ్ చేసిన కాంటాక్ట్స్ కనిపిస్తాయి.
6. ప్రొఫైల్ పిక్చర్ బ్లాక్ చేయదల్చుకున్న కాంటాక్ట్‌ను ఎంపిక చేసుకోవాలి.
7. స్క్రీన్ బాటమ్ రైట్‌లోని టిక్ బటన్ నొక్కాలి.

సోనీ జెడ్‌వీ–ఈఐ



సోనీ కంపెనీ జెడ్‌వీ–ఈఐ వ్లాగింగ్ కెమెరా వివరాలు...
● బాడీ ప్లస్ 28–60 ఎంఎం జూమ్ లెన్స్
● కెమెరా టైప్: ఇంటర్ ఛేంజబుల్ లెన్స్ డిజిటల్ కెమెరా ● కెమెరా సెక్షన్: 35 ఎంఎం ఫుల్‌ఫ్రేమ్ (35.6x23.8 ఎంఎం) ● కలర్ టెంపరేచర్ రేంజ్: 2500కె–9900కె
● యాంటి డస్ట్ ఫంక్షన్ ఫీచర్స్

సినిమా

ఆజా రాజా



● రవితేజ ● ఎన్టీఆర్ ● అల్లు అర్జున్

పాన్ ఇండియా ఫార్ములా భాషాపరమైన హద్దులను చెరిపేసింది. ఒక భాషలో రూపొందించిన చిత్రాలను ఇతర భాషల్లో అనువదించి, విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు హీరోలకు కూడా హిందీలో మంచి మార్కెట్ ఏర్పడింది. ఇప్పుడు బాలీవుడ్ మేకర్స్ 'ఆజా రాజా' (రా రాజా) అంటూ తెలుగు హీరోలతో స్ట్రయిట్ హిందీ చిత్రాలు నిర్మించడానికి ముందుకొస్తున్నారు. ప్రస్తుతం తెలుగు స్టార్స్ చేస్తున్న హిందీ స్ట్రయిట్ ఫిలింస్ విశేషాలు తెలుసుకుందాం.

● రవితేజ హీరోగా నటించిన పలు హిట్ సినిమాలు హిందీలో డబ్బింగ్ అయి, అక్కడి బుల్లితెరపై అడపా దడపా ప్రదర్శితమవుతున్నాయి. ఆ విధంగా హిందీ ప్రేక్షకుల్లో రవితేజకు మంచి పాపులారిటీ ఉంది. ఇప్పుడు స్ట్రయిట్‌గా రవితేజ బాలీవుడ్‌కు వెళ్లనున్నట్లు టాలీవుడ్ టాక్. తమిళ హిట్ ఫిల్మ్ 'మానాడు' రీమేక్‌లో (హిందీ, తెలుగు) రవితేజ, బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధావన్ కలిసి నటించనున్నారట. ఈ చిత్రానికి ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తారని సమాచారం. ఈ చిత్రాన్ని హీరో రానా, ఏషియన్ సునీల్ నిర్మిస్తారట.



● ప్రభాస్

'బాహుబలి' సక్సెస్‌తో లేటెస్ట్ జనరేషన్‌లో పాన్ ఇండియా స్టార్‌గా పేరు తెచ్చుకున్న తొలి హీరోగా ప్రభాస్‌ను చెప్పుకోవచ్చు. ఆ చిత్రం తర్వాత ప్రభాస్ నటించిన 'సాహో', 'రాధేశ్యామ్' చిత్రాల బడ్జెట్స్ పెరిగాయి. బాలీవుడ్‌లో కూడా భారీ ఎత్తున రిలీజ్ చేశారు. ప్రభాస్ హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని భూషణ్‌కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. రామాయణంగా ఆధారంగా రూపొందిన ఈ చిత్రం జూన్ 16న విడుదల కానుంది. అలాగే ప్రభాస్ హీరోగా కమిటైన మరో చిత్రం 'స్పిరిట్'. ప్రభాస్ కెరీర్‌లో 25వ చిత్రంగా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్నారు. టీ సిరీస్ భూషణ్‌కుమార్, భద్రకాళి పిక్చర్స్ సందీప్‌రెడ్డి వంగా, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 2024 చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళుతుందని టాక్.

● 'ఆర్ ఆర్ఆర్'తో ఎన్టీఆర్ క్రేజ్ మరింత పెరిగిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ క్రేజ్‌ను క్యాష్ చేసుకోవడంలో యశ్ రాజ్ ఫిలింస్ నిర్మాత ఆదిత్యా చోప్రా ఫస్ట్ సక్సెస్ అయ్యారు. యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించనున్న స్పై మూవీ 'వార్ 2'లో హృతిక్ రోషన్‌తో కలిసి ఎన్టీఆర్ నటించనున్నట్లు తెలుస్తోంది. 'బ్రహ్మాస్త్రం' ఫేమ్ అయాన్ ముఖర్జీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారని సమాచారం. ప్రస్తుతం బీ టౌన్‌లో బలంగా వినిపిస్తున్న ఈ వార్తలు నిజమైతే ఎన్టీఆర్ నటించే తొలి స్ట్రయిట్ హిందీ చిత్రం ఇదే అవుతుంది.

● బాలీవుడ్‌లో అల్లు అర్జున్ ఎంట్రీ గురించిన టాక్ ఎప్పట్నుంచో ఉంది. అల్లు అర్జున్‌తో ఓ హిందీ సినిమా చేయాలని బాలీవుడ్ నిర్మాత దినేష్ విజన్ ప్రయత్నించారు... కుదర్లేదు. ఆ తర్వాత దర్శక–నిర్మాత సంజయ్‌లీలా భన్సాలీతో అల్లు అర్జున్ సమావేశమవగానే ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ బాలీవుడ్ మీడియా కోడై కూసింది. కానీ అల్లు అర్జున్‌తో స్ట్రయిట్ హిందీ ఫిల్మ్ చేసే అవకాశం టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్‌కు లభించింది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. టీ సిరీస్, భద్రకాళి ప్రొడక్షన్స్ పతాకంపై భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ప్రణవ్ రెడ్డి వంగా ఈ సినిమాను నిర్మించనున్నారు.



● వరుణ్ తేజ్

● దేశభక్తి నేపథ్యంతో కూడిన చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్‌సింగ్‌ను దర్శకునిగా పరిచయం చేస్తూ, సోనీ పిక్చర్స్ ఇండియా, రెనైసాన్స్ పిక్చర్స్ పతాకంపై సందీప్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో వరుణ్ తేజ్ జెట్ పైలెట్‌గా చేస్తున్నారు. ప్రపంచ సుందరి మానుషీ చిల్లర్ హీరోయిన్. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.



● రామ్‌చరణ్, సల్మాన్ ఖాన్, వెంకటేశ్

దాదాపు పదేళ్ల క్రితమే హిందీలో 'జంజీర్' (తెలుగులో 'తుఫాన్')తో ఎంట్రీ ఇచ్చారు రామ్‌చరణ్. ఆ తర్వాత తెలుగు చిత్రాలకే పరిమితం అయ్యారు చరణ్. అయితే గత ఏడాది విడుదలైన 'ఆర్ఆర్ఆర్'లో ఓ హీరోగా నటించిన రామ్‌చరణ్‌కు బాలీవుడ్‌లో సూపర్ క్రేజ్ దక్కింది. హిందీలో స్ట్రయిట్ చిత్రాలు చేసే దిశగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పదేళ్ల తర్వాత ఓ గెస్ట్ రోల్‌లో హిందీ తెరపై కనిపించనున్నారు చరణ్. సల్మాన్ ఖాన్, వెంకటేశ్ నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రంలో రామ్‌చరణ్ ఓ గెస్ట్ రోల్ చేశారు. ఈద్ సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్రం రిలీజ్ కానుంది. మరోవైపు స్ట్రయిట్ హిందీ ఫిల్మ్ చేసేందుకు కూడా చరణ్ కొన్ని కథలు విన్నారు.



● బెల్లంకొండ సాయి శ్రీనివాస్

● బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు హిందీ వ్యూయర్స్‌లో క్రేజ్ ఉంది. శ్రీనివాస్ హీరోగా నటించిన 'జయ జానకి నాయక' హిందీ వెర్షన్‌కు యూట్యూబ్‌లో 700 మిలియన్ వ్యూస్ రావడమే ఇందుకు ఓ నిదర్శనం. సాయి శ్రీనివాస్ నటించిన తెలుగు చిత్రాల హిందీ అనువాదాలకు అక్కడి ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభించింది. దీంతో 'ఛత్రపతి'గా బాలీవుడ్‌కు వెళ్తున్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'ఛత్రపతి' సినిమాకి రీమేక్ ఇది. అదే టైటిల్‌తో హిందీలో రీమేక్ అయిన ఈ సినిమాకు వీవీ వినాయక్ దర్శకత్వం వహించారు. జయంతి లాల్ గడ నిర్మించిన ఈ చిత్రం మే 12న విడుదల కానుంది.

మరికొందరు తెలుగు స్టార్స్ కూడా హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్స్ చేసే చాన్స్ ఉంది.

మాస్ ఐ ఫోన్!



● గోపీచంద్, డింపుల్ హయతి

గోపీచంద్ హీరోగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'రామబాణం'. డింపుల్ హయతి హీరోయిన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజ్ కానుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఐ ఫోన్..' అనే మాస్ పాటని గురువారం విడుదల చేశారు. ''యాక్షన్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రామబాణం'. మాస్ పాటలు రాయడంలో స్పెషలిస్ట్ అయిన కాసర్ల శ్యామ్ తెలంగాణ యాసలో ఈ పాటను రాశారు. రామ్ మిరియాల, మోహనా భోగరాజు ఎనర్జిటిక్‌గా పాడారు. గోపీచంద్, డింపుల్ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది. జగపతిబాబు, ఖుష్బు, అలీ నటించిన ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, కెమెరా: వెట్రి పళనిసామి.

జిలేబి మంచి వినోదాత్మక చిత్రం అవుతుంది: వెంకటేశ్



● విజయ భాస్కర్, శివాని, వెంకటేశ్, శ్రీ కమల్, రామకృష్ణ, అంజు

''విజయ భాస్కర్‌గారు నాకు ఇష్టమైన డైరెక్టర్. నా ఫేవరేట్ చిత్రాలైన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి'లను ఆయన ఎంత చక్కగా తీశారో మనందరికీ తెలుసు. ఆయన తీసిన 'జిలేబి' కూడా తప్పకుండా మంచి వినోదాత్మక చిత్రం అవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు హీరో వెంకటేష్. దర్శకుడు విజయ భాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'జిలేబి'. ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ భాస్కర్ దర్శకత్వంలో అంజు అశ్రాని సమర్పణలో ఎస్ఆర్‌కే పతాకంపై గుంటూరు రామకృష్ణ నిర్మించిన చిత్రం 'జిలేబి'. ఈ సినిమా ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను వెంకటేష్ విడుదల చేసి, మాట్లాడుతూ–''జిలేబి' తో నటుడిగా పరిచయమవుతున్న కమల్‌కి, నిర్మాతలు రామకృష్ణ, అంజులకు ఆల్ ది బెస్ట్. ఇది అందరూ చూసే సినిమా అవుతుంది'' అన్నారు. ''వెంకటేష్‌గారి చేతులమీదుగా మా అబ్బాయి నటించిన 'జిలేబి' గ్లింప్స్ లాంచ్ కావడం సంతోషంగా ఉంది. 'జిలేబి' అందమైన ప్రయాణం. మణిశర్మగారు, రామకృష్ణ, అంజు, కెమెరామేన్ సతీష్... ఇలా అందరం కలిసి ఓ కుటుంబంలా పనిచేశాం'' అన్నారు. ''మా 'జిలేబి' చూసి మనసారా నవ్వుకుంటారని ఆశిస్తున్నాను'' అన్నారు శ్రీకమల్. ''నా మనసుకు దగ్గరైన సినిమా 'జిలేబి'' అన్నారు శివాని. ''నిర్మాతగా నా తొలి చిత్రం ఇది. బ్యాలెన్స్ ఉన్న రెండు పాటలను ఫారిన్‌లో చిత్రీకరించనున్నాం'' అన్నారు. ''విజయభాస్కర్‌లాంటి దర్శకునితో మా తొలి సినిమా చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే ఈ మూవీ విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు అంజు.

ప్రేక్షకులు థ్రిల్ అవుతారు
- మేఘా ఆకాష్



''రావణాసుర' మూవీలో నాది చాలా కీలకమైన పాత్ర. కామెడీ, ఇంటెన్స్.. ఇలా వేరియేషన్స్ ఉంటాయి. ఆ పాత్ర చేయడం సవాల్‌గా అనిపించింది'' అని మేఘా ఆకాష్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటించిన మేఘా ఆకాష్ మాట్లాడుతూ–''రావణాసుర'లో నేను రిచ్, క్లాసీ అమ్మాయిగా కనిపిస్తాను. ఈ మూవీలో చాలా మలుపులు, ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. ప్రేక్షకులు థ్రిల్ ఫీలవుతారు. సుధీర్ వర్మ గారు ఒక యాక్టర్‌కి చాలా కంఫర్ట్ జోన్ ఇస్తారు. ప్రస్తుతం విజయ్ ఆంటోనీతో ఒక సినిమా, మా అమ్మగారి సమర్పణలో ఓ చిత్రం చేస్తున్నాను'' అన్నారు.

జై పవన పుత్ర హనుమాన్



● దేవదత్ నాగే

సినీ అభిమానులు, ముఖ్యంగా ప్రభాస్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం 'ఆదిపురుష్'. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రమిది. రామాయణం ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రంలో సీతగా కృతీ సనన్, రావణాసురుడిగా సైఫ్ అలీ ఖాన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమాన్ పాత్రలో దేవదత్ నాగే నటించారు. ఈ చిత్రం జూన్ 16న విడుదల కానుంది.

గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. 'రామ భక్తుడు, రాముడి ఆత్మ.. జై పవన పుత్ర హనుమాన్!' అని క్యాప్షన్ ఇస్తూ హనుమంతుని పాత్రధారి దేవదత్ నాగే లుక్ రిలీజ్ చేశారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
7-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
144	42
59,833	17,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి సెంటర్ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,082	▲	85
డోజోన్స్	33,473	▽	9
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,472	▲	79
డాక్స్	15,598	▲	78
షాంఘై	3,313		0
నికాయ్	27,473	▽	341

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	60,623	▽ 158
బంగారం (22 క్యారట్)	60,380	▽ 158
వెండి (కిలో)	74,164	▲ 330

గో డిజిట్ మళ్లీ ఐపీవో బాట

తాజా సమాచారంతో సెబీకి ప్రాస్పెక్టస్


న్యూఢిల్లీ: సాధారణ బీమా సేవలందించే గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ మళ్లీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. కెనడియన్ సంస్థ ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్‌నకు పెట్టుబడులున్న కంపెనీ ఉద్యోగుల గుర్తింపు ఆధారిత రైట్స్ స్టాక్ పథకంలో తగిన సవరణలు చేసింది. తద్వారా సెబీకి మరోసారి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ఈ ఏడాది జనవరి 30న సెబీ మరింత సమాచారాన్ని కోరుతూ 2022 ఆగస్టులో గో డిజిట్ సమర్పించిన ప్రాస్పెక్టస్‌ను వెనక్కి పంపింది. ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ఎప్రిషియేషన్ రైట్స్ పథకం నిబంధనల అమలుపై తొలి ప్రాస్పెక్టస్‌ను సెబీ తిప్పి పంపిన విషయం విదితమే. ఆపై ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకంలో సవరణలకు వాటాదారులు, బోర్డు ఆమోదముద్ర వేశాయి.

రూ. 1,250 కోట్ల ఈక్విటీ జారీ

ఐపీవో అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ ప్రకారం గో డిజిట్ రూ.1,250 కోట్ల ఈక్విటీని జారీ చేయనుంది. వీటికి అదనంగా 10.94 కోట్ల షేర్లను ప్రమోటర్ గో డిజిట్ ఇన్ఫోవర్క్స్‌తోపాటు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. క్రికెటర్ విరాట్ కోహ్లీ, అతని భార్య, నటి అనుష్క శర్మ కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు.

ఎక్కడి రేట్లు అక్కడే..!

- ఆర్‌బీఐ అనూహ్య నిర్ణయం
- మార్కెట్ అంచనాలకు భిన్నంగా కీలక రెపో రేటు యథాతథం
- 6.5 శాతంగా కొనసాగింపు
- అవసరమైతే తరువాతి సమావేశాల్లో వడ్డింపు ఉంటుందని సూచన
- ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ అంశాలను జాగ్రత్తగా గమనిస్తున్నట్లు వెల్లడి



వెనక్కు మళ్లడం కాదు.. విరామమే..!

తాజా నిర్ణయం కఠిన ద్రవ్య విధానం నుంచి వెనక్కు మళ్లినట్లు కాదు. ఇది కేవలం విరామం మాత్రమే. ఈ నిర్ణయం "కేవలం ఈ సమావేశానికి మాత్రమే". అవసరమైతే మళ్లీ రేటు పెంపు ఉంటుంది. అంతర్జాతీయ అంశాలను, ద్రవ్యోల్బణం కదలికలను జాగ్రత్తగా గమనిస్తున్నాం. వృద్ధి–ద్రవ్యోల్బణం సమతౌల్యతపై ప్రస్తుతానికి దృష్టి సారించడం జరుగుతోంది. చమురు ధరలు సహా పలు అంశాలకు సంబంధించి అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు నాటకీయ మార్పులను గమనిస్తున్నాం.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్కెట్ అంచనాలకు భిన్నమైన నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపోను యథాతథంగా 6.5 శాతం వద్దే ప్రస్తుతానికి కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. 11 నెలల వరుస రేటు పెంపు అనంతరం ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా ఉంది. నిజానికి ఈ దఫా రేటు పావుశాతం వరకూ ఉంటుందని మార్కెట్, ఆర్థిక విశ్లేషకులు అంచనావేశారు.

ఏకగ్రీవ నిర్ణయం

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్యపరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా రేటు పెంపు నిలుపుదల నిర్ణయం తీసుకుంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, గతేడాది మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వరుసగా ఆరవసారి పెంపుతో అప్పటి నుంచి 2.5% రెపో రేటు పెరిగినట్లయ్యింది.

వృద్ధి 6.5 శాతానికి పెంపు

2023–24లో వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదవుతుందని ఆర్‌బీఐ తాజాగా అంచనావేసింది. ఫిబ్రవరిలో వేసిన 6.4 శాతం రేటు అంచనాల తాజా పెంపు సానుకూల పరిణామం. క్యూ1లో 7.8%, క్యూ2లో 6.2 శాతం, క్యూ3లో 6.1 శాతం, క్యూ4లో 5.9 శాతం వృద్ధి నమోదు అంచనా.

ద్రవ్యోల్బణం అంచనా తగ్గింపు

వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 2023–24లో 5.3 శాతం ఉంటుందని ఫిబ్రవరిలో అంచనా వేస్తే, తాజాగా ఈ అంచనాలను 5.2 శాతానికి తగ్గించడం వృద్ధికి దారితీసే మరో హర్షణీయ పరిణామం. అయితే ద్రవ్యోల్బణంపై పోరు ముగిసిపోలేదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఒపెక్ చమురు ఉత్పత్తి కోత నిర్ణయం ఇక్కడ పరిశీలనలోకి తీసుకోవాల్సిన అంశంగా పాలసీ పేర్కొంది. రిటైల్ ద్రవ్యోల్బణం కేంద్రం నిర్దేశిస్తున్న విధంగా 6 శాతం దిగువకు సుదీర్ఘ కాలం కొనసాగేంత వరకూ దీనిపై సెంట్రల్ బ్యాంక్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2022 నవంబర్, డిసెంబర్ మినహా 2022 జనవరి నుంచి 6 శాతం ఎగువనే కొనసాగుతోంది.

ముఖ్యాంశాలు...

- రెగ్యులేటర్లు నిరంతరం 'ఒడిదుడుకులకు దారితీసే అంశాలపై' అప్రమత్తంగా ఉండాలి. ఈ సవాళ్లపై నిరంతర పర్యవేక్షణ అవసరం.
- అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో బ్యాంకింగ్ సంక్షోభ పరిస్థితులపై ఆర్‌బీఐ నిరంతర అప్రమత్తత పాటిస్తుంది. బ్యాంకింగ్‌లో తగిన నిధుల లభ్యత అవసరాలను పర్యవేక్షిస్తుంది.
- బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లను గుర్తించడానికిగాను ఆర్‌బీఐ ఒక కేంద్రీకృత పోర్టల్‌ను ఏర్పాటు చేస్తుంది.
- భారత రూపాయి 2022లో ఒక క్రమపద్ధతిలో కదలాడింది. 2023లో కూడా అలాగే కొనసాగుతుంది. కరెన్సీ స్థిరత్వంపై ఆర్‌బీఐ అప్రమత్తత కొనసాగుతుంది.
- బ్యాంకింగ్ నెట్‌వర్క్ నుంచి యూపీఐ ద్వారా ముందస్తు రుణాలను పొందేందుకు త్వరలో మార్గదర్శకాలు జారీ కానున్నాయి.
- 2023–24 ఆర్థిక సంవత్సరం రెండవ ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్ష జూన్ 6 నుంచి 8 వరకూ జరుగుతుంది.

తగిన నిర్ణయం

ఆర్‌బీఐ తగిన మంచి నిర్ణయం తీసుకుందని నేను భావిస్తున్నాను. దేశ ఎకానమీ సాలభ్యతను ఇది సూచిస్తోంది

– నిర్మలా సీతారామన్, ఆర్థికశాఖ మంత్రి

ఆశ్చర్యం కలిగించింది

మరో దఫా రేటు పెంపుపై ఖాయమని మార్కెట్ వర్గాల అంచనా నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది. అయితే సమయానుకూలంగా నిర్ణయం జరిగింది.

– దినేశ్ ఖరా, ఎస్‌బీఐ చైర్మన్

పరిణతి విధానం

ఆర్‌బీఐ పాలసీ పరిణతితో ఉంది. ఈ నిర్ణయం హర్షణీయం. ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్లకు స్థిరత్వాన్ని అందిస్తుంది.

– సుభ్రకాంత్ పాండా, ఫిక్కీ ప్రెసిడెంట్

రియల్టీకి ఊతం

రెపో రేటును యథాతథంగా కొనసాగించాలనే నిర్ణయంపై రియల్ ఎస్టేట్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేస్తోంది. ఇది గృహ డిమాండ్‌ను వేగవంతం చేయడమే కాకుండా మొత్తం ఈ విభాగంలోని అన్ని రంగాల పురోగతికి దోహదపడుతుంది. ముఖ్యంగా చౌక గృహ డిమాండ్‌ను ప్రేరేపించే నిర్ణయమిది.

– హర్షవర్ధన్ పటోడియా, క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్

బెట్టింగ్ గేమ్‌లపై నిషేధం

- గేమింగ్ స్వీయ నియంత్రణకు ఎస్‌ఆర్‌వోలు
- ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనల ప్రకటన

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ రంగ నియంత్రణకు సంబంధించి కేంద్రం గురువారం నిబంధనలను ప్రకటించింది. సిసలైన డబ్బులు పెట్టి ఆడేవి, బెట్టింగ్ చేసే గేమ్‌లను నిషేధించింది. అలాగే, ఆన్‌లైన్ గేమింగ్ రంగం స్వీయ నియంత్రణ విధానాన్ని పాటించాలని సూచించింది. ఈ దిశగా దేశీయంగా ఉపయోగించే గేమ్‌లను ఆమోదించేందుకు తొలుత మూడు స్వీయ నియంత్రణ సంస్థలను (ఎస్‌ఆర్‌వో) నోటిఫై చేయనుంది. 2021 ఐటీ చట్టాలకు సవరణగా ఈ నిబంధనలను చేర్చారు. సిసలైన డబ్బుతో పందేలు కాయనివి, వినియోగదారులకు హాని కలిగించే కంటెంట్ ఏదీ ఉండనివి, పిల్లలకు వ్యసనంగా మారని గేమ్స్‌కు అనుమతి ఉంటుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. 'ఆన్‌లైన్ గేమింగ్ వృద్ధికి భారత్‌లో అపార అవకాశాలు ఉన్నాయి. అది గణనీయంగా విస్తరించేందుకు ఈ నిబంధనలు తోడ్పడగలవు' అని మంత్రి చెప్పారు. కొత్త నిబంధనలు నవకల్పనలకు ఊతమివ్వగలవని, ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంపొందించగలదని పరిశ్రమ వర్గాలు స్వాగతించాయి. గ్యాంబ్లింగ్ ప్లాట్‌ఫాంలను ఏరివేసి, అంతర్జాతీయంగా పరిశ్రమ పోటీపడేలా ప్రోత్సహించగలవని అభిప్రాయపడ్డాయి.



నిబంధనల్లో మరిన్ని ముఖ్య అంశాలు..

- ఆన్‌లైన్ గేమ్స్‌ను నియంత్రించే ఎస్‌ఆర్‌వోల్లో పరిశ్రమ ప్రతినిధులు, గేమర్లు, ఇతరత్రా సంబంధిత వర్గాలు ఉంటాయి. నిబంధనల ప్రకారం ఎస్‌ఆర్‌వోల్లో ఒక విద్యావేత్త, సైకాలజీ నిపుణులు, బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న వ్యక్తి లేదా అధికారి ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోకపోతే ఎస్‌ఆర్‌వోలను డీనోటిఫై చేస్తారు.
- గేమింగ్ వ్యసనంగా మారకుండా, ఆర్థికంగా నష్టపోకుండా, మోసాల బారిన పడకుండా యూజర్లను కాపాడేందుకు తగు వ్యవస్థను ఎస్‌ఆర్‌వోలు రూపొందించాలి. ఒక గేమింగ్ సెషన్‌లో సముచిత సమయం దాటితే పదే పదే హెచ్చరిక మెసేజీలు కూడా పంపించే విధంగా అది ఉండాలి.

బీ న్యూ మొబైల్స్ స్టోర్‌లో రెడ్‌మీ 12సి సిరీస్ ఫోన్లు

హైదరాబాద్: ప్రముఖ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్ స్టోర్ రెడ్‌మీ 12సీ, 12 సిరీస్ స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. సినీ నటి దక్ష నాగర్కర్ గురువారం రెడ్‌మీ 12సీ స్మార్ట్‌ఫోన్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. "బీ న్యూ స్టోర్స్ అద్భుతమైన ఆఫర్లతో రెడ్‌మీ 12సీ స్మార్ట్‌ఫోన్లను తక్కువ ధరకే అందిస్తుంది. కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని నాగర్కర్ కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేశ్‌తో పాటు రెడ్‌మీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్ల జోరు

ముంబై: స్టాక్ సూచీలు అయిదో రోజూ లాభాలను ఆర్జించాయి. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ ఆర్థికవేత్తల అంచనాలకు భిన్నంగా కీలక వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపునకు మొగ్గుచూపింది. ఫలితంగా వడ్డీ రేట్ల ఆధారిత బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో, రియల్టీ షేర్లు రాణించాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 144 పాయింట్లు లాభపడి 59,833 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు పెరిగి 17,599 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు అరశాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ, టెక్, మెటల్, వినిమయ, టెలికమ్యూనికేషన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. గుడ్ ఫ్రైడే సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు.

ఆర్‌బీఐ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకపోవడంతో వడ్డీరేట్ల ఆధారిత బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్ రంగ ఇండస్ఇండ్ బ్యాంక్ 2%, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒకశాతం ఒకశాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ అరశాతం పెరిగాయి.



ఎవలాన్ టెక్ ఐపీవో ఓకే

ఎలక్ట్రానిక్ తయారీ సర్వీసుల కంపెనీ ఎవలాన్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ గట్టెక్కింది. చివరి రోజు గురువారానికల్లా 2.2 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ఐపీవోలో భాగంగా 1.14 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా.. 2.53 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



పోరాడి ఓడిన సాకేత్-యూకీ జోడీ

యూఎస్ పురుషుల క్లే కోర్టు టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత డబుల్స్ జోడీ సాకేత్ మైనేని, యూకీ బాంబ్రీ జోడీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. అమెరికాలోని హ్యూస్టన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 6–7 (6/8), 6–2, 5–10తో 'సూపర్ టైబ్రేక్‌'లో రాబర్ట్ గాలోవే (అమెరికా)-మిగేల్ ఎంజెల్ రేయస్ వరేలా (మెక్సికో) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌లో ఆరుసార్లు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్న సాకేత్, యూకీ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం గాలోవే-వరేలా ద్వయం పైచేయి సాధించింది. తొలి రౌండ్‌లో నిష్క్రమించిన సాకేత్, యూకీలకు 3,510 డాలర్ల (రూ. 2 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

ప్రియాన్షు సంచలనం

ప్రపంచ 12వ ర్యాంకర్‌పై విజయం

న్యూఢిల్లీ: ఓర్లియాన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువతార ప్రియాన్షు రజావత్ సంచలనం సృష్టించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రియాన్షు ప్రపంచ 12వ ర్యాంకర్, టాప్ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)పై గెలుపొందాడు. గతవారం స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన నిషిమోటోతో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 58వ ర్యాంకర్ ప్రియాన్షు 21–8, 21–16తో గెలుపొంది క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. థామస్ కప్ టైటిల్ సాధించిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న ప్రియాన్షు ఈ మ్యాచ్ తొలి గేమ్‌లో 10–0తో ఆధిక్యంలోకి వెళ్లడం విశేషం. రెండో గేమ్‌లో ప్రియాన్షుకు పోటీ ఎదురైనా కీలకదశలో పాయింట్లు గెలిచి 42 నిమిషాల్లో విజయాన్ని అందుకున్నాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో చి యు జెన్ (చైనీస్ తైపీ)తో ప్రియాన్షు తలపడతాడు.



'నంబర్‌వన్' అర్జెంటీనా



జ్యూరిక్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో విశ్వవిజేత అర్జెంటీనా జట్టు ఆరేళ్ల తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఇటీవల పనామా, కురాసావ్ జట్లతో జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో అర్జెంటీనా గెలుపొందడంతో మెస్సీ బృందం రెండో స్థానం నుంచి అగ్రస్థానానికి చేరుకుంది. గత ఏడాది ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా 36 ఏళ్ల తర్వాత జగజ్జేతగా నిలిచిన సంగతి తెలిసిందే. మొరాకోతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో బ్రెజిల్ ఓడిపోవడంతో ఆ జట్టు నంబర్‌వన్ ర్యాంక్ నుంచి రెండు స్థానాలు పడిపోయి మూడో ర్యాంక్‌కు చేరుకుంది. మూడో స్థానంలో ఉన్న ఫ్రాన్స్ రెండో స్థానానికి ఎగబాకింది. బెల్జియం నాలుగో ర్యాంక్‌లో, ఇంగ్లండ్ ఐదో ర్యాంక్‌లో ఉన్నాయి.

భారత్ @ 101

గురువారం విడుదల చేసిన 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఐదు స్థానాలు పురోగతి సాధించి 101వ ర్యాంక్‌కు చేరుకుంది. స్వదేశంలో జరిగిన మూడు దేశాల టోర్నీలో కిర్గిజ్ రిపబ్లిక్, మయన్మార్ జట్లపై గెలిచి విజేతగా నిలవడంతో ర్యాంకింగ్స్‌లో భారత్ ఎగబాకింది. 1994లో భారత్ అత్యుత్తమంగా 94వ ర్యాంక్‌లో నిలిచింది.

ఐర్లాండ్ పోరాటం

- రెండో ఇన్నింగ్స్‌లో 286/8
- లోర్కాన్ టకెర్ సెంచరీ

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఐర్లాండ్ అసాధారణ పోరాటపటిమను కనబరిచింది. 131 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 27/4తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 107 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు సాధించింది. వికెట్ కీపర్ లోర్కాన్ టకెర్ (162 బంతుల్లో 108; 14 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ చేశాడు. హ్యారీ టెక్టర్ (56; 7 ఫోర్లు, 1 సిక్స్), మెక్‌బ్రైన్ (71 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. టెక్టర్, టకెర్ ఆరో వికెట్‌కు 72 పరుగులు... టకెర్, మెక్‌బ్రైన్ ఏడో వికెట్‌కు 111 పరుగులు భాగస్వామ్యం జోడించారు.


టకెర్

వన్డే ప్రపంచకప్‌కు విలియమ్సన్ దూరం!

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్ కేన్ విలియమ్సన్ ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఆడేది సందేహంగా మారింది. చెన్నైతో జరిగిన ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో గుజరాత్ తరఫున బరిలోకి దిగిన విలియమ్సన్ బౌండరీ వద్ద క్యాచ్‌కు ప్రయత్నించి గాయపడ్డాడు. విలియమ్సన్ కుడి మోకాలికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. శస్త్ర చికిత్స తర్వాత విలియమ్సన్ కోలుకోవడానికి ఆరు నెలలు సమయం పట్టే అవకాశముంది.

శార్దుల్ ధనాధన్...

- 29 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 68
- కోల్‌కతా నైట్‌రైడర్స్ బోణీ
- బెంగళూరుపై 81 పరుగులతో గెలుపు
- రాణించిన గుర్బాజ్, రింకూ సింగ్
- వరుణ్, నరైన్, సుయశ్ మాయాజాలం

కోల్‌కతా: సొంతగడ్డపై కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) సమష్టి ప్రదర్శనతో గర్జించింది. ఐపీఎల్ టోర్నీలో తొలి విజయం నమోదు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో ఈడెన్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 81 పరుగుల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 204 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శార్దుల్ ఠాకూర్ (29 బంతుల్లో 68; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. గుర్బాజ్ (44 బంతుల్లో 57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), రింకూ సింగ్ (33 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. ఈ ముగ్గురి బ్యాటింగ్ కారణంగా కోల్‌కతా స్కోరు 200 పరుగులు దాటింది. బెంగళూరు బౌలర్లలో డేవిడ్ విల్లీ, కరణ్ శర్మ రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 17.4 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. వరుణ్ చక్రవర్తి (4/15), సునీల్ నరైన్ (2/16), తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన 'ఇంపాక్ట్ ప్లేయర్' సుయశ్ శర్మ (3/30) తమ స్పిన్ మాయాజాలంతో బెంగళూరు జట్టును దెబ్బతీశారు.



శార్దుల్


సుయశ్ శర్మ

ఆ ఇద్దరి దూకుడుతో...

తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతాకు శుభారంభం లభించలేదు. డేవిడ్ విల్లీ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో వరుస బంతుల్లో వెంకటేశ్ అయ్యర్, మన్‌దీప్ బౌల్డ్ అయ్యారు. ఒకవైపు గుర్బాజ్ జోరు కొనసాగించడంతో కోల్‌కతా పవర్‌ప్లేలో రెండు వికెట్లకు 47 పరుగులు చేసింది. ఏడో ఓవర్ తొలి బంతికి కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా అవుటయ్యాడు. ఆ తర్వాత రింకూ సింగ్‌తో జత కలిసి గుర్బాజ్ కోల్‌కతా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 11 ఓవర్లు ముగిసే సరికి కోల్‌కతా 87/3తో నిలిచింది. కరణ్ శర్మ వేసిన 12వ ఓవర్లో కోల్‌కతాకు దెబ్బ పడింది. వరుస బంతుల్లో గుర్బాజ్, రసెల్ పెవిలియన్ చేరడంతో కోల్‌కతా 89/5తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన శార్దుల్ ఠాకూర్ చెలరేగిపోయాడు. బెంగళూరు బౌలర్లపై ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. 20 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రింకూ, శార్దుల్ 102 పరుగుల భాగస్వామ్యానికి 19వ ఓవర్ చివరి బంతికి హర్షల్ పటేల్ తెరదించాడు. ఆఖరి ఓవర్లో శార్దుల్‌ను సిరాజ్ అవుట్ చేయగా... చివరి రెండు బంతుల్లో ఉమేశ్ ఆరు పరుగులు స్కోరు చేయడంతో కోల్‌కతా స్కోరు 200 పరుగులు దాటింది.

తడబాటు...

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు ఓపెనర్లు కోహ్లి (18 బంతుల్లో 21; 3 ఫోర్లు), డు ప్లెసిస్ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) శుభారంభం ఇచ్చారు. అయితే ఐదో ఓవర్లో నరైన్ బౌలింగ్‌లో కోహ్లి, ఆరో ఓవర్లో వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో డు ప్లెసిస్ బౌల్డయ్యారు. దాంతో బెంగళూరు ఇన్నింగ్స్ తడబడింది. హిట్టర్లు బ్రేస్‌వెల్, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్ క్రీజులో నిలదొక్కుకోవడంలో విఫలమయ్యారు. తక్కువ స్కోర్లకే పెవిలియన్ బాట పట్టడంతో బెంగళూరు ఓటమి ఖాయమైంది. కోల్‌కతా జట్టులో వెంకటేశ్ అయ్యర్ స్థానంలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగిన లెగ్ స్పిన్నర్, 19 ఏళ్ల సుయశ్ శర్మ మూడు వికెట్లతో ప్రభావం చూపించాడు. మరోవైపు బెంగళూరు ఇన్నింగ్స్‌లో సిరాజ్ స్థానంలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగిన అనూజ్ రావత్ కేవలం ఒక పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	0.700
పంజాబ్	2	2	0	4	0.333
కోల్‌కతా	2	1	1	2	2.056
రాజస్తాన్	2	1	1	2	1.675
లక్నో	2	1	1	2	0.950
చెన్నై	2	1	1	2	0.036
బెంగళూరు	2	1	1	2	-1.256
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	1	0	1	0	-3.600

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


వరుణ్ చక్రవర్తి

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: రహ్మనుల్లా గుర్బాజ్ (సి) ఆకాశ్‌దీప్ (బి) కరణ్ శర్మ 57; వెంకటేశ్ అయ్యర్ (బి) విల్లీ 3; మన్‌దీప్ సింగ్ (బి) విల్లీ 0; నితీశ్ రాణా (సి) దినేశ్ కార్తీక్ (బి) బ్రేస్‌వెల్ 1; రింకూ సింగ్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హర్షల్ పటేల్ 46; రసెల్ (సి) కోహ్లి (బి) కరణ్ శర్మ 0; శార్దుల్ ఠాకూర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) సిరాజ్ 68; నరైన్ (నాటౌట్) 0; ఉమేశ్ యాదవ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 204.** **వికెట్ల పతనం:** 1–26, 2–26, 3–47, 4–89, 5–89, 6–192, 7–198. **బౌలింగ్:** సిరాజ్ 4-0-44-1, డేవిడ్ విల్లీ 4-1-16-2, ఆకాశ్‌దీప్ 2-0-30-0, బ్రేస్‌వెల్ 3-0-34-1, షహబాజ్ అహ్మద్ 1-0-6-0, కరణ్ శర్మ 3-0-26-2, హర్షల్ పటేల్ 3-0-38-1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (బి) నరైన్ 21; డు ప్లెసిస్ (బి) వరుణ్ చక్రవర్తి 23; బ్రేస్‌వెల్ (సి) నితీశ్ రాణా (బి) శార్దుల్ ఠాకూర్ 19, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ చక్రవర్తి 5; హర్షల్ పటేల్ (బి) వరుణ్ చక్రవర్తి 0; షహబాజ్ అహ్మద్ (సి) శార్దుల్ (బి) నరైన్ 1; దినేశ్ కార్తీక్ (సి) వరుణ్ (బి) సుయశ్ శర్మ 9; అనూజ్ రావత్ (సి) నరైన్ (బి) సుయశ్ శర్మ 1; విల్లీ (నాటౌట్) 20, కరణ్ శర్మ (సి) నితీశ్ రాణా (బి) సుయశ్ శర్మ 1, ఆకాశ్‌దీప్ (సి అండ్ బి) వరుణ్ చక్రవర్తి 17; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (17.4 ఓవర్లలో ఆలౌట్) 123.** **వికెట్ల పతనం:** 1–44, 2–46, 3–54, 4–54, 5–61, 6–61, 7–84, 8–86, 9–96, 10–123. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 2-0-17-0, టిమ్ సౌతీ 2-0-25-0, సునీల్ నరైన్ 4-0-16-2, వరుణ్ చక్రవర్తి 3.4-0-15-4, సుయశ్ శర్మ 4-0-30-3, శార్దుల్ ఠాకూర్ 2-0-15-1.

డాక్టర్ రోబో

విశాఖ ఎస్సీ గురుకుల విద్యార్థినుల వినూత్న ఆవిష్కరణ

- రోగ లక్షణం చెబితే మందులు ఇస్తుంది
- ఏ రోగానికి ఏ డాక్టర్‌కి చూపించాలి.. డాక్టర్ ఖాళీగా ఉన్నారా లేదా చెబుతుంది
- జాతీయ స్థాయిలో 7వేల ప్రాజెక్టులు పోటీపడగా.. టాప్‌టెన్‌లో మన విద్యార్థుల ప్రాజెక్టు
- మేధస్సులో ఎస్సీ గురుకుల విద్యార్థుల హ్యాట్రిక్
- ఈ నెల 9–13 వరకు బెంగళూరులో ప్రపంచ ప్రతినిధులకు ఈ ప్రాజెక్టుల ప్రదర్శన

అటల్ టింకరింగ్ ల్యాబ్ మారథాన్ 2021–22లో మనోళ్ల సత్తా

డాక్టర్ రోబో పనితీరు ఇలా..

డాక్టర్ రోబో కృత్రిమ మేధస్సుతో పని చేస్తుంది. రోగి తన పరిస్థితిని రోబోకు వివరిస్తే అతను వాడాల్సిన మందులను స్క్రీన్‌పై డిస్‌ప్లే చేయడంతోపాటు ఔషధాలను ఇస్తుంది. రోగికి ఇంకా ఏదైన సమస్య ఉంటే రోబో ప్రత్యేక వైద్యులకు వీడియోకాల్ చేసి కనెక్ట్ చేస్తుంది. రోగి వారితో మాట్లాడి వైద్య సహాయం పొందవచ్చు. అలాగే, ఏఏ ప్రాంతాల్లో వైద్యనిపుణులున్నారు? ఏ రోగానికి ఏ వైద్యుడ్ని సంప్రదించాలి? అవసరమైన వైద్యులు బిజీగా ఉంటే ఏ సమయంలో అందుబాటులోకి వస్తారు? వంటి సమాచారాన్ని డాక్టర్ రోబో అందిస్తుంది. ఇక ఈ రోబో రోగి దగ్గరకే వెళ్లి వైద్యసేవలు అందించేలా ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

సాక్షి, అమరావతి: అనారోగ్యం వస్తే డాక్టర్ వద్దకు వెళ్లడం.. జబ్బు లక్షణాన్ని బట్టి వైద్యులు పరీక్షించి మందులు రాయడం అందరికీ తెలిసిందే. అదే పని ఒక రోబో చేస్తే?.. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా ఎస్సీ గురుకుల విద్యార్థినులు డాక్టర్ రోబోను ఆవిష్కరించారు. విశాఖపట్నంలోని మధురవాడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన విద్యార్థినులు జెస్సికా (10వ తరగతి), కె. వర్షిణి ప్రియాంక, కె. రేష్మా బిందు (9వ తరగతి)లు ఫిజికల్ సైన్స్ టీచర్ డాక్టర్ టి. రాంబాబు పర్యవేక్షణలో 'డాక్టర్ రోబో' కాన్సెప్ట్‌ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ 2021–22 టాప్‌టెన్ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఎంపిక కావడం విశేషం. దీంతో జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి చెందిన ఎస్సీ గురుకుల విద్యార్థులు హ్యాట్రిక్ సాధించినట్లైంది.


డాక్టర్ రోబోతో ఎస్సీ గురుకుల విద్యార్థులు జెస్సికా, కె. వర్షిణి ప్రియాంక, కె. రేష్మా బిందు

ఏటీఎల్ మారథాన్‌లో ఏడు వేల ప్రాజెక్టులు..

నీతి ఆయోగ్ పరిధిలో అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో భాగంగా నిర్వహించే ఏటీఎల్‌లో విద్యార్థుల మేధస్సుకు పోటీపెట్టి శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలను రూపొందించేలా చేస్తున్నారు. ఏటీఎల్–మారథాన్ 2021–22ను ఎంటర్‌ప్రెన్యూర్ ఇంటర్న్‌షిప్ పేరుతో ఈ ఏడాది జనవరి 9 నుంచి 13 వరకు నిర్వహించారు. బెంగళూరులో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 16 వేల మంది 7వేల ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటి నుంచి తొలిదశలో 350 ప్రాజెక్టులు, మలిదశలో వాటి నుంచి వంద ప్రాజెక్టులు, ఆ తర్వాత అందులోని 30 ప్రాజెక్టులు, చివరకు టాప్‌టెన్‌ను ఎంపిక చేశారు. ఇందులో ఏపీకి చెందిన ఎస్సీ గురుకుల విద్యార్థుల డాక్టర్ రోబో ప్రాజెక్టు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణం.

డాక్టర్ రోబో వినియోగంలోకి వస్తే మేలు..

పెరుగుతున్న వైద్య అవసరాలకు తగ్గట్లు డాక్టర్ రోబో కాన్సెప్ట్ చాలా ఉపయోగపడుతుంది. ప్రధానంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇది చాలా మేలు చేస్తుంది. కోవిడ్ సమయంలో డాక్టర్‌ను సంప్రదించడం, వైద్యసేవలు అందించడం వంటి అనేక సమస్యలకు మార్గం చూపేలా డాక్టర్ రోబోను ఆవిష్కరించాం. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డెవలప్‌చేశాం. ఇది డాక్టర్‌లా సేవలు అందించడమే కాదు.. డాక్టర్లకు కూడా సహాయకుడిగా ఉపయోగపడుతుంది. ఈ నెల 9 నుంచి 13 వరకు బెంగళూరులో జరిగే గ్లోబల్ బృందం పరిశీలనలో మా ప్రాజెక్టు ఎంపికైతే వైద్య రంగంలో మరింత మేలుచేసే రోబో అందుబాటులోకి వస్తుంది.

– జెస్సికా, కె. వర్షిణి ప్రియాంక, కె. రేష్మా బిందు, విద్యార్థినులు

ఎస్సీ గురుకులాల హ్యాట్రిక్



విద్యార్థుల్లో మేధస్సును మెరుగుపెట్టేలా అటల్ ఇన్నోవేషన్ మిషన్ కృషి చేస్తోంది. ఏటీఎల్ ప్రాజెక్టుల ప్రదర్శనలో మూడేళ్లుగా ఎస్సీ గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయిలో టాప్‌టెన్‌లో నిలవడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ప్రోత్సాహంతో మన విద్యార్థులు జాతీయస్థాయిలో రాణిస్తుండటం రాష్ట్రానికి గర్వకారణం.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

కుక్కలు, ఇతర జంతువుల దాడులతో ఏటా 18-20 వేల రేబిస్ మరణాలు

ఇందులో 93 శాతం మరణాలు కుక్కకాట్ల వల్లే సంభవిస్తున్న వైనం

దాడులకు పాల్పడుతున్న శునకాల్లో 63 శాతం వీధికుక్కలే

పరిశోధన వివరాలను ప్రచురించిన ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్

100 కోట్లు: ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుక్కల సంఖ్య.
70 కోట్లు: వివిధ దేశాల్లో వీధికుక్కల సంఖ్య.
ప్రపంచంలో వీధికుక్కలు లేని మొదటి దేశం నెదర్లాండ్స్
2030: రేబిస్ మరణాలను పూర్తిగా నియంత్రించేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలు నిర్దేశించుకున్న గడువు.



రెండు సెకన్లకో దాడి..
అరగంటకో మరణం

దేశంలో కుక్కల స్వైరవిహారం • ఐసీఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రతి రెండు సెకన్లకు ఒక కుక్కకాటు నమోదవుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఫలితంగా అరగంటకో మరణం సంభవిస్తున్నట్లు తేలింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ సంయుక్తంగా పరిశోధన నిర్వహించాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐజేఎంఆర్) ఈ అధ్యయన ఫలితాలను ప్రచురించింది.

దేశంలో కోటిన్నర వీధికుక్కలు...

- భారత్‌లో 2 కోట్ల కుక్కలు ఉండగా అందులో వీధికుక్కల సంఖ్య 1.53 కోట్లుగా ఉంది. వీధికుక్కలు పెరగడానికి ప్రధాన కారణం... వ్యర్థాలను తీసుకెళ్లే పద్ధతి సక్రమంగా లేకపోవడమేనని ఐసీఎంఆర్ అధ్యయనం పేర్కొంది. అందువల్లే వ్యర్థాలు ఉన్న దగ్గర వీధికుక్కల సంతతి పెరుగుతోందని విశ్లేషించింది.

3 రకాల శునకాలు..

- మనుషుల మీద ఆధారపడే దాన్ని బట్టి కుక్కలను ఇంట్లో పెంచుకొనేవి, సామాజిక అవసరాలకు ఉపయోగించేవి, వీధికుక్కలుగా విభజించారు. అయితే ప్రధానంగా వీధికుక్కలతోనే సమస్యలు వస్తున్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కుక్కల సంతతి నియంత్రణకు సరైన ప్రణాళికలు రచించకపోవడం, జంతు హక్కుల కార్యకర్తల కార్యకలాపాల వల్ల కుక్కకాట్లు అధికమవుతున్నాయి.

ఏటా సుమారు 20 వేల మంది మృతి

- ఐసీఎంఆర్–ఎయిమ్స్ అధ్యయనం ప్రకారం దేశంలో కుక్కకాట్లు, ఇతరత్రా జంతువుల కాటు కారణంగా సంభవించే రేబిస్‌తో ఏటా 18 వేల నుంచి 20 వేల మంది వరకు మృత్యువాతపడుతున్నారు. దేశంలో నమోదవుతున్న రేబిస్ మరణాల్లో 93% కుక్కకాటు ద్వారానే సంభవిస్తున్నాయి. అందులో 63% వీధికుక్కల ద్వారానే చోటుచేసుకుంటున్నాయి. పట్టణాల్లో 60%, గ్రామాల్లో 64% వీధికుక్కల ద్వారా రేబిస్ వ్యాప్తి చెందుతోంది.



ఆస్పత్రుల ప్రాంగణాల్లో తిష్ట...

దేశంలో ఎన్నో ఆసుపత్రులు కుక్కలకు ఆవాస కేంద్రాలుగా ఉంటున్నాయి. రోగులు పడేసే ఆహార వ్యర్థాలను తింటూ అక్కడే తిష్ట వేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. తిండి దొరకనప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహణ సరిగ్గాలేని శవాగారాల్లోకి చొరబడి శవాలను సైతం పీక్కుతింటున్నాయి.

కుక్కల నియంత్రణ ఇలా...

- దేశవ్యాప్తంగా ఏకకాలంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ కష్టసాధ్యమైనందున నోటి ద్వారా వేసే టీకాలను అభివృద్ధి చేసి కుక్కలకు ఆహారంలో కలిపి అందించాలి. దీనివల్ల వాటి జాతిని వీలైనంత మేర కట్టడి చేయవచ్చు.
- వీధికుక్కల కట్టడికి మున్సిపాలిటీ, వెటర్నరీ, ఎన్జీవోలు, కుక్కల సంరక్షణ కేంద్రాలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి.
- వీధికుక్కల వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలను చైతన్యపరచాలి.

కొండగట్టు కాషాయమయం



కొండగట్టు (చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారి సన్నిధిలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో మాలధారులు, భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కాషాయమయమయ్యాయి. రామ నామస్మరణతో కొండంతా మార్మోగింది. వేకువ జామునుంచే మాలవిరమణ కార్యక్రమం ప్రారంభమైంది. లక్షకుపైగా దీక్షస్వాములు మాలవిరమణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

మైనర్ సమ్మతిని కోర్టు ఒప్పకోదు

- కర్ణాటక హైకోర్టు

యశవంతపుర: 18 ఏళ్ల లోపు మైనర్ బాలలు ప్రేమించుకోవచ్చు గానీ పెళ్లి చేసుకోవడం, శారీరకంగా కలవడం చట్టసమ్మతం కాదని కర్ణాటక హైకోర్టు అభిప్రాయపడింది. 17 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకుని లైంగికంగా వేధించిన కేసులో నిందితుడిపై పోక్సో కేసు నమోదు కాగా, అతడు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ వేశాడు. బుజ్జి అలియాస్ బాబు అనే వ్యక్తి నిందితుడు. న్యాయమూర్తి జస్టిస్ వి.శేషానంద ధర్మాసనం ఈ అర్జీని విచారించింది. ఇష్ట ప్రకారం లైంగికంగా కలిశామని బాలిక చెప్పినప్పటికీ.. నిందితుడికి బెయిల్ ఇవ్వడం సాధ్యపడదని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాలిక మైనర్ అయినందున ఆమె సమ్మతిని కోర్టు ఒప్పుకోదని తెలిపారు.విచారణ ముగిసే వరకు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదన్నారు.



కంచర్ల యాదగిరిరెడ్డి

అర నిమిషం తీరిక లేదు... అర్ధరూపాయి సంపాదన లేదు.. ఈ సామెత వింటుంటే ఈ తరం బడిపిల్లలు గుర్తుకు వస్తున్నారు. ఎప్పుడు చూసినా పుస్తకాల్లో తలమునకలై ఉంటారు. బాగా చదువుతున్నారే అని మురిసిపోయినా.. పరీక్షల్లో వచ్చి మార్కులు చూస్తే అత్తెసరు. ఈ తరం పిల్లల్లో ఎక్కువ మంది ఫోకస్డ్‌గా లేకపోవడమే దీనికి కారణమని నిపుణులు చెప్తున్నారు. అసలు పెద్దవారిక ఏకాగ్రత కూడా బాగా తగ్గిపోతోందని.. స్మార్ట్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలు, మాధ్యమాల వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్పష్టం చేస్తున్నారు.

- పిల్లల నుంచి పెద్దవారిదాకా తగ్గిపోతున్న ఏకాగ్రత
- స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, టీవీల వంటి డిజిటల్ పరికరాలే కారణం
- ఏ పనిపైనా ధ్యాస నిలపలేని పరిస్థితి
- ఆలస్యం, మానసిక ఒత్తిడి, అకారణంగా చిరాకు వంటి సమస్యలు
- ప్రధానంగా ఫోన్‌తో ఎక్కువ సమస్య అంటున్న నిపుణులు
- 'మైండ్‌ఫుల్ నెస్'ను ప్రాక్టీస్ చేయాలని సూచనలు

'ఫోకస్' తప్పుతోంది

దృష్టి మళ్లే దారులెన్నో..

- మునుపటితో పోలిస్తే పిల్లల దృష్టి మళ్లేందుకు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలు ఇలా ఎన్నో కారణమవుతున్నాయి. నిత్యం ఎవరో ఒకరి నుంచో, ఏదో వాట్సాప్ గ్రూపులోనో మెసేజీలు రావడం, ఫేస్‌బుక్ నోటిఫికేషన్లు, స్మార్ట్ వాచ్ మెసేజ్.. ఇలా తరచూ మన దృష్టిని తప్పిస్తున్నాయని, దీనివల్ల తదేకంగా ఒక పనిని శ్రద్ధగా చేసే శక్తిని కోల్పోతున్నామని నిపుణులు చెప్తున్నారు. సెల్‌ఫోన్లు రాక ముందు, సాంకేతిక విప్లవం లేనప్పుడు మనుషులు ఎలా ఉన్నారు? ఇప్పుడెలా ఉన్నారన్నదానిపై అమెరికాలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్, అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్'ఇటీవల ఓ అధ్యయనం చేసింది. 1946–1975 మధ్య కాలంలో పుట్టి, రకరకాల రంగాల్లో పనిచేస్తున్న వారిని, 1976–2000 మధ్య పుట్టి పలు రంగాల్లో ఉన్న వారిని, ప్రైమరీ స్కూల్, హైస్కూల్, కాలేజీ విద్యార్థులను ప్రశ్నించి.. ఐక్యూ టెస్ట్ పెట్టింది. ఉత్తర అమెరికా, యూరప్, ఆసియా దేశాల్లో ఈ అధ్యయనం సాగింది.



ఏ పనికైనా ఫోకస్ అవసరం!

మనం ఏ పనిచేయాలన్నా ఫోకస్ అనేది చాలా అవసరం. లేకుంటే ఏ పని సరిగా, త్వరగా పూర్తి చేయలేం. తరాలు మారుతున్న కొద్దీ ఫోకస్ టైం మారుతూ వస్తోందని అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు బేబీ బూమర్లు అంటే 1946–1964 మధ్య పుట్టినవాళ్లకు ఫోకస్ టైం ఇరవై నిమిషాలు ఉండేది. తర్వాతి తరం జనరేషన్ ఎక్స్ అంటే 1965–1980 మధ్య పుట్టినవారి ఏకాగ్రత 12 నిమిషాలకు చేరింది. 1981, ఆ తర్వాత పుట్టినవారికి ఇది కేవలం ఎనిమిది నుంచి 12 నిమిషాలే.. ఫోకస్ పెట్టలేకపోయినప్పుడు అరగంటలో చేయాలనుకున్న పని గంట, గంటన్నర పడుతుంది. పైగా చేసే పనిలో నాణ్యత ఉండదని.. యాంగ్జైటీ, డిప్రెషన్ వంటి సమస్యలూ వస్తాయని, మానసిక ఒత్తిడి పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. నాలుగేళ్ల కితం జరిగిన ఒక పరిశోధన ప్రకారం.. ఇంటర్నెట్ వాడకం మన మెదడులోని పలు ప్రాంతాల్లో మార్పులకు కారణమవుతుందని తేలింది. ఇలా మారిపోయే విషయాల్లో మన జ్ఞాపకాలూ ఉన్నాయని వెల్లడైంది. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్, అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్'అధ్యయనం ప్రకారం కూడా.. నిద్రకు ఉపక్రమించే ముందు స్మార్ట్‌ఫోన్ లేదా ఇతర డిజిటల్ స్క్రీన్లను చూడటం వల్ల నిద్రకు చేటు కలుగుతుంది. అది కాస్తా వారి రోజువారీ కార్యక్రమాలపై ప్రభావం చూపుతుంది.

వాటితో కేవలం పరధ్యానమే..

కంప్యూటర్ల వాడకంతో మనుషుల మానసిక స్థితిపై కలిగే ప్రభావంపై ఇంకో అధ్యయనం కూడా జరిగింది. ఆస్ట్రేలియాకు చెందిన డాక్టర్ షరోన్ హార్‌వుడ్ నిర్వహించిన ఆ అధ్యయనం ప్రకారం.. టెక్నాలజీ అనేది మన మేధో సామర్థ్యాన్ని వెంటనే మార్చేస్తుందనడం పూర్తిగా వాస్తవమేమీ కాదు. యుగాలుగా రకరకాల పరిస్థితులను ఎదుర్కొని పరిణామం చెందిన మెదడు పనితీరు ఒక్క తరంలో మారిపోదని ఆమె చెప్తున్నారు. కాకపోతే డిజిటల్ పరికరాలు మన మనసును పరధ్యానంలో పడేస్తాయని స్పష్టం చేస్తున్నారు.

పక్కన ఉన్నా ప్రభావమే..

మన పరిసరాల్లో స్మార్ట్‌ఫోన్, ఇతర డిజిటల్ స్క్రీన్ డివైజ్ ఉంటే చాలు మన ఏకాగ్రత స్థాయి గణనీయంగా తగ్గిపోతుందంటున్నారు నిపుణులు. ఆలోచించడం, గుర్తుంచుకోవడం, భావోద్వేగాల నియంత్రణకు కారణమైన విషయాలపై దృష్టిపెట్టడం వంటివాటిపై స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్, కంప్యూటర్ల వంటివి ప్రభావం చూపగలవని ఎన్నో అధ్యయనాల్లో తేలిందని స్పష్టం చేస్తున్నారు. చేతుల్లో, లేదా జేబులో, పక్కన టేబుల్‌పైనో స్మార్ట్‌ఫోన్ ఉంటే.. మన మనసు చేసే పనిపై కాకుండా ఫోన్‌కు వచ్చే నోటిఫికేషన్లు లేదా అది చేసే శబ్దాలపై పడుతుందని వెల్లడైందని వివరిస్తున్నారు.

క్షణం విడిచి ఉండలేకుండా..

- రోజులో గంటా రెండు గంటల పాటు స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేకపోయినా సరే నానా హైరానా పడే వారి సంఖ్య బాగా పెరిగిందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే పాశ్చాత్యదేశాల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారని.. మన దేశంలోనూ ఆ పరిస్థితి వస్తోందని హెచ్చరిస్తున్నారు. తక్షణ తృప్తి (ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్) కారణంగానే మనుషులు డిజిటల్ పరికరాలకు బానిసలవుతున్నట్టు వివరిస్తున్నారు. చాలా దేశాల్లో పిల్లలు నిపుణులు సూచించిన దాని కంటే ఎక్కువ సమయం డిజిటల్ తెరల ముందు గడుపుతుండటం ఆందోళనకరమని స్పష్టం చేస్తున్నారు.

'ఫోకస్'సమస్యను గుర్తించడమెలా?

- చేపట్టిన పనిని పూర్తి చేసేందుకు కష్టపడుతుంటే, కష్టం అనిపిస్తుంటే, అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోతుంటే ఫోకస్ కోల్పోయామని అర్థం.
- అకారణంగా చిరాకు అనిపిస్తున్నా, మన దృష్టి సులువుగా పక్కదారి పడుతున్నా, రెస్ట్‌లెస్‌గా అనిపిస్తున్నా.. ఫోకస్ కోల్పోయామని స్పష్టంగా తెలుస్తుంది.
- ముఖ్యమైన అంశాలను అప్పటికప్పుడు మర్చిపోతుంటే ఫోకస్ పోతున్నట్టే.

ఏమిటీ పరిష్కారం?

- ఫోకస్ పెంచుకునేందుకు సులువైన మార్గాలెన్నో ఉన్నాయి. మన ఏకాగ్రతను దెబ్బతీస్తున్న మొబైల్ ఫోన్ నోటిఫికేషన్, కంప్యూటర్ నోటిఫికేషన్ వంటివి ఆఫ్ చేయాలి లేదా అత్యవసరమైనవే వచ్చేలా సెట్ చేసుకోవాలి.
- ఏ పని ముందు చేయాలి? ఏ పని తరువాత చేయాలి? దేనికి ప్రాధాన్యత ఎక్కువ? దేనిని నిర్ణీత సమయం (డెడ్‌లైన్)లోపు పూర్తి చేసుకోవాలన్న దానిపై కొంత వర్క్ చేసుకుని ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయడం నేర్చుకుంటే ఫోకస్ పెరుగుతుంది.
- ప్రతిరోజు మైండ్ ఫుల్‌నెస్ ప్రాక్టీస్ చేయాలి. అంటే పూర్తిగా చేసే పనిపైనే ధ్యాస నిలిపాలి. ఉదాహరణకు.. ఉదయం లేవగానే బ్రష్ చేసేటప్పుడు ఆ బ్రషింగ్‌పై మాత్రమే, కాఫీ తాగేటప్పుడు దానిపై మాత్రమే ధ్యాస నిలిపేందుకు ప్రయత్నించాలి. ఇలా అన్ని పనులకూ వర్తింపజేయాలి. దీనిని రోజూ ప్రాక్టీస్ చేయడం ద్వారా ఫోకస్ ఆటోమేటిగ్గా పెరుగుతుంది.

- విశేష్, సైకాలజిస్ట్

ఇంటర్నెట్‌కు బానిసలైన జనాభా 8%

ప్రపంచవ్యాప్తంగా జనం ఇంటర్నెట్‌కు బానిసగా మారుతున్నారని పలు అధ్యయనాల్లో తేలింది. వాటి ప్రకారం..

- రోజులో ఒక్కొక్కరూ కనీసం 149 నిమిషాల పాటు స్మార్ట్‌ఫోన్‌ను చూస్తూ గడుపుతున్నారు.
- ప్రతి ఐదుగురిలో ఒకరు రాత్రిళ్లు నిద్రలేచి మరీ సోషల్ మీడియా పోస్టులు చూసుకుంటున్నారు.
- వీడియో గేమ్స్ ఆడే యువకులు వారంలో వాటిపై గడిపే సమయం 8 గంటలకు పైనే..
- అమెరికాలో ట్రాఫిక్ ప్రమాదాల్లో 26శాతం స్మార్ట్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేయడం వల్లనే జరుగుతున్నాయి!

తెలుగు సాహిత్య కార్యక్రమాల్లో 'కేంద్ర అకాడమీ' పాలుపంచుకోవాలి

తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్

సాక్షి, హైదరాబాద్: తెలుగు సాహిత్య ప్రముఖుల శత జయంతి ఉత్సవాల నిర్వహణ, తెలుగు భాషకు సంబంధించిన జాతీయ సెమినార్లలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం భాగస్వామి కావాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ కోరారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి జానపద సాహిత్యంపై తొలి పీహెచ్‌డీ చేసిన ఆచార్య బిరుదురాజు రామరాజు శత జయంతి ఉత్సవాల సందర్భంగా రెండు రోజుల జాతీయ సెమినార్‌ను నిర్వహించ తలపెట్టామని ఆయన తెలిపారు. అందులో పాల్గొనాలని కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్‌ను కోరామన్నారు. కేంద్ర అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు గురువారం గౌరీశంకర్‌తో భేటీ అయ్యారు. భవిష్యత్తులో చేపట్టబోయే సాహిత్య కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కేంద్ర సాహిత్యకాడమీ జనరల్ కౌన్సిల్ కార్యవర్గం తెలుగు సలహా మండలి కన్వీనర్ ప్రొఫెసర్ సి.మృణాళిణి, జనరల్ కౌన్సిల్ సభ్యులు ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ, ప్రసేన్, మందలపర్తి కిషోర్‌లను జూలూరు గౌరీశంకర్ ఘనంగా సన్మానించారు.

చేయని తప్పుకు నన్ను బలిచేశారు

ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి హరీశ్

కమలాపూర్: చేయని తప్పుకు తనను బలిచేశారని పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి దండెబోయిన హరీశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఈ నెల 4న హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన హరీశ్ గురువారం ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు పరీక్షకేంద్రానికి రాగా, డీఈవో ఎండీ అబ్దుల్ హై అతని హాల్‌టికెట్ తీసుకొని బయటకు పంపించారు. అనంతరం హరీశ్ తన తల్లి లలితతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ రోజు పరీక్ష కేంద్రం కిటికీ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి 'తమ్ముడు ప్రశ్నపత్రం ఇవ్వు' అని అడిగాడని, తాను ఇవ్వనని చెప్పి ఇన్విజిలేటర్‌కు చెబుదామనుకుంటున్న సమయంలో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని తెలిపాడు. తాను బెంచీ మధ్యలోకి జరగగానే అతను వెళ్లిపోయాడని భావించి ఆన్సర్‌షీట్ మార్జిన్ కొట్టుకుంటుండగా ప్రశ్నపత్రం లాక్కున్నాడని, ఫొటోలు తీసుకుని ఆ ప్రశ్నపత్రాన్ని తన వైపు విసిరేసి వెళ్లిపోయాడని పేర్కొన్నాడు. తనను చంపుతానని బెదిరించడంతో భయపడి ఆ విషయం ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. చేయని తప్పుకు తన భవిష్యత్‌ను బలి చేయకుండా హాల్‌టికెట్ ఇచ్చి యథావిధిగా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. కనీసం సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశమైనా ఇవ్వాలని ఉన్నతాధికారులను వేడుకున్నాడు. తన కొడుకు భవిష్యత్‌ను పాడు చేయకుండా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని హరీశ్ తల్లి లలిత వేడుకొంది.

చరిత్రతోపాటు ఆధునిక అంశాలను బోధించాలి

సాక్షి, హైదరాబాద్: చరిత్రతోపాటు ఆధునిక అంశాలను జత చేసి పాఠాలు బోధించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో ఉన్న మహాత్మాగాంధీ, మత సామరస్యాలకు సంబంధించిన అంశాలను తొలగించారనే వార్తలు వచ్చాయని ఆరోపించారు. సిలబస్ మారుస్తారేమో కానీ.. చరిత్రను తొలగించలేరని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ పాలనలో సాధించిన అంశాలతోపాటు నోట్ల రద్దు వల్ల జనం పడిన ఇబ్బందులు, కరోనాతో వచ్చిన కష్టాలను బోధించాలన్నారు.

నిఖత్ జరీన్‌కు డీజీపీ అభినందన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 50 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని గెలిచిన నిఖత్ జరీన్‌ను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. గురువారం బీఆర్‌కేఆర్‌భవన్ లో నిఖత్ జరీన్ సీఎస్ శాంతి కుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఒక సమావేశంలో పాల్గొనడానికి అక్కడకు వచ్చిన డీజీపీ అంజనీకుమార్ ఈ సందర్భంగా నిఖత్ జరీన్‌ను అభినందించి శాలువా కప్పి సత్కరించారు. యువ క్రీడాకారులకు జరీన్ ఆదర్శంగా నిలిచారని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్‌కుమార్ సుల్తానియా, రాహుల్ బొజ్జా పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943